ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 01.10.2025 | సంపుటి : 12 సంచిక : 73 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్









## ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ సంబురం

### 700 బతుకమ్మలతో మహిళలు ప్రదర్శన

బతుకమ్మ వేడుకల ముగింపు కార్యక్రమం హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఘనంగా జరిగింది. అమర వీరుల స్మారకం నుంచి ట్యాంక్ బండ్ వద్ద బతుకమ్మ ఘాట్ వరకు దాదాపు 700 బతుకమ్మలతో మహిళలు ప్రదర్శన నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ, టూరిజం కార్పొరేషన్ ఎండీ క్రాంతి, సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ అలేఖ్య పుంజాల, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారధ, హైదరాబాద్ కలెక్టర్ హరి చందన, సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ విమలక్క, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు.. బతుకమ్మ పాటలకు మహిళలతో కలిసి నృత్యం చేశారు. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా సచివాలయంపై 3డీ మ్యాప్ లేజర్ షో ఆకట్టుకుంది.

హైదరాబాద్(జనంసాక్షి)




## ప్రభుత్వ పథకాలే స్థానిక సమరంలో

# సత్తాచాటుతాయి

### బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్‌ల కుట్ర

- గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నాం
- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది మరిచారా!
- బీసీల పేర్లతో ఓట్లు అడిగిన ఈటల రాజేందర్ ఇప్పుడు ఎందుకు నోరు తెరవడం లేదు?
- బీసీ రిజర్వేషన్ల పెంపు ఎక్కడ ఆగిందో ఆయనే చెప్పాలి
- జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం
- మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్

హైదరాబాద్(జనంసాక్షి): బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన బాకీలకు తమ ప్రభుత్వం ఇప్పుడు వడ్డీలు చెల్లిస్తున్నదని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్య క్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ బాకీ కార్డు అంటూ బిఆర్‌ఎస్ చే స్తున్న ప్రచారాన్ని చూసి ప్రజలు నవ్వుకుం టున్నారని ఆయన మంగళవారం మీడి యా సమావేశంలో అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే బాకీ కార్డు అంటారా? అని ఆయన ప్రశ్నిం చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కే సాధ్యమని బిసి రిజర్వేషన్లతో మరోసారి స్పష్టమైందన్నారు. బిసి రిజర్వే షన్లు అమలు చేయడం తమ చిత్తశుద్ధికిని దర్శనమని ఆయన తెలిపారు. బిఆర్‌ఎస్-బిజెపి కలిసి సంసారం

మిగతా 2లో..

> బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన బాకీలకు తమ ప్రభుత్వం ఇప్పుడు వడ్డీలు చెల్లిస్తోంది. ఇచ్చిన హామీలు నెరవేరిస్తే బాకీ కార్డు అంటారా? బీఆర్‌ఎస్ చేస్తున్న ప్రచారాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం మా చిత్తశుద్ధికి నిదర్శనం. బీఆర్‌ఎస్, బీజేపీలు రెండు పార్టీలు ఒక్కటై ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయి. బీసీల పేర్లతో ఓట్లు అడిగిన బండి, ఈటల ఎందుకు నోరు తెరవడం లేదు. బీసీ రిజర్వేషన్ల పెంపు ఎక్కడ ఆగిందో ఈటల చెప్పాలి.ఈటల రాజేందర్ తాను ముదిరాజ్ బిడ్డనని అంటారని.. ఇప్పుడు బీసీల కోసం ఎందుకు మాట్లాడటం లేదు. - టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



## ఆసియాకప్‌లో మీ ఆట అద్భుతం

### క్రికెటర్ తిలక్‌వర్మను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన క్రికెటర్ తిలక్‌వర్మ.. సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తిలక్‌వర్మను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి తిలక్‌వర్మ తన బ్యాట్‌ను బహుకరించారు.కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, శాట్స్ ఎండీ సోనిబాల దేవి, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. - హైదరాబాద్, జనంసాక్షి




## 'తెలుగుతల్లి' ఫ్లైఓవర్..ఇకపై 'తెలంగాణ తల్లి' ఫ్లైఓవర్



### పైవంతెన పేరు మార్చిన రాష్ట్ర ప్రభుత్వం

నగరంలోని తెలుగుతల్లి ఫ్లైఓవర్ పేరు మారింది. 'తెలంగాణ తల్లి' ఫ్లైఓవర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నామకరణం చేసింది. రాష్ట్ర సచివాలయం ప్రాంతంలో ఉన్న పైవంతెన వద్ద బోర్డుపై 'తెలంగాణ తల్లి' ఫ్లైఓవర్‌గా పేర్కొన్నారు. - హైదరాబాద్, జనంసాక్షి

## పరుగు ఆపని పసిడి..

- చుక్కలు చూపిస్తున్న బంగారం ధరలు
- తాజాగా మరో రూ.1420 పెరుగుదల

హైదరాబాద్(జనంసాక్షి): 2025 దసరా, దీపావళి పండుగల వేళ బంగారం కొనుగోలుదారులకు వరుస షాక్‌లు తలుగుతున్నాయి. పండుగ వేళ పసిడి ధరలు భారీగా పరుగులు పెడుతున్నాయి. మొన్నటి వరకు

మిగతా 2లో..



# కొలువుల ప్రభుత్వం

### అప్పుడు.. ఇప్పుడు.. కాంగ్రెస్ పాలనలోనే గ్రూప్-1 నియామకాలు

- గత పదేళ్లలో నిరుద్యోగుల కలలు కలలుగానే మిగిలాయి
- అవి నేడు ప్రజాపాలనలో నిజమవుతున్నాయి
- స్టాంప్స్,రిజిస్ట్రేషన్ శాఖకు వన్నెతేవాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు కన్న కలలు గడచిన పది సంవత్సరాలలో కలలుగానే మిగిలాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం వారి కలలను నిజం చేస్తోందని అన్నారు.పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్ -1 నియామకాల్లో ఎంపికై స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖలో జిల్లా రిజిస్ట్రార్‌లుగా నియమితులైన పలువురు అభ్యర్థులు మంగళవారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు.ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని, ఈ కీలక సమయంలో కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న అభ్యర్థులపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో 2011 లో గ్రూప్ -1 కు నోటిఫికేషన్ జారీ చేయగా, 2018 లో భర్తీ ప్రక్రియ పూర్తయిందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ -1 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు జారీ చేస్తే మీరేంది భర్తీ చేసేది, తెలంగాణ సాధించుకున్నతర్వాత స్వరాష్ట్రంలో మా ఉద్యోగాలను మేమే భర్తీ చేసుకుంటామని నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించి అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తని ఆ పార్టీ నాయకులు ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం శోచనీయమన్నారు.ఉద్యోగాలు ఇవ్వాలన్నా , పేదలకు అండగా

మిగతా 2లో..

### 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం

# కొనుగోలు చేస్తాం

### కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇవ్వాలి: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్(జనంసాక్షి): ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ ఇప్పటి వరకు అత్యధికంగా ధాన్యం సేకరణకు సిద్ధమవుతోందని, సేకరణ లక్ష్యాలను అత్యవసరంగా సవరించాలని, డెలివరీ నిబంధనలను సడలించాలని అదనపు నిల్వ రవాణా సౌకర్యాలను కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. "ఈ ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం గా ఉందని, ఇది తెలంగాణ చరిత్రలో అప్పటి వరకు లేదని దేశంలోని ఏ రాష్ట్రంలో లేనంత అత్యధికమని, గత ఏడాది రికార్డు 67 లక్షల మెట్రిక్ టన్నులు" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. 45%-50 ఎల్‌ఎంటీలు సన్నటి వరి మరియు 30-35 ఎల్‌ఎంటీలు ముతక ధాన్యం సేకరించనున్నామని ఆయన వివరించారు. క్వింటాలు ధాన్యానికి రూ.2,389 కనీస మద్దతు ధర నిర్ణయించిన తర్వాత, 80 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు దాదాపు రూ.20,000 కోట్లు వ్యయం అవుతుందని, "బోనస్ చెల్లింపులు మరియు రవాణా ఖర్చులతో, ఖర్చు రూ.24,000 నుంచి రూ.26,000 కోట్ల మధ్య పెరుగుతుందని వివరించారు. దేశంలో ఒకే పంట వరి పంట కోసం ఖర్చు చేయాల్సిన అత్యధిక మొత్తం ఇది" అని ఆయన అన్నారు. 2024-25 కోసం కస్టమ్ మిల్డ్ రైస్ డెలివరీ గడువును నవంబర్ 12, 2025 వరకు పొడిగిస్తూ, పార్బాయిల్డ్ రైస్‌గా మాత్రమే సరఫరాను తప్పనిసరి చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుపై ఉత్తమ్ కుమార్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. "ముడి బియ్యం మార్పిడికి ఖరీఫ్ వరి మరింత అనుకూలంగా ఉంటుందని. అందుబాటులో ఉన్న స్టాక్‌లో, 7.80 లక్షల మెట్రిక్ టన్నులు ముడి బియ్యం మిల్లర్ల వద్ద ఉన్నాయి, అయితే 1.67 ఎల్‌ఎంటీల వరి (1.13 ఎల్‌ఎంటీలల బియ్యానికి సమానం) బాయిల్డ్ రైస్ మిల్లర్ల వద్ద ఉంది. లభ్యతను బట్టి ముడి బాయిల్డ్ రైస్ రెండింటినీ డెలివరీ చేయడానికి అనుమతి ఇవ్వాలని బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని రబీ సీజన్‌కు

మిగతా 2లో..

### డ్రగ్స్‌పై ఉక్కుపాదం

# మోపుతాం

- హైదరాబాద్‌లో నేరాల కట్టడికి కఠిన చర్యలు చేపడతాం
- ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను వీఐపీలు ప్రమోట్ చేయొద్దు
- మద్యం తాగి రోడ్లపైకి వాహనాలతో వచ్చేవారిని రోడ్ టెర్రరిస్టులుగా పరిగణిస్తాం.. నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది
- హైదరాబాద్ నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించిన సజ్జనార్



హైదరాబాద్(జనంసాక్షి): నగరంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. నగర నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. "దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం హైదరాబాద్. ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డ్రగ్స్. దీనిపై ఉక్కుపాదం మోపుతాం. డ్రగ్స్ సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుని ముందుకెళ్తాం. అవసరమైతే మరింత సిబ్బందిని కేటాయించి చర్యలు తీసుకుంటాం. నగరంలో సైబర్ నేరాలు అరికట్టేందుకు అనేక చర్యలు చేపట్టాం.

మిగతా 2లో..



## తమిళనాడులో ఘోర విషాదం

### ఎన్నోర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదం.. 9 మంది మృతి!

చెన్నై(జనంసాక్షి):తమిళనాడులోని ఎన్నోర్ థర్మల్ పవర్ ప్లాంటులో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో తొమ్మిది మంది కార్మికులు మృతి చెందినట్లు తెలుస్తోంది. నిర్మాణంలో ఉన్న భవనం కూలడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు

మిగతా 2లో..

## 'ఖాకీ'చకులు

- ఏపీ యువతిపై తమిళనాడు పోలీసుల అత్యాచారం
- విచారణ పేరుతో బాధితురాలిపై ఆకృత్యం

9లో..

# ఆగని సుంకాల మోత

### వరుస షాక్‌లు ఇస్తున్న ట్రంప్ • కలపపై 10% ఫర్నీచర్‌పై 25 % టారీఫ్‌లు



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబ్ పేల్చారు. ఇటీవల చెప్పినట్టుగానే.. కలప, ఫర్నిచర్‌పై సుంకాల మోత మోగించారు. కలపపై 10 శాతం.. కిచెన్ క్యాబినెట్‌లు, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై 25 శాతం సుంకాలను విధించారు. ఈ సుంకాలు అక్టోబర్ 14 నుంచి అమల్లోకి రానున్నాయి. అమెరికా జాతీయ భద్రత, దేశీయ తయారీని పెంచడంలో భాగంగా ట్రంప్ టారిఫ్‌లను వరుసగా పెంచుతున్నారు. కిచెన్ క్యాబినెట్, బాత్‌రూమ్ పరికరాలు, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్, భారీ ట్రక్కులపై భారీ సుంకాలు విధిస్తానంటూ ఇటీవల డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా కలప, కిచెన్ క్యాబినెట్‌లు, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై సుంకాలు విధించారు. అమెరికాలో ఫర్నిచర్ తయారు చేయకపోతే.. భారీ స్థాయిలో సుంకాలను విధిస్తామని హెచ్చరించారు. చైనాతో సహా ఇతర దేశాల దిగుమతుల కారణంగా.. ఫర్నిచర్ వ్యాపారానికి కేంద్ర స్థానంగా ఉండే నార్త్ కరోలినా దాని ప్రభావాన్ని కోల్పోయిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవలి నెలల్లో అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకున్న కొన్ని దేశాలు తాజా సుంకాల నుంచి బయటపడనున్నాయి. జాతీయ భద్రతా ముప్పును ఎదుర్కోవడానికి సుంకాలు విధించడానికి అనుమతించే సెక్షన్ 232 ప్రకారం.. సుంకాలను డొనాల్డ్ ట్రంప్ వర్తింపజేస్తున్నారు. ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్, రాగి సహా ఇతర దిగుమతులపై రంగాల వారీ సుంకాలను వర్తింపజేయడానికి అనేక సారూప్య దర్యాప్తులను ప్రారంభించింది. సిమాలపై కూడా ట్రంప్ భారీగా సుంకాలు ప్రకటించారు. అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై ఏకంగా 100 శాతం అదనపు టారిఫ్‌లు విధిస్తానని ఆయన ప్రకటించారు.

## శాంతి ఫార్ములాపై స్పందించండి

- మీకు కేవలం 3 రోజులే గడువు
- లేదంటే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది
- హమాస్‌కు ట్రంప్ హెచ్చరిక
- ట్రంప్ ప్రణాళిక దీర్ఘకాలిక శాంతికి మార్గం: ప్రధాని మోదీ

2లో..

## హెచ్-1బీ లాటరీ విధానంలో మార్పులు

- డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదనలు
- ఇమిగ్రేషన్ నిబంధనల అమలు కట్టుదిట్టం
- ఓపిటి ప్రోగ్రామ్ విద్యార్థులు లక్ష్యంగా దాడులు

### 'అణు' బెదిరింపులకు

# భయపడం

### భవిష్యత్తులో యుద్ధాల స్వభావం పూర్తిగా మారిపోనుంది : సీడీఎస్ అనిల్ చౌహాన్



న్యూఢిల్లీ(జనంసాక్షి): భవిష్యత్తులో యుద్ధాల స్వభావం పూర్తిగా మారిపోనుందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. భవిష్యత్తులో అణు బెదిరింపులు రేడియో ధార్మిక పదార్థాల ప్రయోగాలు వంటి వాటిని ప్రపంచదేశాలు యుద్ధతంత్రాలుగా వినియోగించే అవకాశం ఉందన్నారు. అలాంటివాటిని ఎదుర్కోవాలంటే అణ్వాయుధాల నుంచి వచ్చే రేడియో ధార్మిక కాలుష్యంతో డీల్ చేయడంపై భారత్‌లో శిక్షణనివ్వాల్సిన అవసరముందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తంగా ఉండాలన్నారు. మిలిటరీ నర్సింగ్ సర్వీసెస్ 100 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవంలో ప్రసంగిస్తూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో ఇతరదేశాల నుంచి వచ్చే అణు బెదిరింపుల కు వ్యతిరేకంగా పోరాడాలంటే భారత్ అన్నిరకాలుగా సిద్ధంగా ఉండాలని

మిగతా 2లో..

## ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు

- ఇంటింటికీ బాకీ కార్డులు పంచుతాం
- ఎంత బాకీ ఉన్నారో నిలదీయాలి : హరీశ్

సిద్దిపేట(జనంసాక్షి):తెలంగాణ కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి గ్యారంటీలకు టాటా చెప్పిండు.. లంకె బిందెలకు వేటపట్టిండు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్లు వేశారు. అబద్ధపు హామీలతో నమ్మించి గొంతు కోసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ బాకీ కార్డు విడుదల కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొని ప్రసంగించారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏం బాకీ పడింది? ఒక్కొక్క మహిళకు ఎంత బాకీ పడింది? ఒక్కొక్క రైతుకు ఎంత బాకీ పడింది? ఒక్కొక్క ఇంటికి ఎంత బాకీ పడ్డదో తెలిసేలా బాకీ కార్డు విడుదల చేస్తున్నాం అన్నారు. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు పండుగకు ఊర్లకు వస్తారు. సిద్దిపేట నియోజకవర్గంలో ప్రతి ఇంటికి బాకీ కార్డు పంపిణీ చేయాలి. గ్రామ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు,

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
01.10.2025

# హైకోర్టు తీర్పు ప్రకారమే అనుమతుల పునరుద్ధరణ

**హైదరాబాద్(జనంసాక్షి):** హైకోర్టు తీర్పును అనుసరించి రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో ఆదిత్య కంపెనీ నిర్మాణ సంస్థకు హెచ్ఎండిఏ అనుమతులను పునరుద్ధరించింది. ఇందులో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదు. 2022 లోనే ఆదిత్య కేడియా రియాల్టర్స్ కంపెనీకి రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని మంచిరేవుల గ్రామంలో 9.19 ఎకరాల విస్తీర్ణంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి హెచ్ఎండిఏ అనుమతులు ఇచ్చింది. అయితే, మూసీ నది బఫర్ జోన్‌ను ఆక్రమించి అక్కడ రిటైనింగ్ వాల్ ను నిర్మించినట్లు 2023 జూలై 3న హెచ్ఎండిఏ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చేపట్టిన సంయుక్త తనిఖీలు తేలింది. 2023 ఆగస్టు 2న ఆ సంస్థకు హెచ్ఎండిఏ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ సంస్థ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేనందున 2023ఆగస్టు 18న భవన నిర్మాణ అనుమతులను రద్దు చేసింది. రిటైనింగ్ వాల్ ను తొలగించాలని ఆ సంస్థకు హెచ్ఎండిఏ ఆదేశాలు జారీ చేసింది.అనుమతులను రద్దు చేయడానికి సవాలు చేస్తూ ఆదిత్య సంస్థ హైకోర్టుకు వెళ్లింది. మరోసారి తనిఖీలు చేపట్టి నివేదిక ఇవ్వాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు ఉత్తర్వులను అనుసరించి 202426 ఫిబ్రవరిన అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఆ సంస్థ రిటైనింగ్ వాల్‌ను తొలగించినట్లు తేలింది. అనుమతులను పునరుద్ధరించాలని 2024 మార్చి1న హైకోర్టు తీర్పు ఇచ్చింది.హైకోర్టు తీర్పు నేపథ్యంలో భవన నిర్మాణ అనుమతులను పునరుద్ధరించాల్సిన అనివార్యత ఏర్పడింది. 20 జూన్ 2024న అనుమతులను పునరుద్ధరిస్తూ హెచ్ఎండిఏ ఉత్తర్వులు జారీ చేసింది.కాగా, మంచిరేవుల గ్రామంలోని సర్వే నెంబరు 476/ఏఏ1, 476/ఏఏ2 లోని 9.19 ఎకరాల విస్తీర్ణంలో 38 అంతస్తుల బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ 2022 మే 12న హెచ్ఎండిఏ కార్యాలయానికి ఆదిత్య సంస్థ దరఖాస్తు చేసింది. ప్రతిపాదిత భూమికి సమీపంలో మూసీ నది ఉన్నట్లు గుర్తించి ఆ సంస్థను స్పష్టత అడగడం జరిగింది. 20218 అక్టోబరున ఇరిగేషన్ శాఖ , రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఎన్వోసీలను హెచ్ఎండిఏ కు సమర్పించింది. ఆదిత్య కంపెనీ ప్రతిపాదనలను మల్టీ స్టోర్డ్ బిల్డింగ్ కమిటీ సమావేశంలో చర్చించిన తర్వాత భవన నిర్మాణ అనుమతులను ఇవ్వడానికి నిర్దేశిత ఫీజు చెల్లించాలని ఆ సంస్థకు సూచించింది. నిర్ణీత ఫీజు చెల్లించిన తర్వాతే హెచ్ఎండిఏ 19 ఆగస్టు 2022న భవన నిర్మాణ అనుమతులను జారీ చేసింది.

# శాంతి ఫార్ములాపై స్పందించండి

**వాషింగ్టన్(జనంసాక్షి):**గాజాలో యుద్ధం ముగింపునకు తాము సూచించిన శాంతి ఫార్ములాపై హమాస్ స్పందన తెలియజేసేందుకు మూడు, నాలుగు రోజులు గడువు ఇస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. లేదంటే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ ఒప్పందానికి అంగీకరించకుంటే ముగింపు విషాదంగా ఉంటుందని హెచ్చరించారు. ఇదే అంశంపై వైట్‌హౌస్ బయట మీడియాతో మాట్లాడారు."ఈ ప్రతిపాదనపై భాగస్వామ్య పక్షాలన్నీ స్పందించాయి. ఇజ్రాయెల్ సహా అరబ్ దేశాలు అంగీకరించాయి. ముస్లిం దేశాలు కూడా ఓకే చెప్పాయి. హమాస్ స్పందన కోసం వేచి చూస్తున్నాం. వారు అంగీకరిస్తారో లేదో తెలియదు. మూడు-నాలుగు రోజులు వేచి చూద్దాం. ఒకవేళ అంగీకరించకుంటే ముగింపు చాలా విషాదంగా ఉంటుంది. ఇజ్రాయెల్ ఏం చేయాలో అది చేస్తుంది" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. కాల్పుల విరమణగా పేర్కొంటున్న ఈ శాంతి ఒప్పందం ప్రకారం.. 72 గంటల్లో బందీలను హమాస్ విడిచిపెట్టాలి. ఇజ్రాయెల్ కూడా క్రమంగా గాజా నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకునేలా ప్రతిపాదనలు చేశారు. అయితే, దీనిపై హమాస్ చర్చలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాజకీయ, సైనిక నాయకత్వంతో సంప్రదింపులు ప్రారంభించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, సంక్లిష్టతల కారణంగా వీటికి మరిన్ని రోజులు పట్టే అవకాశం ఉందని సమాచారం.మరోవైపు ఇజ్రాయెల్-గాజా సంక్షోభంపై ట్రంప్ సూచించిన శాంతి ప్రణాళికపై భారత్ ఇప్పటికే స్పందించింది. ట్రంప్ ప్రతిపాదనను స్వాగతించిన ప్రధాని మోదీ.. దీర్ఘకాలిక శాంతికి మార్గమని అన్నారు. ఫ్రాన్స్, ఇటలీ ప్రధానులు కూడా ట్రంప్ ప్రణాళికకు మద్దతు ప్రకటించారు. హమాస్ మాత్రం తమవద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలను వదిలేయడానికి సిద్ధంగా ఉన్నామని, ట్రంప్ సూచించిన ప్రణాళికపై మాత్రం అధ్యయనం చేసి అభిప్రాయం వెల్లడిస్తామని చెబుతోంది.

**ట్రంప్ ప్రణాళిక దీర్ఘకాలిక శాంతికి మార్గం: మోదీ**

సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 21 సూత్రాల శాంతి ఫార్ములాను సూచించిన సంగతి తెలిసిందే. దీనికి ఇజ్రాయెల్ కూడా అంగీకరించింది. తాజాగా ట్రంప్ ప్లాన్‌ను భారత ప్రధాని మోదీ స్వాగతించారు. అమెరికా అధ్యక్షుడి ప్రణాళిక దీర్ఘకాలిక శాంతికి మార్గమని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'గాజాలో యుద్ధం ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సమగ్ర ప్రణాళికను స్వాగతిస్తున్నాం. ఇది పాలస్తీనా, ఇజ్రాయెల్ ప్రజలతో పాటు పశ్చిమాసియా ప్రాంతానికి దీర్ఘకాలిక, స్థిరమైన శాంతిభద్రతకు మార్గమవుతుంది. యుద్ధం ముగించి, శాంతిని నెలకొల్పే ఈ ప్రయత్నానికి అందరూ మద్దతు ఇస్తారని ఆశిస్తున్నా' అని మోదీ రాసుకొచ్చారు.

# హెచ్-1బీ లాటరీ విధానంలో మార్పులు

- డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ప్రతిపాదనలు
- ఇమిగ్రేషన్ నిబంధనల అమలు కట్టుదిట్టం
- ఓపిటి ప్రోగ్రామ్ విద్యార్థులు లక్ష్యంగా దాడులు

**వాషింగ్టన్(జనంసాక్షి):**హెచ్-1బీ కోసం ప్రస్తుతమున్న లాటరీ విధానాన్ని మార్చాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ భావిస్తోంది. అధిక నైపుణ్యం కలిగిన విదేశీయులను మాత్రమే అనుమతించడం, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించే ఉద్దేశంతో వీటిని రూపొందించినట్లు తెలుస్తోంది. ఉద్యోగి వేతనస్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ (ఒకటి నుంచి నాలుగు) ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటి చర్యలు తీసుకోనున్నారు.హెచ్-1బీ, ఎల్-1 వీసాలను సంస్కరించాలని, విదేశీ ఉద్యోగుల నియామకం విషయంలో కఠిన నిబంధనలు ఉండాలని పలువురు యూఎస్ సెనెటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు సెనెటర్లు చక్ గ్రాస్లీ, డిక్ డర్బిన్ బిల్లును ప్రవేశపెట్టారు. కార్పొరేట్ దుర్వినియోగాన్ని అరికట్టి అమెరికా ఉద్యోగులను రక్షించడమే లక్ష్యమని ఈసందర్భంగా వారు వెల్లడించారు. హెచ్-1బీ వీసా ల విషయంలో అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇటీవల వాటి ఫీజును 215 డాలర్ల నుంచి లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 ఫిబ్రవరికి ముందే ఆ వీసాల జారీ ప్రక్రియలో గణనీయమైన మార్పులు ఉంటాయని వెల్లడించారు. పాత విధానంలో లోపాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇటీవల ట్రంప్ ప్రకటించిన వీసా ఫీజు ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. హెచ్-1బీ వీసా పై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు మాత్రమేనని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పష్టత ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ వన్‌టైమ్ లక్ష డాలర్ల రుసుము ఇకపై కొత్తగా హెచ్-1బీ వీసాకు దరఖాస్తు చేసుకునేవారికే అమలుచేస్తామని, ప్రస్తుత వీసాదారులకు, రెన్యూవల్‌కు వర్తించదని చెప్పారు.

# ప్రభుత్వ పథకాలే స్థానిక సమరంలో సత్తాచాటుతాయి



చేస్తున్నాయని ఆ యన విమర్శించారు. ఆ రెండు పార్టీలు ఒక్కటై ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయని అన్నారు. బాకీల గురించి మాట్లాడితే మొదటి ముద్దాయి బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అవుతారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ బాకీ కార్డు అంటూ బిఆర్ఎస్ ప్రచారం చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పల రాష్ట్రంగా మార్చిన మీకు బకాయి అనే పదం కూడా పలికే అర్హత లేదన్నారు.

**తామే గెలుస్తామని ధీమా**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తామే గెలుస్తా మని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలో మంచి మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తారని జోస్యం చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 85 శాతం తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ అప్పుల పాల్జేశారని ఆరోపించారు. కేసీఆర్ చేసిన బాకీలను తమ ప్రభుత్వం కడుతోందని చెప్పుకొచ్చారు. మిగులు తెలంగాణ రాష్ట్రాన్ని బాకీ రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతోందని ఎద్దేవా చేశారు. బాకీ కార్డు అని బీఆర్ఎస్ నాయకులు అంటుంటే జనాలు నవ్వుతున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం బాకీ పడినట్లా..? అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేరిస్తే బాకీ పడినట్లా..? అని నిలదీశారు. తెలంగాణ ప్రజల ఆత్మహత్యలకు కారణం కేసీఆర్ ప్రభుత్వమేనని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు డ్రామాలు చేస్తే ప్రజలు తిరుగబడతారని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు కలిసి పదేళ్లు కాపురం చేశారని ఆక్షేపించారు. ఇప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ కలిసే ఉన్నాయని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు.. ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో వారే చెప్పాలని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నల వర్షం కురిపించారు.

**ఎంపీ ఈటలకి మహేష్ గౌడ్ కౌంటర్**

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. జీవితాంతం బీసీల పేర్లతో ఓట్లు అడిగిన వారు ఇప్పుడు ఎందుకు నోరు తెరవడం లేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు ఎక్కడ ఆగిందో ఈటల రాజేందర్ చెప్పాలని నిలదీశారు. ఈటల రాజేందర్ తాను ముదిరాజ్ బిడ్డనని అంటారని.. ఇప్పుడు బీసీల కోసం ఎందుకు మాట్లాడటం లేదని ఫైర్ అయ్యారు. బీసీల నోటి దగ్గర ముద్ద లాక్కుంటున్నా ఈటల, బండి సంజయ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కలిసి కోర్టులో పిల్స్ వేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కొలువుల ప్రభుత్వం



ఉండాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే సాధ్యమని తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేసి ప్రజాప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలోనూ గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి నియామకాలు జరిపిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో క్రమం తప్పకుండా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ -1 నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేసేవారని ఏ ఉద్యోగిని అడిగినా ఫలాన సంవత్సరంలో నియమితులయ్యామని చెప్పేవారు. కానీ దురదృష్టవశాత్తూ గడచిన పదేళ్లలో ఒక్క గ్రూప్-1 ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యోగాల భర్తీకి సంబంధించిన టిజిపిఎస్సీని పూర్తిగా నిర్వీర్యం చేశారని, ఈ దశలో అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం టిజిపిఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసి గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లు జారీ చేయడమేకాకుండా ఉద్యోగాలను కూడా భర్తీ చేస్తోందని అన్నారు. ఏడాదిన్నరలోనే దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఇది చూసి ఓర్వలేని కొంతమంది ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖను ఒక ఆదాయ వనరుగానే చూసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఎన్నో సంస్కరణలు తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజల సమయాన్ని ఆదా చేసేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చామని కార్పోరేట్‌కు ధీటుగా అత్యంత ఆధునిక వసతులతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు ఆకాంక్షలకు అనుగుణంగా నిజాయితీతో నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రభుత్వ పేరు ప్రతిష్ఠలను పెంచాలని ఈ సందర్భంగా కొత్తగానియమితులైన జిల్లా రిజిస్ట్రార్లకు మంత్రి సూచించారు.

# 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తాం

మార్చాలని మేము కేంద్రాన్ని అభ్యర్థిస్తున్నాము" అని ఆయన వివరించారు. లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానమైన 53.60 లక్షల మెట్రిక్ టన్నుల సేకరించాలని, లేకుంటే లక్షలాది మంది రైతులు ధాన్యం అమ్మకాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారు" అని ఆయన అన్నారు. గత రబీ సీజన్‌లో తెలంగాణ 74 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించగా, కేంద్రం 53 లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే ఆమోదించింది. "ఇప్పటికే సేకరించిన రబీ పంట నుండి మరో 10 లక్షల మెట్రిక్ టన్నులు తీసుకోవాలని మరియు సేకరణ గడువును అక్టోబర్ 31 నుండి జనవరి 31, 2026 వరకు పొడిగించాలని కోరారు. "అదనపు లిఫ్టింగ్ మరియు నిల్వను ఏర్పాటు చేయకపోతే, సజావుగా కొనుగోళ్లు జరగడం సాధ్యం కాదని మార్కెట్‌ను స్థిరీకరించడానికి, అమ్మకాల ఇబ్బందులను నివారించడానికి మరియు రైతుల సంక్షేమాన్ని కాపాడటానికి డెలివరీ నిబంధనలను సవరించడం, నిల్వ స్థలాన్ని సృష్టించడం మరియు కొనుగోళ్ల లక్ష్యాలను పెంచడం చాలా అవసరం" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.తెలంగాణ తన కేటాయించిన కొనుగోళ్ల లక్ష్యాలను నిరంతరం అధిగమించిందని మరియు 7,000 కంటే ఎక్కువ కొనుగోలు కేంద్రాలు, పటిష్టమైన మిల్లింగ్ సామర్థ్యం , రవాణా మరియు నిల్వ మౌలిక సదుపాయాలను కేంద్రం మద్దతుతో కొనసాగుతోందని ఆయన అన్నారు.

# పరుగు ఆపని పసిడి..

వందల్లో పెరిగిన గోల్డ్ రేట్స్.. ఇప్పుడు వేలల్లో పెరుగుతోంది. వరుసగా రెండో రోజు వెయ్యిగా పైగా పెరిగింది. నిన్న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1410 పెరగగా.. ఈరోజు రూ.1420 పెరిగింది. అలానే 22 క్యారెట్లపై రూ. 1300, రూ.1300 పెరిగింది. దీంతో పసిడి ధర ఆల్‌టైమ్ రికార్డులను నమోదు చేస్తోంది. బులియన్ మార్కెట్‌లో మంగళవారం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,08,450గా.. 24 క్యారెట్ల ధర రూ.1,18,310గా నమోదైంది. హైదరాబాద్ మార్కెట్‌లో ఇవే ధరలు కొనాగుతున్నాయి. తులం 50 వేలు ఉన్నప్పుడు ఎక్కువ ధర అనుకున్నారు. ఇప్పుడు ఏకంగా లక్ష 20 వేలకు చేరువైంది. ఇంకొన్నిరోజులు గడిస్తే సామాన్య జనాలు బంగారం గురించి మర్చిపోవాలేమో అని అనిపిస్తోంది. బంగారం పెరుగుల ఇలానే ఉంటుందని ఇటీవల నిపుణులు చెప్పారు. మరికొన్ని నెలల్లో రెండు లక్షల రూపాయలకు వెళ్లినా ఆశ్చర్యపోనక్కర్లేదు. బంగారంతో పాటు వెండి ధర కూడా భారీ స్థాయిలో పెరుగుతోంది. ముఖ్యంగా ఈ 10 రో ఓజుల్లో ఏకంగా 16 వేలు పెరిగింది. ఈ రెండు రోజుల్లో వరుసగా వెయ్యి పెరిగింది. ఈరోజు బులియన్ మార్కెట్‌లో కిలో వెండి రూ.1,51,000గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో కిలో వెండి ఒక లక్ష 61 వేలుగా నమోదైంది. ధంతేరాస్, దీపావళి సీజన్‌లో బంగారం కొనుగోళ్లు ఎక్కువగా ఉంటాయి. పండుగ సీజన్‌లో బంగారం, వెండి ధరలు ఇంతలా పెరిగిపోతుండటం సామాన్యులను కలవర పరుస్తోంది. ప్రపంచంలో ఆర్థిక పరిస్థితులు, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధాలు, రూపాయి విలువ, సెంట్రల్ బ్యాంకు బంగారం రిజర్వులు.. పలు కారణాల వల్ల గోల్డ్ అండ్ సిల్వర్ రేట్స్ ప్రభావితం అవుతాయన్న విషయం తెలిసిందే.

# తమిళనాడులోని ఘోర విషాదం

సమాచారం. సహాయక చర్యలు చేపట్టిన అధికారులు.. క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# 'అణు' బెదిరింపులకు భయపడం

అనిల్ చౌహాన్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ప్రధాని మోదీ తమతో మాట్లాడుతూ.. భారత్ అణు బెదిరింపులకు ఎన్నడూ భయపడకూడదని చెప్పినట్లు అనిల్‌చౌహాన్ తెలిపారు. అందుకు అనుగుణంగా దేశంలో రక్షణ వ్యవస్థను, ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేసుకోవాలని సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలు భారీగా అణ్వాయుధాల తయారీని చేపడుతున్నాయన్నారు. 1926లో స్థాపించిన మిలిటరీ నర్సింగ్ సర్వీస్ వందేళ్లుగా దేశ సైన్యానికి అందిస్తున్న సేవలను అనిల్ చౌహాన్ కొనియాడారు. సైనికులు యుద్ధాల్లో ఉన్నా, సముద్రాలపై ఓడల్లో ఉన్నా, నర్సింగ్ సిబ్బంది అన్ని అడ్డంకులకు ఎదురెళ్తూ వారిని కాపాడుతున్నారని అన్నారు.

# బీహార్ తుది ఓటరు జాబితా విడుదల

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పూర్తి చేసిన కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా తుది జాబితాను విడుదల చేసింది. ముసాయిదా జాబితాకు సంబంధించి వచ్చిన అన్ని ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని దీనిని ప్రకటించినట్లు పేర్కొంది. దీంతో మరికొన్ని రోజుల్లోనే బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం కనిపిస్తోంది. బిహార్‌లో 22 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అనేక వివాదాలకు నెలవుగా మారింది. చివరకు పూర్తి చేసిన ఎన్నికల సంఘం.. ఇందుకు సంబంధించిన ముసాయిదా జాబితాను నెల క్రితం ప్రకటించింది. అభ్యంతరాలు వెల్లడించేందుకు గడువు ముగియడంతో తాజాగా తుది జాబితా విడుదల చేసినట్లు ప్రకటించింది. ఓటర్లు తమ వివరాలను సంబంధిత లింక్ ద్వారా చెక్ చేసుకోవచ్చని బిహార్ సీఈవో సూచించారు.



# డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాం



కేటుగాళ్లు ఎక్కువగా వృద్ధులను టార్గెట్ చేసి మోసం చేస్తున్నారు. సైబర్ నేరాలపై అవగాహన, అప్రమత్తత లేక అనేక మంది నష్టపోతున్నారు. వీటిపై నగర ప్రజలంతా అవగాహన పెంచుకోవాలి. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో వచ్చే కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలి.హైదరాబాద్‌లో నేరాల కట్టడికి అనేక చర్యలు చేపడతాం. ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల యువత బాగా చెడిపోతోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌నకు ప్రమోషన్ చేయవద్దని వీఐపీలను కోరుతున్నా. డిజిటల్ అరెస్టుల పేరుతో వచ్చే కాల్స్‌ను నమ్మవద్దు. అరుదైన వ్యాధులకు ఔషధాలు అంటూ చేసే మోసాలూ పెరు గుతున్నాయి. ఆన్‌లైన్ మోసాలు చేసేవారిపై ప్రత్యేక నిఘా ఉం టుంది. కల్తీ ఆహా రంపై ప్రతేక దృష్టి పెడతాం, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తాం. మార్కెట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేసి కల్తీ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటాం.నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. ఏటా లక్షల్లో కొత్త వాహనాలు వస్తున్నాయి. జీఎస్టీ తగ్గించాక వాహనాల కొనుగోళ్లు బాగా పెరిగాయి. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు కృషి చేస్తాం. ట్రాఫిక్ వల్ల సమయం వృథా మాత్రమే కాదు.. ఆరోగ్యమూ పాడవుతుంది. మద్యం తాగి రోడ్లపైకి వాహనాలతో వస్తే వదిలేది లేదు. వాళ్లను రోడ్ టెర్రరిస్టులుగా భావిస్తాం. చిన్నారులు, మహిళలపై అఘా యిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళల జోలికి వస్తే సీరియస్‌గా తీసుకుంటాం" అని హెచ్చరించారు.

# తెలంగాణ పోలీసింగ్ అత్యుత్తమం

- సాంకేతికత, సమన్వయంతో అద్భుత పనితీరు కనబరిచారు
- డీజీపీగా జితేందర్ పదవీవిరమణ



**హైదరాబాద్(జనంసాక్షి):** సాంకేతికతను ఉపయోగించడం, పోలీసులను సమన్వయంగా ఉపయోగించడం ద్వారా తెలంగాణ పోలీసులు అత్యుత్తమంగా పని చేస్తారని పదవీ విరమణ చేసిన డిజిపి జితేంద్ర తెలిపారు. నేషనల్, రాష్ట్ర స్థాయిలలో జరిగిన విపత్తుల నిర్వహణలో ఆయా బృందాల సహకారం ద్వారా ప్రజలను రక్షించడంలో విజయాలు సాధించామని ఆయన గుర్తుచేశారు. అలాగే కొత్త డిప్యూటీ పోలీస్ జనరల్ శివధర్ రెడ్డిని పరిచయం చేస్తూ.. అతని అనుభవం, ఉగ్రవాద, ఇంటెలిజెన్స్, అర్బన్ పోలీసింగ్‌లో నైపుణ్యం రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. పోలీస్ సర్వీస్‌లో 33 సంవత్సరాల ఉన్నతమైన సేవల తర్వాత రాష్ట్ర డిజిపి జితేంద్ర పదవీ విరమణ చేశారు. వీడ్కోలు కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ సీనియర్ అధికారులు, మాజీ అధికారులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు మిడియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేంద్ర మాట్లాడుతూ.. 'వీడ్కోలు అత్యంత ఉన్నత ప్రమాణాలతో ఏర్పాటు చేసారు. మార్చింగ్, బ్యాండ్ ప్రదర్శనలు, గుర్రాల బృందం ప్రదర్శన అద్భుతంగా జరిగాయి. ఈ కార్యక్రమం ఘనంగా జరిగేందుకు అకాడమీ డైరెక్టర్, సీనియర్ అధికారులు ఎంతో సహకరించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోలీస్‌లలో తన అనుభవం అద్భుతమైనది అని తెలిపారు. పంజాబ్ నుండి ఆంధ్రప్రదేశ్‌కి కేటాయింపుపై, ఇక్కడి సీనియర్ అధికారుల మద్దతు, మార్గదర్శకత్వం నాకు గొప్ప స్ఫూర్తినిచ్చింది. ఇప్పుడు తెలంగాణ పోలీస్ మేము మా ఇల్లుగా భావిస్తున్నాం అని జితేంద్ర పేర్కొన్నారు. తమ పదవీకాలంలో సాధించిన విజయాలను చెబుతూ.. గత 15 నెలల్లో రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగా ఉన్నాయి.. నేరాలు అదుపులో ఉన్నాయి. మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, అంతర్రాష్ట్ర ముఠాలు, బెట్టింగ్ రాకెట్లు ఇలా అన్ని కంట్రోల్ చేశామన్నారు. తన కుటుంబానికి, సీనియర్ అధికారులు, స్నేహితులు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు

# ఆరు గ్యారెంటీలు అమలు కాలేదు

మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు అందరు కలిసి ప్రతి ఇంటికి పోయి ఈ బాకీ కార్డుని అందజేసి కాంగ్రెస్ పార్టీ ఆ ఇంటికి ఎంత బాకీ పడిందో వివరించాలన్నారు. కాంగ్రెస్ మోసాలను, కాంగ్రెస్ పాలనను ఎండగట్టాలి. ప్రతి ఇంట్లో ఈ చర్చ జరగాలి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కుర్చీలో కూర్చుంటే కేసీఆర్ చేసింది కరెక్ట్ అని రేవంత్ రెడ్డికి అర్థమైంది..ల్గ÷తుబంధు ఇప్పుడైతే రూ. 10000 మేము వస్తే రూ. 15000 ఇస్తామన్నారు. పోయిన వానకాలం రైతు బంధు మొత్తానికే ఎగ్గొట్టిండు. పోయిన యాసంగిలో మూడెకరాల వారికి ఇచ్చిండు మిగతా వాళ్లందరికీ ఎగ్గొట్టిండు. ఇప్పుడు పంచాయతీ ఎన్నికలు ఉన్నాయని రూ. 12,000 ఇచ్చిండు. మిగతా మూడు వేలు ఎగ్గొట్టిండు. ప్రతి రైతుకు కాంగ్రెస్ పార్టీ రూ. 75 వేల రైతుబంధు బాకీ పడింది. రైతుబంధు రైతుకి ఇస్తాం. కౌలు రైతుకి ఇస్తామన్నారు. ఒక రూపాయి అయినా కౌలు రైతుకు ఇచ్చారా? కరోనా వచ్చినా కేసీఆర్ ఎమ్మెల్యేలు, మంత్రుల జీతాలు బంద్ పెట్టిండు గాని రైతులకు రైతుబంధు ఆపలేదన్నారు. 97 శాతం మంది రైతులు 10 ఎకరాలలోపే ఉన్నారు. 200 ఉన్న పెన్షన్‌ని కేసీఆర్ 2000 చేసిండు. పదొంతులు పెన్షన్ పెంచిండు కేసీఆర్. కాంగ్రెస్ 4000 పెన్షన్ ఇస్తా అన్నది ఈరోజు వరకు లేదు. అత్తకు, కోడలు ఇద్దరికీ ఇస్తామన్నారు. రేవంత్ రెడ్డివి అన్నీ గజినీకాంత్ మాటలు.. ఇంటికొక మహిళకు రేవంత్ రెడ్డి రూ. 44 వేల బాకీ పడిండు. రూ. 44000 ఇచ్చినంకనే కాంగ్రెస్ వాళ్ళు ఎవరైనా ఓటు అడగాలన్నారు. 100 రోజుల్లో ఇస్తామని చెప్పి 700 రోజులైనా ఇప్పటివరకు ఒక్క హామీ నెరవేర్చలేదు. మొదటి క్యాబినెట్‌లోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత తెస్తామన్నారు 30 క్యాబినెట్‌లైనా ఊసే లేదు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీల అమలు గురించి ఎవరైనా అడుగు తారేమో అని రాహుల్ గాంధీ తెలంగాణ ముఖం చూడట్లేదు. రేవంత్ రెడ్డిని ఎవడు నమ్మిటట్టు లేదని రాహుల్ గాంధీ వచ్చి మాటిచ్చాడు. 4,000 పెన్షన్ ఇప్పిచ్చే గ్యారెంటీ నాది అన్నాడు రాహుల్ గాంధీ. వందరోజుల్లో హామీలు అమలు చేస్తామన్నావు ఏమైంది. అందుకే ఈ బాకీ కార్డును విడుదల చేసాం. 18 ఏళ్లు నిండిన ప్రతి అక్కకు చెల్లెకు మహాలక్ష్మి కింద రూ. 2,500 ఇస్తామన్నారు. మాట్లాడితే మహిళలను కోటీశ్వరులని చేస్తామంటారు. ఎవరైనా అయ్యారా? ఈ బాకీ కార్డు లోకల్ బాడీ ఎన్నికల్లో బ్రహ్మాస్త్రం. ఇది కాంగ్రెస్ పాలిట ఉరితాడు అవుతుందని హరీశ్‌రావు తెలిపారు. యూరియా బస్తాలు ఇచ్చే తెలివి లేదు కానీ ఊరుకో మద్యం దుకాణం పెడతాడట. బ్రూవర్లు పెడతాడట. బెల్ట్ షాపులు పెడతారట. మొత్తానికి తాగుబోతుల తెలంగాణ చేస్తా అంటున్నడు రేవంత్ రెడ్డి. తులం బంగారం ఏమైంది రేవంత్ రెడ్డి? కనీసం కల్యాణ లక్ష్మి చెక్కుల పైసలు ఇస్తలేవు. విద్యార్థులకు 5 లక్షల భరోసా కార్డు అన్నారు ఒక విద్యార్థి కైనా ఇచ్చారా. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తా అన్నావ్ కనీసం 5000 ఉద్యోగాలను ఇచ్చేవా రేవంత్ రెడ్డీ అని నిలదీసారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని రాహుల్ గాంధీ అశోక్ నగర్ చౌరస్తాలో చెప్పిండు. నిజమే అని నిరుద్యోగ యువతీ యువకులు నమ్మారు. రాహుల్ గాంధీ మోసం చేశారు. ప్రియాంక గాంధీ హుస్నాబాద్‌లో నిరుద్యోగ భృతి 4000 ఇస్తామన్నారు ఇచ్చారా అని హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ చీరలు ఇచ్చారు నేను పట్టుచీరలు ఇస్తా అన్నాడు. పట్టుచీర లేదు ఉన్న చీర కూడా లేదు. మార్పు కాదు ఇది ఏమార్పు. నమ్మించి ఏమార్చి గొంతు కోసిండు రేవంత్ రెడ్డి. నీళ్ల విషయంలో అబద్దాలు, నియామకాల విషయంలో అబద్దాలు, నోరు తెరిస్తే అన్ని అబద్దాలే. కేసీఆర్ కిట్టు బంద్ అయింది. న్యూట్రిషన్ కిట్టు బంద్ అయింది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బంద్ అయింది. 9 ఏళ్లలో రూ. 20వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బు చెల్లించాడు కేసీఆర్. విద్యార్థులను నిర్లక్ష్యం చేసి ఒక రూపాయి ఇయ్యని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం. ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు ఫీజులు కట్టకపోతే సర్టిఫికెట్లు లేని పరిస్థితి వచ్చిందన్నారు. ఆరోగ్యశ్రీ డబ్బులు ఇవ్వకపోవడంతో దావఖానాలో సేవలు బంద్ అయ్యాయని అన్నారు. రేవంత్ రెడ్డి కంచ గచ్చిబౌలిలో, బంజారాహిల్స్‌లో, జూబ్లీహిల్స్‌లో భూముల అమ్ముతా అని బయలుదేరిండు అని అన్నారు.

# కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా టిమ్స్

- పరిశుభ్రత, పేషెంట్ కేర్‌పై స్పెషల్ ఫోకస్
- నిమ్స్ తరహాలో టిమ్స్‌లకు స్వయం ప్రతిపత్తి
- క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాల నడుమ స్పష్టమైన పని విభజన
- అధికారులకు దిశానిర్దేశం చేసిన మంత్రి దామోదర రాజనర్సింహా



హైదరాబాద్ (జనంసాక్షి) : సనత్‌నగర్, కొత్తపేట్, అల్వాల్ టిమ్స్ హాస్పిటళ్లను కార్పొరేట్ హాస్పిటళ్లకు ధీటుగా తీర్చిదిద్దాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఏఐజీ, అపోలో, యశోద, నిమ్స్, ఎయిమ్స్ హాస్పిటళ్ల తరహాలో పరిశుభ్రత, పేషెంట్‌కేర్‌కు సమప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిమ్స్ తరహాలో టిమ్స్‌లలోనూ స్వయం పాలన వ్యవస్థ ఉండాలన్నారు. త్వరలో సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభించనున్న నేపథ్యంలో, అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్, ప్రొఫెసర్ విమలా థామస్ తదితరులు పాల్గొన్నారు. ఏఐజీ, అపోలో, యశోద, నిమ్స్, ఎయిమ్స్‌లో అవలంభిస్తున్న విధానాలపై ఇప్పటికే అధికారులు స్టడీ చేసి, నివేదిక తయారు చేశారు. ఈ నివేదికలోని అంశాలను అధికారులు మంత్రికి వివరించారు. కార్పొరేట్ హాస్పిటళ్లలో క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాలు పనిచేస్తున్న విధానం, డాక్టర్లు, సిబ్బంది సంఖ్య, పెడుతున్న ఖర్చు, తదితర అంశాలను మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా, నిమ్స్ కంటే మెరుగైన హాస్పిటళ్లను ప్రజలకు అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి ఆలోచన అని మంత్రి తెలిపారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల వసతులతో హాస్పిటళ్లు ఉండాలని, అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేట్ హాస్పిటళ్ల తరహాలో క్లినికల్ సర్వీసెస్, అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్, అకాడమిక్స్ విభాగాలు వేర్వేరుగా ఉండాలని సూచించారు. నిమ్స్ తరహాలో మెడికల్ డైరెక్టర్, మెడికల్ సూపరింటెండెంట్‌తోపాటుగా చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ కూడా ఉండాలన్నారు. ఏయే విభాగానికి ఎవరు బాధ్యులు, ఎవరి పని ఏంటి అన్నదానిపై స్పష్టమైన జాబ్‌చార్ట్ ఉండాలని మంత్రి ఆదేశించారు. గతంలో ధనవంతులు, పెద్ద పెద్ద నాయకులు కూడా చికిత్స కోసం గాంధీ, ఉస్మానియాకు వెళ్లేవారని మంత్రి గుర్తు చేశారు. ఇప్పుడు టిమ్స్‌లను ఆ స్థాయిలో తీర్చిదిద్దాలన్నారు. డాక్టర్లు, సిబ్బంది నియామకం, తదితర పూర్తి అంశాలతో వారం రోజుల్లో తుది నివేదికను తయారు చేయాలని హెల్త్ సెక్రటరీని మంత్రి ఆదేశించారు

# ట్యాంక్‌బండ్‌పై ఘనంగా సద్దుల బతుకమ్మ

- ఆకట్టుకున్న మహిళల బతుకమ్మ ప్రదర్శన
- హాజరైన మంత్రులు కొండా సురేఖ, పొన్నం తదితరులు



హైదరాబాద్, సెప్టెంబర్30 (జనంసాక్షి) : సద్దుల బతుకమ్మ వవేడుకలు ఘనంగా జరిగాయి. బతుకమ్మ పండుగ చివరి రోజు కావడంతో.. భాగ్యనగరం అంగరంగ వైభవంగా ముస్తాబైంది. ఈ నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌పై నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. మహిళలు రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. బతుకమ్మ చుట్టూ.. చప్పట్లు కొడుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తొమ్మిది రోజులు జరిగే... బతుకమ్మ పండుగలో రోజుకో ప్రత్యేకత ఉంటుంది. సంస్కృతి సాంప్రదాయాలకు పట్టుకొమ్మగా నిలిచే బతకమ్మ పండుగలో మంగళవారం చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ. ఈ బతుకమ్మ పండుగ స్త్రీ అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ క్రమంలో బతుకమ్మ వేడుకల ముగింపు కార్యక్రమం హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఘనంగా జరిగింది. అమర వీరుల స్మారకం నుంచి ట్యాంక్ బండ్ వద్ద బతుకమ్మ ఘాట్ వరకు దాదాపు 700 బతుకమ్మలతో మహిళలు ప్రదర్శన నిర్వహించారు. మంత్రి కొండా సురేఖ, టూరిజం కార్పొరేషన్ ఎండీ క్రాంతి, సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ అలేఖ్య పుంజాల, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారధ, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ విమలక్క, డిప్యూటీ మేయర్ శ్రీలత తదితరులు.. బతుకమ్మ పాటలకు మహిళలతో కలిసి నృత్యం చేశారు. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. వేడుకల్లో భాగంగా సచివాలయంపై 3డీ మ్యాప్ లేజర్ షో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... బతుకమ్మ వేడుకలకు గిన్నిస్ రికార్డులు వచ్చేలా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. కొంతమంది గతంలో బతుకమ్మ వేడుకల్లో డిస్కో డ్యాన్సలు ఆడేవాళ్లు. డిస్కో డ్యాన్సల సంప్రదాయం ఇప్పుడు లేదు. పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలను కొనసాగిద్దాం అని పేర్కొన్నారు.

# నార్సింగ్‌లో ఎఫ్‌టిఎల్ ఆక్రమించి నిర్మాణాలు

- ఆదిత్య వింటేజ్ నిర్మాణాలను అడ్డుకోని సర్కార్
- హైడ్రా తీరును తప్పపట్టిన ఎంపి రఘునందన్



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : నార్సింగ్ పోలీస్ స్టేషన్ ఎదురుగా సర్వీస్ రోడ్డును మింగి ఆదిత్య వింటేజ్ భారీ భవనం నిర్మిస్తున్నారని ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. దీనిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... అడ్డగోలుగా ఆదిత్య వింటేజ్ నిర్మాణాలు చేపడుతున్నారని.. సర్వీస్ రోడ్డు లేకుండా నిర్మాణం చేస్తుంటే ఎలా అనుమతి వచ్చిందని ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం జరుగుతోందన్నారు. ఎవరి ప్రమేయంతో ఈ నిర్మాణాలు చేస్తున్నారని నిలదీశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తున్నట్లు తెలిపారు. అలాగే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కాపీ పంపుతానని ఎంపీ చెప్పారు. పేదోడి ఇండ్లను అడ్డగోలుగా కూలగొడుతున్నారని... పెద్దలకు ఎలా అనుమతులు ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి కి చిత్త శుద్ధి ఉంటే ఈ నిర్మాణాన్ని ఆపాలన్నారు. నిర్మాణం ఆపకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. హెచ్‌ఎమ్‌డీఏ అధికారులే కేసులు వేస్తారని.. మళ్లీ వారే అనుమతి ఇస్తారని విమర్శించారు. ఈ నిర్మాణ అనుమతులలో సీఎం రేవంత్ రెడ్డి ఇన్వాల్వ్ అయ్యారా.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇన్వాల్వ్ అయ్యారా అని ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, హద్దులు తొలగించారని క్రిమినల్ కేసులు నమోదు చేశారని.. ఈ నిర్మాణంలో సూట్ కేసులు అందుకుంటున్న మంత్రులు ఎవరో సీఎం రేవంత్ రెడ్డి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నీతి వాఖ్యలు చెబుతుంటారు.. అందుకే ఆయనకు చెబుతున్నాను.. మంత్రుల మీద చర్యలు తీసుకోమని ఏఐసీసీకి లేఖ రాయండి' అంటూ హితవుపలికారు. వంద శాతం అవినీతి జరిగిందని.. అక్రమ నిర్మాణం జరిగిందని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితా విడుదల

- మొత్తం ఓటర్లు 3.99 లక్షలు ఉన్నట్లు వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కోసం ఎన్నికల కమిషన్ కసరత్తు పూర్తి చేసింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తుది ఓటర్ల జాబితా విడుదల చేసింది. జాబితాను అధికారి సుదర్శన్ రెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో మొత్తం ఓటర్లు 3 లక్షల 99 వేలు ఉన్నట్లు తెలిపారు. జూలై 1న అర్హత తేదీగా తీసుకుని ఓటర్ల జాబితా సవరణ చేసినట్లు పేర్కొన్నారు. సవరణ అనంతరం జాబితాలో 2,07,382 మంది పురుషులు, 1,91,593 మంది మహిళలు, 25 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు, 6,106 మంది యువ ఓటర్లు, 2,613 మంది వృద్ధులు , 1,891 మంది దివ్యాంగులు ఉన్నట్లు స్పష్టం చేశారు. కాగా, 139 కేంద్రాల్లో 409 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఈ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈసీ కీలక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు పూర్తి చేసింది. జూబ్లీహిల్స్‌కు జరుగుతోంది ఉపఎన్నిక అయినా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఈ ఎన్నికపై ఆసక్తి నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఆశించినన్ని సీట్లు దక్కకపోవడంతో.. ఈ ఉపఎన్నికతో నగరంలో తన ఉనికి చాటుకోవాలని చూస్తోంది. మరోపక్క బీఆర్ఎస్ పార్టీ ఉన్న సీటును కాపాడుకోవాడానికి వ్యూహాలు రచిస్తోంది. అయితే.. తుది జాబితా విడుదల కావడంతో త్వరలోనే ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉంది.



# మంత్రి సీతక్కను కలిసిన జోగారెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి) : పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఇంజనీర్ ఇన్ చీఫ్ గా బాధ్యతలు చేపట్టిన పి. జోగారెడ్డి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ను ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క జోగారెడ్డిని అభినందించారు. ప్రజా ప్రభుత్వం పంచాయతీరాజ్ విభాగంలో నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని మంత్రి సీతక్క సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన పి.జోగారెడ్డి పంచాయతీ రాజ్ విభాగంలో 1989 లో ఏఈగా చేరారు.

# రహ్మత్ నగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలు



- శంకుస్థాపనలు చేసిన మంత్రి వివేక్

హైదరాబాద్, సెప్టెంబర్30 (జనంసాక్షి) : మంత్రి వివేక్ వెంకటస్వామి మంగళవారం హైదరాబాద్ రహమత్ నగర్ లో పర్యటించారు. రహమత్ నగర్ డివిజన్ లో పర్యటించిన మంత్రి పార్టీ శ్రేణులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. రహమత్ నగర్ డివిజన్ లోని ఇందిరాగాంధీ నగర్ లో కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్. రూ. కోటి 53 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఛైర్మన్ మల్రెడ్డి రామిరెడ్డి, అజారుద్దీన్, సీఎన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రహమత్ నగర్ డివిజన్ ఇందిరానగర్ ఫేజ్ 2 లో మరో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి. రూ. కోటి 30 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. రహమత్ నగర్ డివిజన్ ప్రతిభా నగర్ లో రూ. 99 లక్షల 50 వేలతో నిర్మించనున్న కృయునిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్. బ్రహ్మశంకర్ నగర్ లో కమ్యూనిటీ హాల్, సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు మంత్రి వివేక్. రూ. కోటి 28 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు .

# మూస్పర్శి అడవుల్లో బూటకపు ఎన్‌కౌంటర్

- విచారణ చేపట్టండి : పౌరహక్కుల సంఘం



హైదరాబాద్ (జనంసాక్షి) : సెప్టెంబర్ 22నచత్తీస్ ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబుజ్మడ్ ఇలాకా మూస్పర్శి అడవుల్లో ఎన్ కౌంటర్ జరిగిందని అందులో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణ రెడ్డి (కోసా దాద) కథా రామచంద్రా రెడ్డి (రాజుదాద), వికల్పు మరణించినట్లుగా చత్తీస్గడ్ ప్రభుత్వం ప్రకటించిందని, ఇది బూటకపు ఎన్ కౌంటర్ పౌరహక్కుల సంఘం ప్రకటిస్తూ దీనిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. సెప్టెంబర్ 23, 2025న మావోయిస్టు పార్టీ విడుదల చేసిన ప్రకటనలో వారి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులైన కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణలను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి హత్య చేసినట్లుగా తెలియజేశారని, మావోయిస్టు పార్టీ తెలిపినట్లుగా ఈ ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులను కేంద్ర కమిటీ వేరే బాధ్యతలు అప్పగించిందని అందులో భాగంగానే 10 నెలల క్రితమే వారు కొత్త బాధ్యతలను నిర్వర్తించడానికి రాయపూర్ నగరం శివారులో ఉన్నారని వారిని నిరాయుధులుగా అరెస్టు చేసారని తెలియజేశారని, వీరి అరెస్టులు సెప్టెంబర్ 11 నుండి 20 మధ్య జరిగే అవకాశం ఉందని వారు సెప్టెంబర్ 10, 2025 వరకు సురక్షితంగా ఉన్నారని ఆ సమాచారం తమకు ఉందని వారి ప్రకటనలో తెలియజేసారు. సెప్టెంబర్ 11, 2025 న అరెస్టు చేసి 10 రోజుల పాటు రహస్య సమాచారం కోసం చిత్ర హింసలు పెట్టి సెప్టెంబర్ 22, 2025 న అబుజ్మడ్ ఇలాకా మూస్పర్శి అడవుల్లో ఎన్ కౌంటర్ పేరుతో కాల్చి చంపినట్లుగా ప్రకటిస్తున్నారని, ఈ బూటకపు ఎన్ కౌంటర్‌ను సత్యం చేయడం కోసం ఈ సెప్టెంబర్ 21, 2025 నుండే భారీ ఆపరేషన్ ప్రారంభించబడిందని, మొదట కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణలు కొంత కాలంగా గెరిల్లా దళాలతో అడవుల్లో లేరని వీరి గురించి తెలిసిన రాష్ట్ర స్థాయి నాయకుల మొదలు సాధారణ సభ్యుల వరకు పోలీసులకు లొంగిపోయారని ఆ నేపథ్యంలో విషయాలు బయటికి రావచ్చని అంతేకాక వీరిద్దరికి సంబంధించిన ప్రధాన కొరియర్ మెకానిజమ్లోని వ్యక్తులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అందులో భాగంగానే వీరి అరెస్టు జరిగిందని తెలిపారు. ఒక వైపు లొంగుబాట్లు మరొకవైపు ఎన్ కౌంటర్ హత్యాకాండలతో మధ్యభారత ఆదివాసీ ప్రాంతాలు కకావికలమవుతున్నాయి. ఇప్పటికైనా ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ పరిపాలనకు సరియైనది కాదని ఇది ప్రజాస్వామ్యం పేరుతో హత్య చేసే హంతక పాలన అని ప్రజలందరికి అర్థమవుతున్నది. ప్రజల మౌనాన్ని అంగీకారంగా తీసుకోకుండా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ హత్యాకాండను వెంటనే ఆపివేయాలని ఇప్పటికే నెలకొల్పబడిన 400 సాయుధ క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు నిరాయుధంగా రాయపూర్ నగరంలోనే దొరికినప్పటికి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాల్సింది పోయి అక్రమంగా ఎన్ కౌంటర్ పేరుతో కాల్చి చంపడాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం, ఎన్. నారాయణ రావు రాజు (పిడిఎం), బల్లా రవీంద్రనాథ్ (సిఆర్పిపి), రాము (విరసం), వెంకటయ్య (రైతాంగ సమితి) పాల్గొన్నారు.

# పూర్వోదయ పథకం అమలు చేయండి

- ఆర్థికమంత్రి నిర్మలకు చంద్రబాబు వినతి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : పూర్వోదయ పథకం కింద రాష్ట్రానికి నిధులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. దేశంలోని తూర్పు రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి కోసం పూర్వోదయ పథకానికి శ్రీకారం చుట్టిన కేంద్ర ప్రభుత్వం.. బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలతో పాటు ఆంధప్రదేశ్‌ను ఎంపిక చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఆయనతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఉన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పూర్వోదయ పథకం నిధులతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు సీఎం చంద్రబాబు వివరించారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇవ్వాల్సిన నిధులపై చర్చించారు. దీంతో పాటు రాయలసీమలో హార్టికల్చర్, ఉత్తరాంధ్రలో కాఫీ పంట ఉత్పత్తులు, కోస్తాంధ్రలో ఆక్వా కల్చర్‌ను మరింతగా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# మటన్ కావాలా సార్.. మటన్..!

- గాంధీ జయంతి రోజే దసరా
- ఫోన్లో మటన్ బుకింగ్




నర్సంపేట సెప్టెంబర్ 30 (జనం సాక్షి) : మటన్ కావాలా సార్ మటన్.. అంటూ ఫోన్లో మటన్ బుక్ చేస్తున్నారు. దసరా రోజు గాంధీ జయంతి కాబట్టి మటన్ కోయరని, బుధవారం రాత్రి 11:30 వరకు మటన్ అమ్ముతామంటూ ఫోన్లో వాట్సాప్ లో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. మటన్ ప్రియులు ఆర్డర్ మీద ఆర్డర్ చేస్తూ కొనుగోలు చేస్తున్నట్టు మటన్ వ్యాపారులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మామూలు రోజుల్లో కిలో మటన్ 900 కు అమ్మేవారు కానీ గాంధీ జయంతి దసరావడంతో సుక్క వేసుకోవాలి ముక్క తీసుకోవాలి అంటూ ప్రచారం చేస్తూ కిలో మటన్ వెయ్యి రూపాయలకు అమ్ముతున్నారు. మటన్ షాపులలో కాకుండా కొంతమంది మటన్ అంటూ గొర్రెలను, మేకలను కోస్తూ కిలోల కొద్దీ బుక్ చేసుకుంటున్నారు. దీనిని ఆధునిక భావించిన కొంతమంది మద్యం దుకాణదారులు సైతం అక్రమ నిల్వలు చేసి రహస్యంగా బాటిల్ కి 50 రూపాయలు చొప్పున అధిక ధరలకు అమ్ముతున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీ అధికారులు ఆరికరమైన గొర్రెలను మేకలను కోస్తున్నప్పుడు పరిశీలించాల్సిన వారు నిమ్మకు నీరెత్తినట్లుగా వివరిస్తున్నారు దీంతో రోగగ్రస్తం అయినవాటిని వాటిని కూడా కోసి అధిక ధరలకు అమ్ముతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ పరిశీలన చేయకుండానే దానికి మాకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కమేళ్లలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ గాంధీ జయంతి దసరా ఒకేరోజు రావడంతో మటన్ కు అధిక ధరలు మద్యం బాటిల్ కు 50 రూపాయలు ధరలకు అమ్ముతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. తెలంగాణ ప్రజలు దసరాకు మద్యం మటన్ ఎక్కువగా తినేదానికి అలవాటు పడడంతో వీడికి భలే గిరాకీ ఏర్పడిందని మటన్ షాపుల దుకాణదారులు వ్యాఖ్యానిస్తున్నారు.

# దళిత భూమి కబ్జా ప్రయత్నం

- అరెస్ట్, రిమాండ్

ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : భూ కబ్జాలకు పాల్పడుతున్న భూ అక్రమార్కులు ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం డీఎస్పీ స్థానిక హెడ్ క్వార్టర్ సమావేశ మందిరంలో పత్రికా ప్రకటన విడుదల చేసి పలు వివరాలను వెల్లడించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ లో ఎలాంటి ఫోర్జరీలకు, భూ అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ ప్రైవేటు భూములను ఆక్రమించే ప్రయత్నం చేసే వారి పట్ల చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలో వ్యవసాయం చేసుకుంటున్న ఏరె నడిపి గంగన్న తనకున్న అసైన్డ్ పట్టా భూమిని ఆరు సంవత్సరాల క్రితం (2019) లో రఘుపతికి అప్పు కింద తన భూమిని తాకట్టు పెట్టడం జరిగిందన్నారు. కొన్ని రోజుల తరువాత భూములను తిరిగి సాగు చేసుకోవడానికి అప్పు తీర్చడానికి ఏరె గంగన్న రఘుపతి వద్దకు వచ్చి అప్పు చెల్లిస్తామని తమ భూమి తమకు తిరిగి ఇచ్చేయాలని చెప్పడం జరిగిందని, కానీ రఘుపతి కొంత మందితో కలిసి వారిని భయ భ్రాంతులకు గురిచేస్తూ ట్రాక్టర్ తో తొక్కిస్తానని బెదిరించి, భూములను అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేయడం జరిగిందని తెలిపారు. భాడితుడు గంగన్న ఇచ్చిన పిర్యాదు మేరకు రఘుపతిపై బీఎన్ఎస్ 2023 సెక్షన్లు: 308(5), 351(2) r/w 3(5) ఎస్సీ/ఎస్టీ చట్టం 2015 సవరణ ప్రకారం సెక్షన్లు 3(1)(r)(s)(g), 3(2)(va), 3(2)(v) కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. కాగా రఘుపతిపై ఇప్పటికే మావల పోలీస్ స్టేషన్ లో పలు కేసులు నమోదు చేయబడి ఉన్నాయన్నారు. ఇతను పలు కేసులలో నిందితుడుగా ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.

# నామమాత్రాలైన వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు



అక్టోబర్ 1... అంతర్జాతీయ వృద్ధుల దినం

కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ... విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయోవృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారతదేశములో ప్రస్తుతం 15కోట్లమంది వృద్ధులున్నారు. 2050నాటికి వీరిసంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా. మనరాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతంకు మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితి తామే తిట్టుకుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ, నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సదృశ్యం సర్వత్రా సాక్షాత్కారం మిస్తున్నది. దేశములో నెలకొన్న పరిస్థితులవల్ల సామాన్యులకు నానాటికీ బతుకు భారము అవుతున్న రోజులివి. అదేక్రమము లో వృద్ధులవల్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కువై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినప్పటికీ వయోవృద్ధుల సమస్యలకు పరిష్కారం కనబడక పోవడము అసలైన విషాదం. దేశంలోని ప్రతి ఐయిదుగురి వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారు. దూషణలకు పాల్పడటమే కాకుండా కొందరు శారీరక హింసకూ పాల్పడుతుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం. వాస్తవానికి వృద్ధులు జాతి సంపద! వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. జీవించినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందుపరిచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ల తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొందించ బడ్డది. ఐతే దీని గురించి ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించక పోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. ఫలితంగా ఆ చట్టం నిరుపయోగం అవుతున్నది. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వయోవృద్ధులను, సీనియర్ సిటిజన్లను కుమారులు, కూతురులు విడిచిపెట్టి, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా, చట్ట ప్రకారం శిక్షార్హమే. శిక్షాకాలం ఒక టర్మ్‌కు, మూడు మాసాల జైలు శిక్ష లేదా అపరాధ రుసుము, గరిష్టంగా ఐదు వేల రూపాయలు, రెండింటిని విధించవచ్చు. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్. డి. ఓ. నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు వేరుగా క్యూ పద్ధతి ప్రవేశపెట్టాలని, దీర్ఘకాలిక, అంతిమ పునరావాసం లేని రోగాల చికిత్సల సదుపాయాలు, ప్రభుత్వమే కల్పించాలని, 2007 సంక్షేమ చట్టం నిర్దేశిస్తున్నా, అమలుకు నోచుకోకపోవడం శోచనీయం. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం జారీచేసిన వృద్ధుల సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం పై, సదవగాహన కల్పించడానికి సదస్సులు ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం, సీనియర్ సిటిజన్ "డే కేర్" సెంటర్ల నిర్వహణ, ప్రతి మండలంలో వీరి రక్షణ, వైద్య సహాయం కోసం వైద్యశాల, బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా వహించాలి. వయోవృద్ధుల సంక్షేమానికి ఒక డైరెక్టరేటును ఏర్పరచి తగిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. జిల్లాలలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ లను నెలకొల్పాలి. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి చట్టం 2011 నిబంధనల మేరకు, జిల్లా కేంద్రాలలో అప్పిలేట్ ట్రిబ్యునళ్ళు, డివిజన్ కేంద్రాలలో ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేసి బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలి. ఇతర రాష్ట్రాలలో రవాణా సంస్థ బస్సులలో, 30 శాతం రాయితీ ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకు లేదు. ఇంటి పన్నులో 30% రాయితీ ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి. కళ్ళజోళ్ళు, వినికిడి తదితర పరికరాలు, వీల్ చైర్స్, వాకింగ్ సాధనాలు అందించాలి. వీరి రక్షణ చర్యలు గైకొనాలి. దేవాలయాలలో ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించాలి.

**"సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంఘాలు"**

జగిత్యాల జిల్లాలో 80 వేల మంది వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి, సౌకర్యాల కల్పనకు, "ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్" ఏర్పాటయింది. విద్యాధికులు, అనుభవైక వైద్యులైన, ఉద్యోగ సంఘాల సీనియర్ నేత హరి అశోక్ కుమార్ అధ్యక్షతన అసోసియేషన్ నడుస్తోంది. వృద్ధుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల**
9440595494

# జీఎస్టీ తగ్గింపుపై ప్రభుత్వ ప్రచారం అమలులో వాస్తవాలు




జీఎస్టీ: ప్రచార హెూరు వెనుక వాస్తవ లోపాలు ప్రభుత్వం జీఎస్టీ (వస్తు–సేవల పన్ను) తగ్గింపును ఒక గొప్ప సాధనగా చిత్రీకరిస్తూ, "ఒక్కో కుటుంబానికి ఏటా రూ.20,000 ఆదా!" అనే నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నుంచి కేంద్ర ఆర్థిక మంత్రి వరకు, ఈ ఆదాను జీఎస్టీ యొక్క అతిపెద్ద విజయంగా ప్రచారం చేస్తున్నారు. టెలివిజన్ జాహీరాతులు, సోషల్ మీడియా పోస్టులు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఈ నినాదం గుండెల్లో గుజ్జుమంటోంది. కానీ, ఈ వాగ్దానం వాస్తవంలో ఎంతవరకు నిజమో, అది సామాన్య వినియోగదారుడి జేబులో ఎలా చేరుతోందో చూడాలంటే, మార్కెట్‌లోని దుకాణాలు, కిరాణా స్టోర్లు, సామాన్యుడి రోజువారీ జీవనం వైపు చూడాలి. ఈ రూ.20,000 ఆదా అనే భావన ఎక్కడి నుంచి వచ్చింది? జీఎస్టీ కౌన్సిల్ ప్రకారం, సుమారు 1,000 వస్తువులు మరియు సేవలపై పన్ను రేట్లు తగ్గించబడ్డాయి. ఈ తగ్గింపు వల్ల ఏర్పడిన మొత్తం పన్ను రాయితీ దాదాపు రూ.1 లక్ష కోట్లు అని అంచనా. దీన్ని దేశంలోని కుటుంబాల సంఖ్యతో భాగిస్తే, ఒక్కో కుటుంబానికి సంవత్సరానికి రూ.20,000 ఆదా అవుతుందని ప్రభుత్వం లెక్కలు చెబుతోంది. ఈ లెక్క సైద్ధాంతికంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది, కానీ దీనిలో లోపాలు స్పష్టంగా కనిపిస్తాయి. మొదట, ఈ లెక్క సగటు ఆధారంగా రూపొందించబడింది. ఒక కుటుంబం ఎన్ని వస్తువులు కొనుగోలు చేస్తుంది, ఏ తరగతి వస్తువులను కొంటుంది అనేది కీలకం. ధనవంతులైన కుటుంబాలు ఖరీదైన, ఉన్నత స్థాయి వస్తువులు కొనుగోలు చేస్తే, వారికి జీఎస్టీ తగ్గింపు వల్ల ఎక్కువ ఆదా జరగవచ్చు. కానీ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు ప్రధానంగా ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తాయి. ఈ వస్తువులపై జీఎస్టీ రేట్లు ఇప్పటికీ ఎక్కువగా ఉన్నాయి లేదా తగ్గింపు నామమాత్రంగా ఉంది. ఫలితంగా, వారి ఆదా చాలా తక్కువ లేదా శూన్యం. రెండవది, అన్ని వస్తువులపై పన్ను తగ్గింపు జరగలేదు. చాలా వస్తువులు పాత స్టాక్‌తో, పాత రేట్లతోనే అమ్మకం అవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో, కంపెనీలు కొత్త స్టాక్‌లో కూడా పాత ధరలనే ముద్రిస్తున్నాయి. ఉదాహరణకు, పాలు, దహీ, లస్సీ వంటి రోజువారీ వస్తువులపై జీఎస్టీ తగ్గించినట్లు ప్రచారం జరిగినా, మార్కెట్‌లో పాత ఎమ్మార్పీ రేట్లతోనే అమ్మకాలు జరుగుతున్నాయి. కంపెనీలు "పాత స్టాక్" అనే సాకుతో నెలల తరబడి ధరలను తగ్గించడం లేదు. ఇది సామాన్య వినియోగదారుడికి స్పష్టమైన మోసం. మూడవది, జీఎస్టీ తగ్గింపు వినియోగదారుడి వరకు చేరుతుందనే హామీ లేదు. ప్రభుత్వం సైద్ధాంతికంగా ఆదా లెక్కలు చెబుతోంది, కానీ ఈ ఆదా అమలు ఎవరి బాధ్యత? వాస్తవ మార్కెట్‌లో ధరలు తగ్గిన దాఖలాలు చాలా అరుదు. చిన్న కిరాణా దుకాణాలు, స్థానిక వ్యాపారులు రసీదులు ఇవ్వడం లేదు. రసీదు లేకపోతే, లావాదేవీల రికార్డు ఉండదు, జీఎస్టీ తగ్గింపు వినియోగదారుడికి చేరదు. ఫలితంగా, పాత ధరలతోనే వస్తువులు అమ్ముతున్నారు, వినియోగదారుడు నష్టపోతున్నాడు. జీఎస్టీ కౌన్సిల్ ఒక ముఖ్యమైన నిబంధన చేసింది – ప్రతి దుకాణం ముందు తగ్గిన ధరల పట్టికను ప్రదర్శించాలి. కానీ, ఈ నియమం చాలా చోట్ల అమలు కావడం లేదు. కొన్ని దుకాణాల్లో బోర్డు పెట్టినా, అందులోని వస్తువుల ధరలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వాటితో సరిపోలడం లేదు. ఈ నిబంధనలను అమలు చేయడానికి ప్రభావవంతమైన చర్యలు లేవు. జీఎస్టీ యంత్రాంగం కూడా బలహీనంగా ఉంది. దీన్ని పర్యవేక్షించే సిబ్బంది సంఖ్య చాలా తక్కువ, వారి నిష్క్రియాత్మకత వల్ల ప్రభుత్వ పథకాలు సరిగా అమలు కావడం లేదు. ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపును భారీగా ప్రచారం చేస్తోంది, కానీ దాని అమలును పర్యవేక్షించడంలో ఘోరంగా విఫలమవుతోంది. జీఎస్టీ కేంద్ర చట్టం అయినప్పటికీ, దాని అమలు బాధ్యత ఎక్కువగా రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. అన్ని రాష్ట్రాలు సమాన స్థాయిలో నియమాలను కఠినంగా అమలు చేయడం లేదు. పెంచిన పన్నులు కఠినంగా వసూలు చేస్తున్నా, రాయితీలు సమానంగా అమలు కావడం లేదు. మార్కెట్ సర్వేలు ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తున్నాయి. వినియోగదారు సంరక్షణ ఫోరమ్‌లు కూడా ఈ సమస్యలపై తగినంత స్పందన ఇవ్వడంలో విఫలమవుతున్నాయి. సామాన్య వినియోగదారుడు ఒక్కో దుకాణంపై కేసు పెట్టడం కష్టమైన, సమయం తీసుకునే ప్రక్రియ. ఈ సమస్యలను మీడియా సంస్థలు, ఆర్థిక విశ్లేషకులు విస్తృతంగా చర్చిస్తున్నారు. రూ.20,000 ఆదా అనే ప్రచారాన్ని అతిశయోక్తిగా, అపారదర్శకంగా గుర్తిస్తున్నారు. ఆదా అనేది వినియోగదారుడి చేతిలో నగదుగా చేరితేనే అర్థవంతం. కానీ, ధరలు తగ్గకపోవడం, రసీదులు ఇవ్వకపోవడం వల్ల ఈ ఆదా జేబులోకి చేరడం లేదు. ద్రవ్యోల్బణం పెరగడం వల్ల జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు సన్నగిల్లాయి. వస్తువుల ధరలు మొత్తం మీద పెరిగాయి, కొన్ని వస్తువులపై పన్ను తగ్గినా వినియోగదారుడి ఖర్చు తగ్గలేదు. చిన్న వ్యాపారులు జీఎస్టీ కంప్లయన్స్ భారాన్ని ఎదుర్కొంటున్నారు. ధరలు తగ్గించడం వారికి కష్టంగా ఉంది, కానీ ఇది వారి నైతిక బాధ్యతను తగ్గించదు. జీఎస్టీ తగ్గింపు వాగ్దానం మరియు దాని అమలు మధ్య భారీ అంతరం ఉంది. రూ.20,000 ఆదా అనేది సైద్ధాంతిక గణాంకం మాత్రమే. దీన్ని వాస్తవ ఆదాగా మార్చడానికి బలమైన అమలు యంత్రాంగం అవసరం. ప్రభుత్వం కేవలం పన్ను రేట్లను తగ్గించి, ప్రచారం చేసి సరిపెట్టకూడదు. ఈ తగ్గింపు వినియోగదారుడి వరకు చేరేలా చూడాలి. దీనికి కఠినమైన పర్యవేక్షణ అవసరం. రాష్ట్రాల్లో వాణిజ్య పన్ను విభాగాలు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, ధరలు తగ్గించని దుకాణాలపై చర్యలు తీసుకోవాలి. పాత ధరలతో ప్యాకెట్లు అమ్మే కంపెనీలపై జరిమానా విధించాలి. జీఎస్టీ ధరల ఉల్లంఘనల కోసం సరళమైన, ప్రభావవంతమైన హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంచాలి. వినియోగదారులు రసీదులు కోరాలని, తగ్గిన ధరలు తెలుసుకోవాలని, ఉల్లంఘనలను రిపోర్ట్ చేయాలని ప్రోత్సహించాలి. జీఎస్టీ ఒక మంచి పన్ను సంస్కరణ కావచ్చు, కానీ దాని లాభాలు సామాన్యుడి వరకు చేరకపోతే, అది పూర్తి విజయం కాదు. ప్రచార హెూరు నుంచి అమలు వైపు ప్రభుత్వం మళ్లితేనే, ఆదా అనే పదం సామాన్యుడి జేబులో నిజమవుతుంది. జీఎస్టీ విధానం ఆర్థిక వ్యవస్థలో సరళీకరణ, పారదర్శకత తీసుకురావాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టబడింది. కానీ, ఈ లక్ష్యం సాధించబడాలంటే, అమలులోని లోపాలను సరిదిద్దాలి. ప్రభుత్వం ప్రచార రాగానికి బదులు, వాస్తవ చర్యలపై దృష్టి పెట్టాలి. సామాన్య వినియోగదారుడు జీఎస్టీ తగ్గింపు లాభాలను అనుభవించేలా చేయడం ప్రభుత్వ బాధ్యత. ఇప్పటివరకు, ఈ వాగ్దానం కాగితంపై గొప్పగా కనిపిస్తోంది, కానీ దుకాణాల్లో, మార్కెట్‌లో దాని ప్రభావం సున్నా. ప్రభుత్వం ఈ అంతరాన్ని గుర్తించి, తక్షణ చర్యలు తీసుకోవాలి. లేకపోతే, జీఎస్టీ వాగ్దానాలు కేవలం రాజకీయ నినాదాలుగా మిగిలిపోతాయి, సామాన్యుడి జీవనంలో ఎలాంటి మార్పూ రాదు.



**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
9849328496.

## ఓటు అమ్ముకోవడం అంటే

వాడు విసిరే ఎంగిలి
మెతుకులకాశపడి
ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టడం.
తాత్కాలిక సంతోషం కోసం
తన విలువలు కోల్పోవడం
ఒక్కరోజు పాష్టిక మేతకు
ఐదు సంవత్సరాలు
తన జీవితాన్ని వాడి
బందెల దొడ్డిలో కట్టేయడం
మన పాదాల కింద ఉండాల్సిన
వాన్ని నెత్తిమీద పెట్టుకుని
ఐదు సంవత్సరాలు వాని
చెప్పు చేతుల్లో కీలుబొమ్మవడం
బొంగరానికి తాడు చుట్టి
విసిరితే గిరగిరా తిరిగి నట్టు
మన జీవితం వాడి చుట్టూ
తిరగడం .మన చెవులను
వాడికప్పగించి
వాడు చెప్పే అభివృద్ధి సొల్లు
వినడం
మన నోటికాడి బువ్వ కుండను
ఎత్తుకెళుతున్న ఏమీ చేయలేక
నిస్సహాయంగా చూస్తూ
నిలబడడం.
వాడు ఎటు కొట్టుకెళ్తే అటు
వెళ్లే గొర్రెల మందలా తయారవడం
వాడు వాహనాలు పెట్టి
జంతువులను కుక్కినట్టు
బస్సుల్లో, లారీల్లో కుక్కుతే
వాని బహిరంగ సభలను
విజయవంతం చేయడం.
నోటిలో మట్టి కొట్టిన,
నొసటి రాతను మార్చిన
చూస్తూ ఊరుకోవడమే కానీ
వేలెత్తి చూపే ధైర్యం కోల్పోవడం.
అడ్డమైన తిండికి మరిగి
అభివృద్ధిని అడ్డుకోవడం.
తనువును వాడికి అప్పగించి
తల దించుకుని నిలబడడం.
తనకు తాను నిలువునా
ఆత్మవంచన చేసుకున్నందుకు
ఐదు సంవత్సరాలు ఆక్రోశించడం
మనిషి సంతలో పశువులా మారి
నిలువెల్లా అమ్ముడుపోవడం.

**నెరువట్ల చైతన్య**
9491470746

# జీఎస్టీ పండుగలో మనం ఎక్కడ?

**భారతీయులు చేసుకునే పండుగల్లో మరో కొత్త పండుగ వచ్చి చేరింది. వివిధ రకాల భాషీయులూ, మతస్తులూ చేసుకునే పండుగలు ఏనాడూ కలవవు. కానీ, ఈ పండుగ మాత్రం వెరైటీగా అందరికీ కామన్. భాషా భేదాలు, తారతమ్యం లేకుండా ఏకంగా పేద, ధనిక, మధ్య తరగతి వర్గాలు అందరూ కూడా చేసుకునే పండుగ ఇది. ప్రతి పండుగలో అయితే మన డబ్బులు ఖర్చయిపోతాయి. ఈ పండుగలో మాత్రం డబ్బులు ఆదా అవుతాయి. వందల వేల రూపాయలు ఆదా అవుతాయి. ఇలాంటి వెరైటీ పండగ నేడు మనం ఈ మధ్య వింటూ ఉన్న జీఎస్టీ పండగ.**

జీఎస్టీలో వినూత్నమైన మార్పులు కారణంగా ఎన్నో వస్తువుల్లోనూ, సేవల్లోనూ కోత విధించడం జరిగింది.ఇప్పటికే ఉద్యోగాలు లేక, ఉన్న ఉద్యోగాల్లో జీతాలు సరిగ్గా లేక కోట్లకొలది భారత సోదరులకు ఇంతకంటే శుభవార్త ఏమై ఉంటుందని.

దీనికి తోడు ప్రపంచీకరణలో అంతర్భాగంగా ఉద్భవించిన ఈ కామర్స్ సైట్లు మరింత రెచ్చిపోయి పండగలు చేసుకోమని సెలవిచ్చాయి. ఫ్లిప్కార్ట్, అమెజాన్ లాంటి బడా ఈ కామర్స్ కంపెనీలు బిగ్ బిలియన్ ఫెస్టివల్స్, గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్స్ చేసుకోమని సెలవిచ్చాయి. దీనికి తోడు జీఎస్టీ లో కోత కారణంగా వారూ వీరూ చెట్టాపట్టాల్ వేసుకొని దేశస్తులంతా ముందుకు నడవమని మంచి సలహా ఇచ్చాయి. ఇలాంటి శుభ సందర్భం కోసమే కాచు కొని కూర్చున్న అప్పులిచ్చే క్రెడిట్ కార్డు కంపెనీలూ, ఫైనాన్స్ కంపెనీలూ మరింత రెచ్చిపోయి భారత సోదరుల పాకెట్లలో డబ్బులు లేకపోయినా సరే, చేస్తున్న ఉద్యోగాలకు సరైన చాలినంత జీతాలు రాకపోయినా సరే పండగ చేసుకోగలిగేలా అప్పులు సిద్ధం చేశాయి. అప్పుల ఇఎంఐ ల ఉరితాడుల్ని ఎంచక్కా మనకి మనమే బిగించుకొని అవకాశాలు అందించాయి.

ఉద్యోగాల్లో జీతాలు రాకపోయినా సరే, లేదా ఉన్న ఉద్యోగాలే కార్పొరేట్ ల కొత్త విధానాల కారణంగా ఊడిపోయినా సరే చింతించవలసిన అవసరం లేదని అభయహస్తం చూపిస్తున్నాయి. ఆన్లైన్ సైట్లలో ఎంతో ఆశతో విష్ లిస్టులో పెట్టుకున్న సరుకులు నేడు కార్ట్ లోకి పయనించి యువకుల చేతుల్లోకి పయనిస్తున్నాయి ఇళ్లల్లోకి పయనిస్తున్నాయి. వేణు లక్షలు ఖర్చు పెట్టుకుని డిగ్రీలు చదివి ఉద్యోగాలకు అవకాశం లేకపోయినా సరే యువతరం పాకెట్లలోకి అత్యంత ఖరీదైన మొబైల్ ఫోన్లు ప్రవేశించి యువకుల సరదాలు తీర్చుతున్నాయి. అత్యంత ఖరీదైన పెద్ద స్క్రీన్ టీవీలు, ఇతర కాస్ట్లీ కంజుమర్ సరుకులు కూడా మధ్యతరగతి ఇళ్లల్లోకి చేరి వారి ఆశలని తీర్చుతున్నాయి. పెరిగిన, పెంచుకున్న ఈ ఎమ్ ఐ లతో వీరు నాయకులు చేసిన సహాయానికి రుణ పడడానికి సిద్ధంగా ఉన్నారు.

ఇప్పటికే క్రెడిట్ కార్డు కంపెనీల పుణ్యమా అని విపరీతమైన అప్పుల్లో మునిగిపోతున్న యువతరం ఇక ఈ కొత్త పండగలో తగ్గేదే లేదు అంటూ విపరీతమైన ప్రచారంలో ఉన్న వస్తువులను కొని తమ తమ మెదడులోని డోపమిన్ కి సరైన న్యాయం చేస్తున్నారు.

కొద్ది రోజుల్లోనే 5000 కోట్ల రూపాయల వ్యాపారం 25 వేల కోట్ల రూపాయలకు చేరుకుందని తెలుస్తుంది. ఈ పండుగలో 90 శాతం సరుకులు ఏదో ఒక కంపెనీ ఈఎంఐలో ట్రాప్‌లో పడి కొనుక్కున్నవే. అంతేగాని సొంత జీతాలలో సేవింగ్స్ కారణంగా కొన్న సరుకులు కావు. ఉదాహరణకు 70 వేల యాపిల్ ఫోన్ కొన్న ఒక యువకుడు ఆ 70 వేల రూపాయలు తన జీవితంలో సేవింగ్ చేసుకొని కొన్న ఫోన్ మాత్రం కాదు. ఏదో ఒక లోన్ ట్రాప్ లో పడి ప్రచారాల పటాటోపంలో ఇరుక్కుని కొన్న ఫోన్ మాత్రమే ఇది.

ప్రజలకు అవసరమైన సరుకులూ, సర్వీసులూ తక్కువ ధరకు లభించడం లేదా టాక్స్ లో కొరత కోత వల్ల వాటి ధర తగ్గడం ఇన్నాళ్లు కొనాలనుకున్న అత్యవసర వస్తువులు కాస్త పేద దిగువ మధ్య తరగతి వర్గం కొనేలా అవకాశం దొరకడం సంతోషించవలసిన విషయం. ఇది నిజంగా పండగ చేసుకోవాల్సిన విషయమే. అయితే ఇలాంటి శాతం ఎంతమంది?


నిరుద్యోగం నేడు విపరీతంగా ఉంది. అటు ట్రంప్ అన్నయ్య కారణంగా భారత సోదరులకు భారీ బహుమానాలు దొరికాయి. అందువల్ల ఎగుమతుల మీద ఆధారపడ్డ ఎన్నో పరిశ్రమలు నేడు ఇరకటంలో పడ్డాయి. ఉన్న ఉద్యోగాల్లో కూడా విపరీతమైన దోపిడీ కారణంగా ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వరు. ఎన్నో పరిశ్రమల్లో పర్మనెంట్ ఉద్యోగులు తగ్గిపోయి కాంట్రాక్టు ఉద్యోగులు అసంఖ్యాకంగా పెరిగిపోయారు. ఈ కాంట్రాక్టు ఉద్యోగులకు ఏ రకమైన సదుపాయాలు లేవు. వీరు పరిశ్రమలో ఉన్నారో లేరో లెక్కల్లో కనిపించరు. ఎవరో ఒక కాంట్రాక్టర్ ఈ పరిశ్రమలకు ఈ శ్రామికుల్ని అందిస్తాడు. పరిశ్రమల యజమానులకు ఈ శ్రామికులతో ప్రత్యక్ష సంబంధాలేవి ఉండవు. వారి లిస్టులో వీరు శ్రామికులే కారు. వీరికి ఏమైనా జరిగితే చూసే నాధుడు కనిపించడు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే మరి అలాంటి 90 శాతం ప్రజలు పండుగలు ఎలా చేసుకోగలరని మనం అనుకుంటాం.

2014 నుండి విజృంభించిన ప్రపంచీకరణ అద్భుతమైన ఫలితాలు అందిస్తుందని అన్నారు. తయారీ రంగంలో ఏటా 12, 14 శాతం వృద్ధిరేటు అందిస్తామని 2022 నాటికి తయారీ రంగంలో 10 కోట్ల ఉద్యోగాల కల్పన జరుగుతుందని ఆశపెట్టారు. కానీ, తయారీ రంగంలో వృద్ధిరేటు 5.9 శాతం కూడా దాటలేదు. 2011, 12 లో ఉద్యోగాలు 12.6 శాతం ఉంటే ప్రస్తుతం 10 శాతం కంటే తక్కువ ఉన్నాయి. 11 సంవత్సరాలలో దాదాపు 7 లక్షల కంపెనీలకు తెరపడింది. చిన్న చిన్న కంపెనీల పక్కనే పెద్ద కంపెనీలు స్వేచ్ఛగా విహరించడం కారణంగా అవి చిన్న కంపెనీలను పెద్ద చేపలు చిన్న చేపలు మింగేసినట్టు మింగేశాయి. ఇప్పుడు కూడా అదే జరుగుతుంది.

మరి పన్నుల కోత కారణంగా రాష్ట్రాలకు తగ్గుతున్న రెవెన్యూలను ఏ విధంగా భర్తీ చేయగలరు? జీఎస్టీ అధిష్టాన వర్గం దగ్గర సరైన ప్రణాళిక లేదని తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం దగ్గర కూడా అలాంటి ప్రణాళిక ఏదీ లేదని తెలుస్తుంది. బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు కూడా దగ్గరలో ఉన్నాయి. కాబట్టి జాక్పాట్ కొట్టొచ్చు. అయితే, తగ్గిన నిధులు కారణంగా రాష్ట్రాలు సంక్షేమ పథకాలకు నిధులు ఎలా తీసుకొస్తాయి అనేది ఒక ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు ఈ పండుగలో ఎలక్ట్రానిక్ సరుకుల మధ్య కనిపించడం లేదు.

ఇక జీఎస్టీ తగ్గడం కారణంగా 2025లో అయితే భారత ప్రజలకు ప్రయోజనం దొరుకుతుందని అనుకుందాం. మరి 2017 నుండి 2025 వరకు విపరీతమైన టాక్స్‌లు విధించడం ద్వారా చిన్న స్లాబుల్లో ఉన్న సరుకులు పెద్ద స్లాబ్‌లోకి పయనించడం ద్వారా భారత ప్రజలు అధిక ధరలతో ఎలా నలిగిపోయారో కదా! ఆ రోజుల్ని మనం ఎలా తిరిగి తేగలం? ఆ నష్టాలను ఈ పండుగల ద్వారా ఎలా పూరించగలం? ఫరోక్ష పన్నులు పెరిగితే ధరలు పెరుగుతాయి. ధరలు పెరిగితే వాస్తవ ఆదాయం తగ్గుతుంది. వాస్తవ ఆదాయం తగ్గిన ప్రజలు ఉన్న ఆ కొద్ది ఆదాయంతోనే నానా కష్టాలు పడే పరిస్థితిని అనుభవించారు. ధరలు తగ్గాయని పని స్థలాల్లో జీతాలు పెంచడం లేదు. ఉన్న జీతాలు తగ్గిస్తున్నారు.

జీఎస్టీ కారణంగా చిన్న చిన్న కంపెనీలకు పని భా రం కూడా పెరిగింది. కాగితాలు, ఫారాలు నింపుకోవడానికే సమయం అయిపోతుంది అని ఎన్నో చిల్లర దుకాణాలు వాపోయాయి. అలానే ఆరోగ్యం అనేది ప్రభుత్వాలు అందించాల్సిన కనీస బాధ్యత. ప్రజలకు అవసరమైన ఆరోగ్యం అందించడం, హాస్పిటల్స్ కట్టడం, వైద్య సేవలను ఉన్నతీకరించడం అనేది ప్రభుత్వం యొక్క కనీస బాధ్యత. ఎండల్లో, వానల్లో గంటలకు గంటలు ప్రజలు నిలబడి ఓట్లు వేసి ఎంతో ఆశతో ఎదురుచూసే ఈ ప్రజానీకానికి ఆరోగ్యం, విద్య అందించడం ప్రభుత్వం బాధ్యత. అది ఏ పార్టీ అయినా సరే. కానీ అలాంటి



ఆరోగ్య సేవలూ, నాణ్యమైన సేవలూ అందించకపోగా కనీసం మధ్యతరగతి వర్గం వివిధ రకాల హెల్త్ ప్రీమియంలు కొనుక్కొని కష్టాలలో కాస్త ఆదుకుంటాయని ఆశతో ఉంటే, వాటి మీద కూడా విపరీతమైన టాక్స్ లను విధించి 2017 నుండి 2025 వరకు ఇబ్బంది పెట్టారు. ఎన్నో వేల రూపాయలు మధ్యతరగతి ఈ ప్రీమియంల కోసమే చెల్లించాల్సి వచ్చింది. ప్రీమియంలు ఒక కోణం అయితే, వాటి మీద విపరీతమైన పన్నులు విధించడం మరొక కోణం.

భారతదేశంలో ఉద్యోగుల జీతాల పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నమాట అది అనుభవిస్తున్న అందరికీ తెలుసు. ఏదో కొద్ది శాతం ప్రభుత్వ ఉద్యోగులు విడిచిపెడితే, దాదాపు 90 శాతం ఉద్యోగులు అత్యంత తక్కువ జీతాలకు అడ్జస్ట్ అయిపోయి మరో దారి లేక జీవితాన్ని ఎలాగో సాగిస్తున్నారు. బెంగాల్ లోని ప్రభుత్వ ఉద్యోగులు కూడా న్యాయమైన డీఏ లు ఇవ్వడం లేదని సుప్రీంకోర్టుని ఆశ్రయించారు.వాస్తవ పరిస్థితి ఇలా దారుణంగా ఉంది. మారిన లేబర్ కోడ్ల కారణంగా ఉద్యోగులకు ఎనిమిది గంటల మాట పక్కన పెట్టి పన్నెండేసి, పద్నాలుగేసి గంటలు పని చేయించడం, వారు మరలా కిక్కిరిసిన పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ లో మరో మూడు గంటలు వెచ్చించి చెమటలతో ఇంటికి రావడం, అలసిన ఆ శరీరాన్ని పరుపు మీదకి విసిరేసి, ఉదయానికి మరలా ఆ శరీరాన్ని ఎత్తుకొని కిక్కిరిసిన పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ లోకి విసిరేయడం, మరలా ఆ పరిశ్రమంలోకి యంత్రంలా జొరబడడం యంత్రాల మధ్య మరో యంత్రంగా మారిపోవడం, ఇలాంటి దారుణమైన జీవితాలు ఎన్నో కోట్ల మందికి ఉన్నాయి. ఇక సాధారణ కార్మిక వర్గం తమకు అవసరమైన సరుకులు పండుగ అని చెప్పి ఎక్కువేసి కొనాలని అనుకున్నా సరే వారి జీతాలు వాటికి సహకరించవు. వారికి అప్పులు కూడా ఎవరూ ఇవ్వరు.ఇక మధ్యతరగతి కొనాలని అనుకున్నా సరే వీరంతా కూడా ఈఎంఐ ట్రాప్ లో పడిపోవాల్సిందే. ఇప్పటికే జీఎస్టీ పండగ రాకముందే భారత మధ్యతరగతి వర్గం విపరీతమైన అప్పుల్లో కూరుకు పోతుందని ఎన్నో సర్వేలు చెబుతున్నాయి. ఎంతోమంది ఫైనాన్షియల్ ఎక్స్పర్ట్స్ వార్నింగ్ ఇస్తున్నారు. ఇక ఈ పండగ ద్వారా వారు మరింత రెచ్చిపోయి మరిన్ని వస్తువులు కొనడం ఆరంభించినట్టు తెలుస్తుంది. రెండు రోజుల్లోనే అమెజాన్ 380 మిలియన్ల కొనుగోలుదారులు ఆ సైట్లో అడుగుపెట్టారని చెబుతోంది. ఫ్లిప్కార్ట్ లో 21 శాతం కొనుగోలుదారుల పెరుగుదల కనిపించింది. ఇక్కడ లాభ పడుతున్న వర్గం చూస్తుంటే అటు ఈ కామర్స్ కార్పొరేట్ వర్గం. అందులో సరుకుల్ని అమ్ముకోబోతున్న, అమ్ముకుంటున్న మరో కార్పొరేట్ వర్గం. అలానే ఎన్నికల ముందు జీఎస్టీ పండగను గ్లామరైజ్ చేయడం ద్వారా కొన్ని రాష్ట్రాల్లోని ఎన్నికలను తమ వైపు తిప్పుకొని అవకాశం చేసుకోగలిగే రాజకీయ వర్గం. పండగల్లో ఏ రకమైన ప్రయోజనం లేకుండా అవసరంలేని సరుకులు కొని ఈఎంఐ ట్రాప్ లలో పడి విపరీతమైన అప్పుల్లో మునిగిపోతున్న యువతరం. ఈ పండుగలో ప్రయోజనం సాధించకపోగా అప్పుల్లో మునగబోతోంది. కొను కొను కొను అని ప్రపంచీకరణ సంస్కృతిలో సమిధలైపోయే మధ్య తరగతి వర్గానికి ఈ పండుగలు నిజంగా ప్రయోజనం ఎలా అందించగలవు?

పరోక్ష పన్నులు ఎక్కువగా చెల్లించేది సాధారణ ప్రజలు మాత్రమే. వీటి ద్వారా ప్రభావితం అయ్యేది సాధారణ ప్రజలు మాత్రమే. విపరీతమైన జీతాలు సంపాదించే వర్గం పరోక్ష పన్నులు ఎన్ని ఉన్నా, ఎంత ఉన్నా వారి మీద ప్రభావం ఏమీ ఉండదు. అలానే కార్పొరేట్ వర్గానికి కూడా ప్రభావం ఉండదు. ఎందుకంటే విపరీతమైన జీతాలు లేదా లాభాలు సంపాదించే వర్గానికి ఈ పరోక్ష పన్నులు ప్రభావితం చేయవు. అవి ఎక్కువగా ఉన్నా తక్కువగా ఉన్నా వారి జీతాలు ఎక్కువ కారణంగా ఈ పన్నులు కట్టిన తర్వాత కూడా వారు బ్యాలెన్స్ గానే ఉంటారు. కానీ, అంతంత జీతాలు సంపాదించే వర్గానికి మాత్రమే జీఎస్టీ అత్యంత ప్రభావితం కలిగిస్తుంది. ఈరోజు తగ్గిన జీఎస్టీ దాదాపు 8 సంవత్సరాలు పెరిగే ఉంది. పెరిగిన పన్నులు 8 సంవత్సరాలు చెల్లించిన సాధారణ ప్రజలు ఈ ఐదారు రోజులు పండుగ చేసుకున్నంత మాత్రాన వారికి ఏ విధమైన సేవింగ్స్ ఉన్నట్టు చెప్పలేం. ఎందుకంటే దాదాపు 8 సంవత్సరాలు ఇదే ప్రజానీకం అత్యంత ఎక్కువ స్లాబులలో జీఎస్టీ చెల్లించారు. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంల మీద కూడా జీఎస్టీ చెల్లించారు. పండుగల పేర్ల మీద యువతరం అప్పుల్లో పడకుండా చూసుకోవలసిన అవసరం మాత్రం ఉంది. నిరుద్యోగ యువతకు నేడు కావాల్సింది ఉద్యోగాలు. ఉద్యోగాల్లో నాణ్యమైన జీతాలు. అందుకోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనంద భాష్పాలు. అదే నిజమైన పండుగ. ఆ పండుగ కోసం వేచి చూద్దాం.

**కేశవ్**
ఆర్థిక సామాజిక విశ్లేషకులు

# జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి తుది ఓటరు జాబితా విడుదల

**జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి**

**అన్ని పోలింగ్ కేంద్రాలకు పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్‌లను నియామకం చేయాలి**

**రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సమీక్ష**




**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలనీ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కోరారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి ,జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధ్యక్షతన మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి ,జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ రోజు తుది ఓటరు జాబితా విడుదల చేశామన్నారు. తుది జాబితా ప్రకారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 407 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 3,98,982 మంది ఓటర్లు ఉన్నాయన్నారు. ఓటర్లు తమ పేరును ఓటరు జాబితాలో వెరిఫై చేసుకునేందుకు ఈసీఐ వెబ్‌సైట్, సీఈఓ వెబ్‌సైట్, ఈఆర్వో కార్యాలయం, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ లో సంప్రదించవచ్చుననీ కమిషనర్ తెలిపారు. రాజకీయ పార్టీలు, పౌరులు ఫారం–6, ఫారం–7, ఫారం–8 లో అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు చేసుకోవడానికి నామినేషన్ల చివరి తేదీ వరకు అవకాశం ఉందన్నారు. జులై 1, 2025 నాటికి18 ఏళ్లు నిండిన వారు, అర్హులు ఉండి ఇప్పటికీ ఓటరుగా నమోదు చేసుకొని వారు ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు అదనంగా కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పడినందువల్ల కొంతమంది ఓటర్లు సమీప పోలింగ్ కేంద్రాలకు మార్చబడ్డారని అన్నారు. కాబట్టి ఓటర్లు తమ వివరాలు ఈసీఐ, సీఈవో వెబ్‌సైట్‌లలో తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికలు జరగడానికి అన్ని రాజకీయ పార్టీలు అన్ని పోలింగ్ కేంద్రాలకు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని ఆర్.వి. కర్ణన్ కోరారు. అంతకుముందు తుది జాబితా ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. సమావేశంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్ , రాజకీయ పార్టీల తరపున కె. నందేశ్ కుమార్ (బీఎస్పీ), పొన్న వెంకటరమణ, కొల్లూరు పవన్ కుమార్ (బీజేపీ), విజయ్ మల్లంగి (ఆప్), ఎం. శ్రీనివాసరావు (సీపీఐఎం), పి. రాజేశ్ కుమార్ (కాంగ్రెస్), ముఠా జై, ఎ. శ్రీనివాస్ గుప్తా (బీఆర్ఎస్), కె. జోగేందర్ సింగ్, బి.వై. శ్రీకాంత్ (టీడీపీ), సయ్యద్ ఖలీలుద్దీన్ (ఏ ఐ ఎం ఐ ఎం) తదితరులు హాజరయ్యారు.

# ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు

**సాధించిన సెంటినరీ కాలనీకి చెందిన తండ్రి కొడుకులు**



**మంథని (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండల్ సెంటనరీ కాలనీకి చెందిన మౌంటెనేర్ మాస్టర్ లెంకలా వివేకానంద రెడ్డి, వారి తండ్రి ఇంటర్నేషనల్ మౌంటినీర్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ లెంకల మహిపాల్ రెడ్డి , వీరిద్దరూ కలిసి యూరప్ ఖండంలోనే అత్యంత ఎత్తైన శిఖరం అయినటువంటి మౌంట్ ఎల్బ్రో స్ (5642 మీటర్)అనే పర్వతాన్ని ఆగస్టు 3 2025 తారీఖున అధిరోహించడం జరిగింది . ఈ సందర్భంగా వారు మత్తు పదార్థాల పట్ల అవగాహన కలిపించే సే నో యూస్ డ్రగ్స్ అనే బ్యానర్ ని పర్వతంపై ప్రదర్శించడం జరిగింది. కాగా తెలంగాణ నుండి పర్వతాన్ని అధిరోహించిన మొట్టమొదటి తండ్రి కొడుకులుగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సాధించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ ను తీసుకోవడం జరిగింది . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇలాంటి ఎన్నో పర్వతాలు అధిరోహించి జిల్లాకు మరియు రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కలెక్టర్ గారు కోరారు కాగా ఈ సందర్భంగా మాస్టర్ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ గారి ఇచ్చిన ప్రోత్సాహంతో మరిన్ని విజయాలు సాధిస్తానని తెలపడం జరిగింది ఈ విజయాన్ని పెద్దపెల్లి జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డితో పాటు పలువురు అధికారులు అభినందించారు.

# ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది

- ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ
- రాజకీయ నాయకులు, పాత్రికేయులందరూ సజావుగా జరిగేందుకు సహకరించాలి
- మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి విజ్ఞప్తి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** స్థానిక ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక ఎన్నికల షెడ్యూల్ వెలువడిన సందర్భంగా మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ వెలువరించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందని తెలిపారు. నోటిఫికేషన్ అక్టోబర్ 9న వస్తుందని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫేజ్ – 1కు సంబంధించి అక్టోబర్ 9 నుండి 11 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, 12న నామినేషన్ల పరిశీలన, అదేరోజు సాయంత్రం 5 గంటల తరువాత చెల్లుబాటు అయిన నామినేటెడ్ అభ్యర్థుల జాబిత విడుదల చేయడం జరుగుతుందన్నారు. అప్పీళ్ళకు అక్టోబర్ 13 చివరి తేదీ, అప్పీళ్ళ పరిష్కారణకు అక్టోబర్ 14 చివరి తేదీ, అభ్యర్థిత్వము ఉపసంహరణ చివరి తేదీ అక్టోబర్ 15, పోటీ చేయు అభ్యర్థుల జాబితా అక్టోబర్ 15న ప్రచురించడం జరుగుతుందని, అక్టోబర్ 23 న మొదటి పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫేజ్–2కు సంబంధించి అక్టోబర్ 13 నుండి 15 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, 16న నామినేషన్ల పరిశీలన, అదే రోజు సాయంత్రం 5 గంటల తరువాత చెల్లుబాటు అయిన నామినేటెడ్ అభ్యర్థుల జాబిత విడుదల చేయడం జరుగుతుందన్నారు. అప్పీళ్ళకు అక్టోబర్ 17 చివరి తేదీ, అప్పీళ్ళ పరిష్కారణకు అక్టోబర్ 18 చివరి తేదీ, అక్టోబర్ 23 న మొదటి పోలింగ్ జరుగుతుందని, అభ్యర్థిత్వం ఉపసంహరణ చివరి తేదీ అక్టోబర్ 19, పోటీ చేయు అభ్యర్థుల జాబితా అక్టోబర్ 19న ప్రచురించడం జరుగుతుందని, అక్టోబర్ 27 న రెండవ విడత పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

సర్పంచ్ ఫేజ్–1 ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 17 నుండి 19 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, 20 న నామినేషన్ల పరిశీలన, అదే రోజు సాయంత్రం 5 గంటల తరువాత చెల్లుబాటు అయిన నామినేటెడ్ అభ్యర్థుల జాబిత విడుదల చేయడం జరుగుతుందన్నారు. అప్పీళ్ళకు అక్టోబర్ 21 చివరి తేదీ, అప్పీళ్ళ పరిష్కారణకు అక్టోబర్ 22 చివరి తేదీ, అభ్యర్థిత్వము ఉపసంహరణ చివరి తేదీ అక్టోబర్ 23 పోటీ చేయు అభ్యర్థుల జాబితా అక్టోబర్ 23న ప్రచురించడం జరుగుతుందని, అక్టోబర్ 31న మొదటి పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

సర్పంచ్ ఫేజ్ ఫేజ్–2కు సంబంధించి అక్టోబర్ 21 నుండి 23వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, 24వ తేదీన నామినేషన్ల పరిశీలన, అదే రోజు సాయంత్రం 5 గంటల తరువాత చెల్లుబాటు అయిన నామినేటెడ్ అభ్యర్థుల జాబిత విడుదల చేయడం జరుగుతుందన్నారు. అప్పీళ్ళకు అక్టోబర్ 25 చివరి తేదీ, అప్పీళ్ళ పరిష్కారణకు అక్టోబర్ 26 చివరి తేదీ, అభ్యర్థిత్వము ఉపసంహరణ చివరి తేదీ అక్టోబర్ 27, పోటీ చేయు అభ్యర్థుల జాబితా అక్టోబర్ 27న ప్రచురించడం జరుగుతుందని, నవంబర్ 4న రెండవ విడత పోలింగ్ జరుగుతుందని తెలిపారు. గత ఎన్నికలలో తమ సహకారం అందించిన విధంగానే ఈ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించాలని పాత్రికేయులను కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టిగా మారిన ఇండియన్ సినిమా

**ఐఎండిబి–25 నివేదికలో వెల్లడి**

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** సినిమాలు, టీవీ కార్యక్రమాలు, ప్రముఖుల గురించి సమా చారం కోసం ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన అధికారిక వనరు అయిన ఐఎండిబి www.imdb.com మంగళవారం 25 ఏళ్ల భారతీ య సినిమా 2000–25 అనే నివేదికను విడుదల చేసిందని ఐఎండిబి ప్రతినిధులు మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొ న్నారు.వారు మాట్లాడుతూ ఇది గత పావు శతా బ్దంలో భారతీయ చలనచిత్ర పరిశ్రమ పరిణామం యొక్క సమగ్ర విశ్లేషణను కలిగి ఉందన్నారు.ఈ విశ్లేషణ ప్రపంచవ్యాప్తంగా 250 మిలియన్లకు పైగా నెలవారీ వినియోగదారుల నుండి ఐఎండిబి డేటా ఆధారంగా రూపొందించ బడిందన్నారు.ఈ నివేది క జనవరి 1, 2000 మరియు ఆగస్టు 31, 2025 మధ్య ప్రతి సంవత్సరం విడుదలైన టాప్ ఐదు అత్యంత ప్రజాదరణ పొందిన భారతీయ సినిమా లను పరిశీలిస్తుందని తెలిపారు. ఈ 130 సినిమా లు సమిష్టిగా 9.1 మిలియన్లకు పైగా ఐఎండిబి యూజర్ రేటింగ్‌లను కలిగి ఉన్నాయని తెలిపా రు. సగటున ఒక్కో సినిమాకు 70 వేల కంటే ఎక్కు వ, భాషలు, ఫార్మాట్‌లు, విడుదల నమూనాలలో ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ఆసక్తి యొక్క ప్రత్యేక మైన, రేఖాంశ వీక్షణను అందిస్తాయని తెలిపారు. గత దశాబ్దంలో భారతీయ సినిమాల్లో జరిగిన అత్యంత పర్యవసానమైన పరిణామాలలో ఒకటి దక్షిణాది పరిశ్రమలు, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం జాతీయ స్పృహలోకి ఎదగడం అని ఐఎండిబి నివేదిక పేర్కొంది.

# ర్యాపిడోతో పర్యాటక శాఖ 'హెరిటేజ్ కెప్టెన్స్' కార్యక్రమం




**ఖైరతాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** దేశంలో ప్రముఖ రైడ్ షేరింగ్ ప్లాట్‌ఫాంగా ఎదిగిన ర్యాపిడో తెలంగాణ ప్రభుత్వంలోని యువజన వ్యవహారా లు, పర్యాటక, సాంస్కృతిక శాఖతో ఒక ఎంఓ యూ కుదుర్చుకున్నట్లు ర్యాపిడో సహ వ్యవస్థాప కుడు పవన్ గుంటుపల్లి మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్–25 వేదికగా జరిగిన ఈ ఒప్పందం ప్రకారం 'ర్యాపిడో హెరిటేజ్ కెప్టెన్స్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా కొంతమంది ర్యాపి డో కెప్టెన్లను ఎంపిక చేసి, వారికి తెలంగాణలోని హెరిటేజ్ ప్రాంతాలు, సంస్కృతి తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని, తద్వారా స్థానికులు, పర్యాటకు లు మరింత మెరుగైన అనుభవాన్ని పొందుతారని అన్నారు. పర్యాటక శాఖతో కలిసి సంయుక్తంగా శిక్షణ కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యద ర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ ర్యాపిడోతో ఈ భాగస్వామ్యం ద్వారా తెలంగాణ వారసత్వ ప్రదేశా లు మరింతగా అందరికీ అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

# సింగూర్ బ్యాక్ వాటర్ బాధిత కుటుంబాల పరిశీలన

**ప్రత్యేకంగా నివాసాలను ఏర్పాటు చేసిన అధికారులు**



**న్యాల్ కల్, సెప్టెంబర్ 30, (జనం సాక్షి) :** తెలంగాణ కర్ణాటక సరిహద్దు, సంగారెడ్డి జిల్లా, న్యా ల్ కల్ మండలం, చీకూర్తి, హుస్సేన్ నగర్ గ్రామాల శివారులోకి సింగూరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వచ్చి చేరడంతో మండలంలోని అధికారుల బృందం పరిశీలించారు. మంగళవారం స్థానిక ఇన్చార్జి తహసిల్దార్ రాజిరెడ్డి, ఎస్సై సుజిత్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యామ్ రావు, తదితర అధికారుల బృందం పరిశీలించారు. గ్రామాల్లోని బాధిత కుటుంబాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు, వరద ఉధృతి తగ్గు ముఖం పడుతోందని, ఐన సరిహద్దు గ్రామాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో ఇండ్లలో నివాసం ఉండకుండా ప్రత్యేకంగా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో తాత్కాలిక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్యాక్ వాటర్ పూర్తిగా తగ్గుముఖం పట్టేంతవరకు గ్రామంలో 24 గంటలు అందుబాటులో ఉండేలా అధికారులను ఏర్పాటు చేయడం జరిగిందని తహసిల్దార్, ఎస్సైలు తెలిపారు. ఏమాత్రం భయభ్రాంతులకు గురి కాకూడదని, వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరిశీలించిన వారిలో అధికారులతో పాటు గ్రామానికి చెందిన అధికార, విపక్ష పార్టీ శ్రేణులు అడివి రెడ్డి, జనార్దన్ రెడ్డి, మేస్త్రి రవి, రామ కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

# నిండుకుండల్లా న్యాల్‌కల్ ప్రధాన ప్రాజెక్టు, చెరువులు

**ప్రాజెక్టు, చెరువుల్లోకి భారీగా వరద**

**ఈ ఏడాది వర్షాకాలం సీజన్లో 36 శాతం వర్షం అధికం**





**న్యాల్‌కల్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** న్యాల్ కల్ మండలంలో ప్రధాన ప్రాజెక్టు నారింజ. ప్రధాన చెరువులు హద్దునూర్, చినిగేపల్లి, గంగువార్, డప్పూర్. అత్యంత ప్రమాదకరమైన వాగులు, వంతెనలు రేజింతల్ – ఎల్గోయి మామిడి వాగు, చీకూర్థి – చాల్కి వాగు, డప్పూర్ – వడ్డీ వాగు, రాఘవపూర్ – మాటూరు వాగు. దాదాపు దశాబ్ద కాలం అనంతరం ఈ ఏడాది వర్షాకాలం సీజన్ లో అతి భారీ వర్షాలు కురవడంతో తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి న్యాల్ కల్, మనూర్, కోహిర్ మండలాల సరిహద్దుగా భారీగా వరద నీరు వచ్చి చేరడంతో మండలంలోని దాదాపు 0.85 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటి సామర్థ్యం గల ప్రధాన ప్రాజెక్టు నారింజ ప్రాజెక్టు. వేల ఎకరాల విస్తీర్ణం గల ప్రధాన చెరువులు నిండుకుండల్లా మారి జలకలను సంతరించు ఉంటున్నాయి. వరద నీరు ప్రతి భారీగా ఉధృతంగా వచ్చి చేరడంతో గత కొన్ని రోజులుగా నారింజ ప్రాజెక్టులోని రెండు గేట్లను ఎత్తివేసి దిగువ కర్ణాటక ప్రాంతం, కారంజ ప్రాజెక్టుకు తరలించారు. తిరిగి కారంజ ప్రాజెక్టు నుండి మంజీరా నది (సింగూర్ ప్రాజెక్టు)లోకి వచ్చి చేరడంతో మండలంలోని నది పరివాహక ప్రాంతాల శివారులోని వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి.

**ఈ ఏడాది వర్షాకాలం సీజన్ లో 36 శాతం వర్షపాతం అధికం**

ఈ ఏడాది 2025, 26 ఖరీఫ్ సీజన్ గాను మండలంలో ఏకంగా 36 శాతం వర్షపాతం అధికంగా వర్షం కురిసింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో 641.6 మిల్లీ మీటర్ల వర్షానికి గాను ఏకంగా 875.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జూన్ మాసంలో 119.5 మిల్లీమీటర్లకు గాను కేవలం 53.1 మిల్లీ మీటర్ల మేర అతి తక్కువ వర్షం కురిసింది. జూలైలో 178.9 ఎం ఎం గాను 265.4 మిల్లీ మీటర్లు, ఆగస్టులో 169.6 మి మీ గాను 327 మి మీ, సెప్టెంబర్ లో 173.6 మి మీ కు గాను 229.3 మిల్లీమీటర్ల మేర వర్షం కురిసింది. ఈ ఏడాది వర్షాకాలం సీజన్ లో 641.6 మిల్లీమీటర్ల మేర వర్షం కురవాల్సిందే ఉండగా.. 875.2 మి మీ మేర వర్షం కురిసింది. ఈ మేరకు ఈ ఏడాది వర్షాకాలం సీజన్ లో 23 సెంటీ మీటర్ల మేర వర్షం అధికంగా కురిసింది.

# రేషన్ డీలర్లకు 6 నెలల కమిషన్‌పై నిరసన




**మొగుడంపల్లి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** మండల వ్యాప్తంగా రేషన్ డీలర్లు తమకు రావాల్సిన ఆరు నెలల కమిషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నాడు రేషన్ షాపులు బంద్‌కు పిలుపునిచ్చారు. డీలర్లు చెబుతున్న దాని ప్రకారం, గత ఆరు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం వారు పంపిణీ చేసిన సరుకులకు సంబంధించిన కమిషన్లు విడుదల చేయకపోవడం వల్ల వారు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న కమిషన్ మంజూరు చేయకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు ధనసిరి అంజన్న మాట్లాడుతూ ఒక చిన్న వ్యాపారికి కూడా నెలవారీ ఆదాయం అవసరం కానీ మేము ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం కాబట్టి అధికారులను గౌరవిస్తూ పనిచేస్తున్నాం, అయినప్పటికీ మా కమిషన్‌లను నిలిపివేయడం అన్యాయం. వెంటనే చెల్లింపులు జరపకపోతే మా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామఅన్నారు.

# జీహెచ్ఎంసి పురోగతిలో మీ సేవలు మరువలేనివి

**జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్**

**పదవి విరమణ పొందిన 19మంది జిహెచ్ఎంసి అధికారులు, ఉద్యోగులకు ఆత్మీయ సత్కారం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** జీహెచ్ఎంసి పురోగతిలో పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సేవలు మరువలేనివనీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. మంగళవారం సాయంత్రం జీహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో పదవీ విరమణ పొందిన వివిధ స్థాయిలోని 19 మంది అధికారులు, ఉద్యోగులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ శాలువా, పూల దండలతో సత్కరించారు. గిఫ్ట్ లను బహుకరించారు. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ... పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించా రన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తాయ న్నారు. రిటైర్మెంట్ అన్నది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, రిటైర్మెంట్ పొందిన వారు వారి కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ, తమ ఆసక్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యంతో, ఆనందంగా గడపాలని ఆయన సూచించారు. వారి మున్ముందు జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని కోరారు. జోనల్ కమిషనర్‌లు అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, అదనపు కమిషనర్ కే వేణుగోపాల్ ,పిఆర్ఓ మామిండ్ల దశరథం, ఏఎంసీ శారదలు పాల్గొన్నారు.

**డిప్యూటీ కలెక్టర్ సాత్విక్ నాయక్‌కు సత్కారం**

జీహెచ్ఎంసీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ డిప్యూటీ కలెక్టర్ గా ఎంపికైన సాత్విక్ నాయక్ కు జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో అదనపు కమిషనర్ కే వేణుగోపాల్ , పిఆర్ఓ మామిండ్ల దశరథం, జీహెచ్ఎంసీ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. సాత్విక్ నాయక్ ప్రస్థానం స్ఫూర్తిదాయకం అని అదనపు కమిషనర్ తెలిపారు.

# మార్క్‌ఫెడ్ గేట్ ముందు బిఆర్ఎస్ నాయకుల నిరసన



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** కరీంనగర్ పట్టణం రాంనగర్ లోగల మార్క్ ఫెడ్ మైదానంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా దసరా రోజున నిర్వహించే రాంలీలా కారక్రమాన్ని నిర్వహించకుండా మార్క్ ఫెడ్ గేట్ కు తాళం వేయడాన్ని నిరసిస్తూ.. బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరి శంకర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు గేట్ ఎదురుగా ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. గేట్ ముందర బయటయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్లా హరిశంకర్ మాట్లాడుతూ...గత 15 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నామని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కావాలని అడ్డుకోవాలని చూస్తోందన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ కి కనీసం ఒక్క కార్పొరేటర్ లేదని ఎద్దేవా చేశారు. ఇది పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమమని దీన్ని జరిపే బాధ్యత గణేష్ ఉత్సవకమిటీదని వారన్నారు. గతంలో ఎన్నడు ఇలాంటి ఇబ్బందులు ఎప్పుడూ ఎదురు కాలేదని ఇప్పుడు మాత్రం కావాలని కాంగ్రెస్ నాయకులు ఆటంకం కల్పిస్తున్నారని ఆరోపించారు. మార్క్ ఫెడ్ డి.ఎం. కి, సుడా చైర్మన్ తో పాటు మంత్రి ఫోన్ చేసి వేడుకలు జరపకుండా చూడాలని ఆదేశించినట్టు వారు ఆరోపించారు. వందలాది మంది పోలీసులను మోహరించిన సరే ఈ కార్యక్రమం జరుగుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ఉత్సవ కమిటీతో చర్చించి అనుమతులు కల్పించాలని లేని పక్షంలో ప్రజలే తాళాలు పగులగొట్టి కార్యక్రమం జరుపుకుంటారనీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇది హిందువుల ఆధ్యాత్మిక కార్యక్రమని దీన్ని అడ్డుకోవాలని చూస్తే ప్రజలే గేట్ తాళాలు పగలగొట్టి వేడుకలు చేసుకుంటారని హెచ్చరించారు. సాయంత్రం లోగా స్పష్టత ఇవ్వాలన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్య వస్తే మాకు బాధ్యత ఉండదనీ, పోలీస్ కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని, హిందువుల మనోభావాలు దెబ్బతీయడం తగదనీ కరీంనగర్‌లో 15 చోట్ల ఉత్సవాలు జరుగుతున్నాయని కానీ ఇక్కడ మాత్రమే అడ్డుకోవడంలో ఏంటి అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్ తో పాటు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్లు పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, రెడ్డవేణి మధు, కొత్తపెల్లి మండలం మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, డివిజన్ మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ , మాజీ కార్పొరేటర్లు పార్టీ డివిజన్ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

**స్థానిక ఎన్నికల గెలుపే లక్ష్యం : చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**శంకర్‌పల్లి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని శంకేర్పల్లి మండలానికి చెందిన 150 మంది పలువురు బిఆర్ఎస్, బిజెపి నాయకులు గోపులారం మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ ఆధ్వర్యంలో,చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో,కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.శంకర్పల్లి మండలంలోని గోపులారం,మహారాజ్ పేట్, ఇరుకుంటతండా, దొంతన్ పల్లి, గ్రామాల నుండి పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. గోపులారం మాజీ ఎంపిటిసి సత్యనారాయణ రెడ్డి బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరగా,మహారాజ్ పేట్ మాజీ ఉపసర్పంచ్ జోగు నరసింహ, బిజెపి పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు,మహారాజ్ పేట్ మాజీ సర్పంచ్ మానేమ్మ సామయ్య,ఇరుకుట తండా మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్ నాయక్, గోపులార సొసైటీ డైరెక్టర్ లింగారెడ్డి,రవీందర్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ సత్యనారాయణ, రాఘవేందర్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు నాయకులు కిషన్ చేరారు. ఈ కార్యక్రమంలో తొండగొట్టయ్య, మహేందర్,శ్రీకాంత్, ప్రశాంత్, గణేష్ గౌడ్, గోపులారం, మహారాజ్పేట్ ఇరుకుంట తండా, దొంతనపల్లి నుండి పరువులు నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
01 అక్టోబర్ 2025

## ధర్మాన్ని కాపాడే శక్తి స్వరూపిణిగా దుర్గామాతను కొలుస్తాం

**మాజీ మంత్రి డాక్టర్ చర్ల కోల లక్ష్మారెడ్డి**

**మండలంలోని పలు గ్రామాలలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు**



**ఉర్కొండ సెప్టెంబర్ 30, ( జనం సాక్షి ) :** ధర్మాన్ని కాపాడే నైతిక శక్తిగా, భగవంతుని శక్తి స్వరూపిణిగా శ్రీ దుర్గా మాత కొలుస్తామని బిఆర్ఎస్ మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు మాజీమంత్రి డాక్టర్ చర్లకోల లక్ష్మారెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలంలోని ఊరుకొండ పేట ,జకినాలపల్లి తదితర గ్రామాలలో జరిగే శ్రీ దుర్గా మాత శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్, శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి బతుకమ్మ బోనాలతో ఘనంగా స్వాగతం పలికి పూలమాలలతో, శాలువాలతో సన్మానించారు. అనంతరం జరిగిన బతుకమ్మ సంబరాలలో మహిళలు, యువకులు, చిన్నారులతో కలిసి బతుకమ్మ ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడతూ మనిషిలో సద్గుణాలు పెంపొందాలన్నా, మానసిక శక్తిని పెంపొందించుకోవాలన్న దుర్గామాత అమ్మవారిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించాలని కోరారు.తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో కొలుస్తూ పూజలు చేయడం మన సంప్రదాయమని, హిందూ పర్వదినాలలో అత్యంత పవిత్రమైన, భక్తి శ్రద్ధలతో కూడిన ఉత్సవాలు శరన్నవరాత్రి ఉత్సవాలు అని పేర్కొన్నారు. దసరా పర్వదినం అమ్మవారికి చేసే పూజా తంతువు అధర్మంపై ధర్మం గెలుపును సూచిస్తుందని అభిప్రాయపడ్డారు. అమ్మవారి కార్యక్రమంలో దయ , కృపతో రైతులు సంతోషంగా ఉండాలని, సకలజనులు ప్రశాంతమైన వాతావరణంలో జీవనం సాగించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ మరియు మండల ప్రజలకు ముందుగా బతుకమ్మ ,నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ధ్యాప వీరారెడ్డి,బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు , బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.



## వరంగల్‌కు సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ మంజూరు

**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల దశాబ్దాల ఆశయాన్ని నెరవేర్చిన ఎంపీ కావ్య**

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ మంజూరుకు కృషి చేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పట్టుదలతో వెల్నెస్ సెంటర్ మంజూరికి కృషి చేశారు. వెల్‌నెస్ సెంటర్ఏర్పాటు కోసం అనువైన భవనాన్ని వెంటనే పరిశీలించాలని జిల్లా కలెక్టర్, జి డబ్ల్యు ఎంసీ కమిషనర్ లను ఎంపి కావ్య కోరారు. ఇతర రాష్ట్రాల ఎంపీలతో కలిసి వినతి పత్రం అందజేసి, సంతకాలను సేకరించి కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేసిన ఎంపీ డా.కడియం కావ్య వరంగల్ కు తీసుకొచ్చారు. వరంగల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వెల్నెస్ సెంటర్ సాధనలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య చేసిన కృషి ఫలించింది. ఎన్నో ఏండ్లుగా ఈ డిమాండ్ ఉన్నప్పటికీ గత పాలకులు ఎవరు పట్టించుకోలేదు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యుల కష్టాలను గుర్తించిన ఎంపీ డా. కడియం కావ్య గారు వరంగల్ నుండి ఢిల్లీ వరకు అనేక సార్లు ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలతో సమన్వయం జరిపి సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను వరంగల్‌కు తీసుకురావడంలో ఎంపీ కృషి ఫలితమిచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఇప్పటివరకు హైదరాబాద్‌లోని సి జి హెచ్ ఎస సెంటర్లకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేది. దీని వల్ల వృద్ధులైన పెన్షనర్లకు తీవ్ర ఇబ్బందులు కలిగేవి.

ఇప్పుడు వరంగల్‌లోనే వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కావడం వల్ల వేలాది కుటుంబాలకు ఉన్నత స్థాయి వైద్యసేవలు, సులభమైన మెడికల్ రీయింబర్స్‌మెంట్ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని ఎంపీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరానికి ఇది అత్యంత అవసరం. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది సౌలభ్యం కోసం వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కావడం చాలా సంతోషకరం అన్నారు. ఇకపై వైద్య సేవల కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం ఉండదు అని తెలిపారు. వెల్‌నెస్ సెంటర్ఏర్పాటు కోసం అనువైన భవనాన్ని వెంటనే పరిశీలించాలని జిల్లా కలెక్టర్, GWMC కమిషనర్ లకు ఎంపీ సూచించారు. వరంగల్‌కు వెల్నెస్ సెంటర్ మంజూరు కోసం గతంలో కేంద్రమంత్రులను కలిసి పలుమార్లు కలవడంతోపాటు, వివిధ రాష్ట్రాల్లో వెల్ నెస్ సెంటర్ల ఏర్పాటు విషయంలో ఆయా రాష్ట్రల ఎంపీలను సమన్వయం చేసి వినతిపత్రం ముందుకు తీసుకు పోవడానికి ఎంపీ కృషి చేసారు. ఈ కృషి ఫలితంగానే వెల్ నెస్ సెంటర్ కు సిబ్బంది కేటాయింపు అలాగే వెల్ నెస్ సెంటర్లలను ఎక్కడ ఏర్పాటు చేయాలో ప్రతిపాదన లను ముందుకు తీసుకు వెళ్లడానికి అవకాశం లభించింది. అదే సమయంలో వరంగల్ అభివృద్ధి కోసం మరిన్ని కేంద్ర





సంస్థలు, సదుపాయాలను తీసుకురావడానికి కృషి చేస్తానని ఎంపీ డా.కడియం కావ్య హామీ ఇచ్చారు. ఈ మేరకు వరంగల్ కు వెల్‌నెస్ సెంటర్ మంజూరు కోసం అహర్నిశలు కృషి చేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## స్ట్రాంగ్ రూమ్ కోసం అన్ని ఏర్పాట్లు

**ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 30(జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రి కళాశాల భవనాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డిగ్రీ కళాశాల భవనము క్షుణ్ణంగా పరిశీలించారు. స్ట్రాంగ్ రూము ఏర్పాటుకు కిటికీలు, వెంటిలేటర్లను పూర్తిగా మూసివేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూముకు రంగులు వేయించాలని, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకొని సీసీ కెమెరాలు అమర్చాలని తెలిపారు. నిరంతరం పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ దేవ్ రాజ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు పాత్ర కీలకం

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఎన్నికలు నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు వెన్నుముక లాంటివారని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం ఐడిఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై పీఓలు, ఏపీఓలకు మాస్టర్ ట్రైనర్లతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల విధులు చాలా కీలకమని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు ముఖ్యపాత్ర పోషిస్తారని అన్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి దశ అత్యంత కీలకమని, మాస్టర్ ట్రైనర్లు పోలింగ్ సిబ్బందికి సమగ్ర శిక్షణ అందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద



శాంతి భద్రతల నిర్వహణ, ఓటర్ల సౌకర్యాలు, బ్యాలెట్ బాక్సులు, ఓటరు స్లిప్పులు, అభ్యర్థుల గుర్తులు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు తదితర అంశాలను తెలియజేశారు. మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేలా పిఓలు, ఏపిఓ లతో పాటు సిబ్బందికి మార్గనిర్దేశనం చేయాలని కలెక్టర్ సూచించారు. హ్యాండ్ బుక్ ఆధారంగా ఎన్నికల నిబంధనలు పాటించాలని ఏవైనా సమస్యలు వస్తే వెంటనే పై అధికారులకు సమాచారం ఇవ్వాలని, ప్రశాంతమైన వాతావరణంలో పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిపిఓ శ్రీలత, మాస్టర్ ట్రైనర్లు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం మత్తులో భార్యను చంపిన భర్త

**చిట్యాల, సెప్టెంబర్ 30(జనంసాక్షి)** మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో మద్యంమత్తులో భార్యను రోకలి బండతో కొట్టి చంపిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలాపూర్ గ్రామానికి చెందిన కనుకుంట్ల లింగయ్య తన భార్య ప్రమీల(50) ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో రోకలి బండతో కొట్టి చంపినట్లు పేర్కొన్నారు. భార్యను చంపి పరారైపోతున్న లింగయ్య గురించి గ్రామస్తులు పోలీసులకు సమాచార అందించారు. ఘటన స్థలానికి సీఐ దగ్గు మల్లేష్ ,ఎస్సై శ్రావణ్ కుమార్ వెళ్లి నిందితుడు లింగయ్యను అదుపులో తీసుకున్నారు. అనంతరం సంఘటన స్థలాన్ని పరిశీలించారు .మృతురాలికి ఇద్దరు కుమారులు హరీష్, సురేష్ లున్నారు. పెద్ద కుమారుడు హరీష్



ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.దసరా పండుగ సందర్భంగా భార్యను భర్త హత్య చేయడంతో కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.

## గ్రామానికి ఉచిత మంచినీరు సరఫరా చేయాలి




**భూపాలపల్లి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** గత కొన్ని సంవత్సరాలుగా అక్రమంగా మంచినీటి బిల్లును వసూలు చేస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రాయపల్లి గ్రామంలో మంచినీటిపై బిల్లులు వసూలు చేస్తున్న విషయంలో గ్రామస్తులు ఈ విషయంపై గ్రామ కార్యదర్శి రాతపూర్వకంగా వినతి పత్రం అందజేసి ఫిర్యాదు చేశారు . ప్రభుత్వాలు ప్రతి ఇంటికి మంచినీరు అందించి మహిళలకు ఇబ్బంది కలగకూడదని సదుద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ పథకానికి కొన్ని గ్రామాలు తూట్లు పొడుస్తూ పక్కదారి పట్టిస్తున్నారు ఇప్పటికైనా ప్రభుత్వాలు అధికారులు స్పందించి గ్రామానికి ఉచిత మంచినీటి పథకం కింద ప్రతి గ్రామంలో ఉచిత మంచినీరు అందించాలని . గ్రామ అధికారులు వసూలు చేస్తూ ప్రభుత్వాలకు చెడ్డ పేరు తీసుకొస్తున్నారు. ఈ విషయంపై గ్రామ అధికారులతో మాట్లాడరా వివిధ కారణాలు చెప్తున్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి గ్రామ సమస్యలు పరిష్కరించి గ్రామ ప్రజలకు ఉచిత మంచినీరు అందించాలని ఇంతకుముందు వసూలు చేసిన డబ్బులు తిరిగి అందజేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామవాసులు కోరుతున్నారు.

## మహబూబ్‌నగర్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

**మహబూబ్ నగర్ బ్యూరో సెప్టెంబర్ 30(జనంసాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రవిత్య బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ప్రభుత్వ పరంగా అధికారికంగా నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటాయి . తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ వేడుకకు అట్టహాసపు ఏర్పాట్లు చేశారు. జిల్లా యంత్రాంగం భాగస్వాములైన ఈ వేడుకతో జూనియర్ కళాశాల గ్రౌండ్ సరికొత్త శోభను సంతరించుకుంది. రంగు రంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒక చోటకు చేర్చి, గౌరీ మాతను స్తుతిస్తూ మహిళలు లయబద్ధంగా చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మహిళలు ఆలపించిన గేయాల బతుకమ్మ ప్రాశస్త్యాన్ని చాటి చెప్పాయి. ప్రకృతిని ఆరాధించే ఈ వేడుక ఔన్నత్యం ఆవిష్కృతం అయ్యేలా, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అనే తేడా లేకుండా మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ వేడుకకు



వన్నెలద్దారు. మహిళా అధికారులు,మహిళా ఉద్యోగులు గౌరీమాతకు సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. మెప్మా,సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు,ఉద్యాన శాఖ,డి.ఆర్.డి. ఓ వివిధ శాఖల ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన బతుకమ్మలు కనువిందు చేస్తూ, పూల పండుగ



ప్రాధాన్యతను ఇనుమడింపజేశాయి. సాయంత్రం 5 గంటల నుండి రాత్రి వరకు కూడా ఏమాత్రం అలసట చెందకుండా మహిళలు ఎంతో హుషారుగా బతుకమ్మ ఆడుతూ, తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

దేదీప్యమానమైన విద్యుత్ దీపాల వెలుగులలో, అందంగా అలంకరించుకుని నూతన దుస్తుల్లో బతుకమ్మలతో తరలి వచ్చిన అతివలతో జూనియర్ కలశాల మైదానం అందమైన దృశ్యాన్ని ఆవిష్కరింపజేసింది. , బతుకమ్మ ఆటపాటలతో ఎటు చూసినా సందడి వాతావరణం కనిపించింది. ఈ వేడుకలకు విచ్చేసి విజయవంతం చేసిన మహిళలకు జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 21 నుండి బతుకమ్మ వేడుకలు ప్రతి రోజు కొన్ని శాఖల కు చెందిన మహిళలు పాల్గొని బతుకమ్మ వేడుకలు విజయవంతం గా నిర్వహించారు.

## 5వ షెడ్యూల్ ఏరియాలో ఎంపీటీసీ, జడ్పీటీసీకి బీసీలు ఎలా అర్హులవుతారు..?

**ఏజెన్సీ ఏరియాలో ఎంపీటీసీ జడ్పీటీసీలు ఆదివాసులకే ఇవ్వాలి**



**ములుగు ప్రతినిధి-తాడ్వాయి, సెప్టెంబర్ 30(జనంసాక్షి) :** తాడ్వాయి మండలంలో అసలు 5వ షెడ్యూల్ ఏజన్సీ ఏరియాలో వేరే కులాల వారికి అవకాశం ఇవ్వడమేమిటి అసలు,1976లో జరిగిన లంబాడీ ల పెంటకే 50 సంవత్సరాలు గోస అనుభవిస్తున్నాం, అప్పుడంటే మనవారికి చట్టాలపై అంతా అవగాహనా లేదు అందరూ కూడా గూడెలకు అడవులకు మాత్రమే పరిమితమై ఉన్నాము. కాబట్టి మరీ ఇప్పుడు కూడా తెలిసి తెలిసీ మళ్ళీ అదే తప్పును పునరావృత్తం చేద్దామంటారా ఆదివాసీ మేధావులారా, నాయకులారా, విద్యావంతులారా..పెద్దలారా, ప్రజలారా ఆలోచన చేయండి. 5వ షెడ్యూల్ లో ప్రభుత్వం కూడా గిరిజనేతురుడే అనేది నిజం అయితే ప్రభుత్వం ఎంపీటీసీ జడ్పీటీసీ సీట్లను ఇతర కులాలకు కేటాయిస్తూ విడుదల చేసినా దానిని ఏజన్సీలో ఉన్నా ఆదివాసీలు ఎలా అంగీకరించడం ఒకసారి ఆలోచన చేయాలి. మనవారు జడ్పీటీసీ లకు కూడా పనికిరాని వారా.. మాట్లాడితే జనాభా ప్రాతిపధికానా అంటున్నారు తప్పా 5వ షెడ్యూల్ గురించి ఎవరూ కూడా ఆలోచన చేయడం లేదు. ఒకప్పుడు 5వ షెడ్యూల్ ఏర్పాటు సమయంలో ఇంత లేని ఇతర కులాల జనాభాకు జనాభా ప్రాతిపదికానా అంటూ అవకాశం ఇవ్వడం ఏమిటీ, లంబాడి తోనే సగం ఆగం అయినా మన ఆదివాసీ జాతి మనుగడ అస్థిత్వం ఇతర కులాలను జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం ఇతర కులాల వారికి రాజకీయంగా అవకాశం ఇస్తే మన 5వ షెడ్యూల్ ఏజన్సీ ఏరియాలో పరిస్థితి ఏమిటనేది ఆలోచన చేసి ఖండించవల్సిన ఆవశ్యకతా ఆదివాసులందరి పైన ఉన్నదని అందరు దీన్ని ఖండించాలి స్పందించాలి. అందరు చైతన్యం కావాలి పెద్ద ఎత్తున ఆలోచన చేయాలి 5వ షెడ్యూల్ ప్రాంతంలో సర్పంచ్ ఎంపీటీసీ జడ్పీటీసీ రిజర్వేషన్ వంద శాతం ఆదివాసీ తెగలకు మాత్రమే వర్తిస్తుంది అని గొంది లక్ష్మణమూర్తి అన్నారు.

## ప్రతి మండలానికి ముగ్గురు చొప్పన అధికారులు

**ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి**

**రాజకీయ పార్టీ నాయకులు, అధికారులతో సమీక్ష సమావేశం**

**మహబూబాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లాలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి, గ్రామపంచాయతీ సర్పంచ్, ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల(నియమావళి) పాటించి, సహకరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కోరారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్నికల విభాగం సంబంధిత సిబ్బందితో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, (ఎన్నికల నియమావళి) నీ పాటిస్తూ ఎన్నికలు సజావుగా జరుగుటకు సహకరించాలని ఎన్నికల నిబంధనలకు సంబంధించి తీసుకోవలసిన చర్యలు, నామినేషన్ల ప్రక్రియ, స్క్రూటీని ఖర్చుల వివరాలు ఎన్నికలు నిబంధనలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రేనర్స్ ప్రవీణ్ తెలిపారు. మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ సిపిఓ అశోక్ బ్యాలెట్ బాక్స్ మేనేజ్మెంట్ డిపిఓ హరిప్రసాద్ ట్రాన్స్పోర్ట్



మేనేజ్మెంట్ ఆర్టీవో జైపాల్ రెడ్డి ట్రైనింగ్ మేనేజ్మెంట్ డిఇఓ దక్షిణామూర్తి మెటీరియల్ మేనేజ్మెంట్ అదనపు కలెక్టర్ రెవిన్యూ అనిల్ కుమార్, ఎక్స్‌పెండిచర్ వెంకటేశ్వర్లు అబ్జర్వర్ మేనేజ్మెంట్ డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, బ్యాలెట్ పేపర్ డిఆర్డిఓ మధుసూదన రాజు మీడియా కమ్యూనికేషన్ మేనేజ్మెంట్ డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ హెల్ప్లైన్ గ్రీవెన్స్ పుల్లారావు నివేదికలు సమర్పణ జెడ్పి సీఈవో పురుషోత్తం ఎంసిఓసి ఎక్స్పెండిచర్ అకౌంట్స్ మానిటరింగ్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో హౌసింగ్ పీడీ హనుమలను నియమించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతి మండలానికి ముగ్గురు చొప్పున అధికారులు నియమించడం జరిగింది, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ఎస్టి వీడియో వింగ్ తదితర ఎన్నికల నిర్వహణ కమిటీలకు ప్రత్యేక అధికారులను నియమించి ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో కె.అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సురేష్ నాయుడు బిఆర్ఎస్ పార్టీ మార్నేని వెంకన్న, బిజేపీ పార్టీ కె.శ్యామ్ సుందర్ మలోత్ బాబు టిడిపి పి.బి.రామారావు సిపిఐ టి.సందీప్ జడ్పీ సీఈవో పురుషోత్తం డిపిఓ హరిప్రసాద్ కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ పర్యవేక్షలు రాఘవ రెడ్డి మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 11 వరకు అమలులో ఎన్నికల కోడ్

**జిల్లాలో అమల్లోకి ఎన్నికల ప్రవర్తన నియమావళి**

**వరంగల్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)పై అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ సోమవారం విడుదలైన నేపథ్యంలో జిల్లాలోనూ ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమల్లోకి వచ్చిందని, నవంబర్ 11వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇచ్చిందని, షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం నుండి నవంబర్ 11వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు మొదటి దశలో ఆరు మండలాలు, 67 ఎంపీటీసీ స్థానాలకు, రెండో దశలో ఆరు మండలాలు, 62 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీలకు



రాష్ట్రంలో మూడు దశల్లో ఎన్నికల నిర్వహిస్తుండగా హనుమకొండ జిల్లాలో రెండు, మూడో దశల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో 210 గ్రామపంచాయతీలు ఉండగా, వీటిలో 1986 వార్డు లు ఉన్నాయన్నారు. మొదటి దశలో 108 గ్రామపంచాయతీలకు, 1074 వార్డులకు, రెండో దశలో 102 గ్రామపంచాయతీలు, 912 వార్డులకు ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 3లక్షల 70 వేల 871 మంది ఓటర్లు ఉండగా స్థానిక సంస్థల్లో ఓటు వేయనున్నారు. మొత్తం ఓటర్లలో పురుషులు 1,80, 000 మంది ఓటర్లు, మహిళలు 1,90,000 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో 210 గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. ప్రతి 650 మంది ఓటర్ల గాను ఒక పోలింగ్ కేంద్రాన్ని కేటాయించినట్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలో 1980 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల వారీగా ఇదివరకే ఓటర్ల జాబితా ప్రదర్శించడం జరిగిందని పేర్కొన్నారు. మొదటి దశ శిక్షణ కార్యక్రమం ఇప్పటి వరకే పూర్తయ్యిందని, మిగిలిన అధికారులు, సిబ్బందికి రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎస్ ఎస్ టి బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన అంశాలను స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు నోడల్ అధికారి, పంచాయతీరాజ్ ఈఈ ఆత్మారామ్, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి వివరించారు.

## ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి 50కోట్లు మంజూరు

- ఏడాదిలో అన్ని పనులు పూర్తి చేయిస్తా
- నియోజకవర్గ అభివృద్ధే ఏకైక లక్ష్యం
- స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) : నాకున్న ఏకైక లక్ష్యం నియోజకవర్గ అభివృద్ధి, ఏకైక ఎజెండా ప్రజల సంక్షేమం మాత్రమేనని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం జనవరిలోనే మున్సిపాలిటీ చేశానని, మున్సిపాలిటీ అభివృద్ధికి 50 కోట్లు మంజూ రు తీసుకువచ్చానని వెల్లడించారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలలో ఎక్కువ నిధులు మనకే వచ్చాయని తెలిపారు. మనపై ఉన్న ప్రేమతో ఎక్కువ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నియో జకవర్గ ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయ భవనం,టౌన్ హల్, ఇంటిగ్రె టెడ్ మార్కెట్, సిసి రోడ్లు, డ్రైన్లు, రోడ్డు వెడల్పు వంటి పనులకు 50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ఈ పనులు అన్నింటిని ఏడాదిలో పూర్తి చేస్తానని వీటితోపాటు 100పడకల అస్పత్రి, డివిజనల్ ఆఫీస్, డిగ్రీ కళాశాల ఏర్పాటుతో ఘనపూర్ మున్సిపాలిటీ రూపురేఖలు మారుతా యని పేర్కొన్నారు. దేవాదుల పెండిం గ్ పనులు, గండి రామారం కుడి కాలువ, లిఫ్ట్ పనుల ను పూర్తిచేసి నియోజక వర్గంలోని ప్రతీఎకరానికి సాగు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు.స్థానిక సంస్థల ఎన్ని కలలో కాంగ్రెస్ పార్టీబలపర్చిన అభ్యర్థులను మాత్రమే గెలిపిం చాలని, అందురూ ఒకే పార్టీ వారు ఉంటే అభి వృద్ధి సుగమం అవుతుందని అందుకే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి సహకరిం చాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశంలో ఏ పార్టీ,ఏప్రభుత్వం తీసుకొని సహసోపేత నిర్ణయం సీఎం రేవంత్ రెడ్డి తీసుకు న్నారని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి, గవర్నర్ కు పంపించి నట్లు తెలిపారు. బిసిలపై ప్రేమ ఓలకబోసే పార్టీలు బిసి రిజర్వేషన్లకు మద్దత్తు తెలపాలని కోరారు. బిఆర్ఎస్, బీజేపీ పార్టీలతో పాటు అన్ని రాజకీయ పక్షాలు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించాలని, ఎవరైనా కోర్టుకు వెళ్లినా కేసులు ఉపసంహారిం చుకోవాలని కోరారు. ఈ సమావే శంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య, చిల్పూర్ దేవస్థాన కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, నియో జకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధికారుల పాత్ర కీలకం

- స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి
- పొరపాట్లకు ఆస్కారం ఇవ్వద్దు
- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్




ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 30(జనంసాక్షి) : రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ లోకల్ బాడీ ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థ ల ఎన్నికల నిర్వహణ పై ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగివుండాలని అన్నారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలతో సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వస్తువుల సీజ్ చేసిన సందర్భాలలో అన్ని బృందాలు సమన్వయం చేసుకోవాలని సూచించినారు. జిల్లాలోని చెక్ పోస్టులలో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా, పకడ్బంధీగా జరిగేలా చూడాలని అన్నారు. నోడల్ అధికారులు ప్రతి రోజు రిపోర్ట్ లు నిర్ణిత ఫార్మాట్‌లో సమర్పిచాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత నామినేషన్ పత్రాల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల హ్యాండ్ బుక్ లోని ప్రతి అంశంపై అవగాహన తెచ్చుకోవాలన్నారు. పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని.. అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో మాన్ పవర్ మేనేజ్మెంట్, బ్యాలెట్ బాక్సుల మేనేజ్మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్మెంట్, శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్‌లైన్, కంప్లైంట్స్ రెడ్రెస్సల్, వెబ్‌కాస్టింగ్ తదితర విభాగాల వారీగా సంబంధిత నోడల్ అధికారులు, జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎలాంటి అంతరాయం లేకుండా జరిగేందుకు ప్రతి విభాగానికి నోడల్ అధికారులను నియమించామని, ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా ఎన్నికల నిర్వహణ జరగాలి. శాంతియుత, స్వేచ్ఛాత్మక మరియు పారదర్శక ఎన్నికలకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్పష్టం చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున అందరూ పాటించాల్సిన నిబంధనలను గుర్తుచేశారు. అధికారుల తీరుపై ఎలాంటి విరోధాలు వచ్చినా, కఠిన చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని హెచ్చరించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లా ప్రజలందరూ ఎన్నికల నియమావళిని పాటించి, శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ సమావేశం లో డిపిఓ దేవ్ రాజ్, సిపిఓ ప్రకాశ్, ఆర్టీఓ శ్రీనివాస్, ఎల్డీఎం జయ ప్రకాష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో చిన్నారి మృతి

- ఖానాపూర్‌లో కుటుంబీకుల ఆందోళన



ఖానాపూర్ టౌన్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని మేడి కేర్ హాస్పిటల్ లో సరైన వైద్యం అందలేదనే ఆరోపణలతో 18 నెలల చిన్నారి మరణం సంచలనం రేపింది. ఈ ఘటనపై కుటుంబీకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న బాలుడు అయాన్ స్థానిక మేడి కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అయితే పరిస్థితి విషమించడంతో వైద్యులు తొలుత నిర్మల్‌కు,అక్కడి నుంచి హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలోనే బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనతో మృత్యుని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. హాస్పిటల్‌లో ఫర్నిచర్, రెసెప్షన్ టేబుల్‌ను ధ్వంసం చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యమే చిన్నారి మృతికి కారణమని కుటుంబీకులు ఆరోపించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు అక్కడికి చేరుకుని జాగ్రత్తలు చేపట్టారు.

## యాస్పిరేషన్ పారా మీటర్లు పకడ్బందీగా నమోదు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): యాస్పిరేషన్ పారా మీటర్లు పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో పలిమెల, మహాముత్తారం మండలాల యాస్పిరేషన్ పారా మీటర్ల నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాస్పిరేషన్ ఇండికేటర్స్ నమోదు ఖచ్చితంగా, పారదర్శకంగా ఉండాలని, ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్దిష్టమైన సమయానికి పూర్తిచేయాలని సూచించారు. విద్య, వైద్య ఆరోగ్యం, ఉద్యాన, వ్యవసాయం, మహిళా శిశు సంక్షేమం వంటి విభాగాల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసి, గ్రామ స్థాయిలో డేటా నమోదులో ఎలాంటి లోపాలు, వ్యత్యాసం రాకుండా ఖచ్చితత్వం వుండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జనాభా, వసతులు, అభివృద్ధి సూచికలు, శిశు, మాతృ ఆరోగ్యం, విద్యా ప్రమాణాలు, పంటల ఉత్పాదకత వంటి అంశాలను సమగ్రంగా నమోదు చేసి, సమయానికి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, సీపీఓ బాబూరావు, డిఆర్డీఓ బాలకృష్ణ, పశు సంవర్ధక శాఖ డిడి డా కుమారస్వామి, మహిళా, శిశు సంక్షేమ అధికారి మల్లీశ్వరీ, డీఈఓ రాజేందర్, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ఉద్యానవనశాఖ అధికారి సునీల్ కుమార్, వ్యవసాయ అధికారి బాబూరావు, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, యాస్పిరేషన్ ఫెలో పృద్వి తదితరులు పాల్గొన్నారు.

### స్ట్రాంగ్ రూమ్ కోసం హాస్టల్ భవనం పరిశీలించిన కలెక్టర్

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో స్ట్రాంగ్ రూము ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల భవనాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశ్రమ పాఠశాలలోని భవనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్ట్రాంగ్ రూము ఏర్పాటుకు కిటికీలు, వెంటిలేటర్లను పూర్తిగా మూసివేయాలని సూచించారు. స్ట్రాంగ్ రూముకు రంగులు వేయించాలని, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకొని సీసీ కెమెరాలు అమర్చాలని తెలిపారు. నిరంతరం పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలని తెలిపారు.

## మత్తు వీడని యువత పిచ్చిచేష్టలు

- నల్లగుంటలో తాగి ఫ్లెక్సీలు చింపి, కూర్చొనే బెంచీలు ధ్వంసం
- రోజురోజుకు తప్పదారి పడుతున్న యువత
- పలుమార్లు గ్రామపెద్దలు హెచ్చరించినా ఫలితం లేదు





ములుగు/ వెంకటాపూర్, సెప్టెంబర్30 (జనం సాక్షి): వెంకటాపూర్ మండలం లోని నల్లగుంట గ్రామంలో యువత పూర్తి తప్పుదారిలో పోతున్నారు. అర్ధరాత్రి వరకు ఊళ్లో తిరుగుతూ పిచ్చి చేష్టలు చేస్తున్నారు. నల్లగుంట గ్రామంలో సోమవారం రోజున సద్దుల బతుకమ్మ వేడుకల అనంతరం అర్ధ రాత్రి సమయం గుర్తు తెలియని వ్యక్తులు గ్రామం లో కష్టపడి పోలీస్ జాబ్ సాధించిన అధికారులు అందరూ కలిసి ఐక్యత తో ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్స్ నీ చింపారు.బస్టాండ్ వద్ద ఉన్న బెంచీలను ద్వంస్థం చేశారు.దీని పై గ్రామ పెద్దలు, అధికారులు వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌లో దుండగులపై కేసు పెట్టారు. దీనిపై ఎస్ఐ చల్ల రాజు దుండగులు ఎవరైనా గాని తప్పకుండా పట్టుకుంటామని కఠినం గా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామ యువత కు కూడా పండుగ అనంతరం ఒక మీటింగ్ ఏర్పాటు చేసి అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తాం అని చెప్పారు. గ్రామ పెద్దలు,గ్రామం లోని పోలీసు అధికారులు సైతం గ్రామంలోని యువతకు అవగాహన సదస్సు ను ఏర్పాటు చేయాలని అలాగే దుండగులకు శిక్ష పడేలా చూడాలని కోరారు.

## జెడ్పీటీసీ, ఎంపీటీసీ సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి


- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద...




వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 30(జనంసాక్షి): రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా, నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా కలెక్టర్ స్థానిక సంస్థ ల ఎన్నికల నిర్వహణ పై అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిపిఓ కల్పన లతో కలసి ఆర్డీఓ లు, ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత నామినేషన్ పత్రాల స్వీకరణ నుంచి ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమకు అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల హ్యాండ్ బుక్ లోని ప్రతి అంశంపై సంపూర్ణ అవగాహన తెచ్చుకోవాలన్నారు. పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని.. అనుమానాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలతో సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వస్తువుల సీజ్ చేసిన సందర్భాలలో అన్ని బృందాలు సమన్వయం చేసుకోవాలని సూచించినారు. జిల్లాలోని చెక్ పోస్టులలో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా, పకడ్బందీగా జరిగేలా చూడాలని అన్నారు. నోడల్ అధికారులు ప్రతి రోజు రిపోర్ట్‌లు నిర్ణీత ఫార్మాట్‌లో సమర్పిచాలని తెలిపారు. జిల్లాలో మాన్ పవర్ మేనేజ్మెంట్, బ్యాలెట్ బాక్సుల మేనేజ్మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్మెంట్, శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్‌లైన్, కంప్లైంట్స్ రెడ్రెస్సల్, తదితర విభాగాల వారీగా సంబంధిత నోడల్ అధికారులు, జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎలాంటి అంతరాయం లేకుండా జరిగేందుకు ప్రతి విభాగానికి నోడల్ అధికారులను నియమించామని, ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా ఎన్నికల నిర్వహణ జరగాలి. శాంతియుత, స్వేచ్ఛాత్మక మరియు పారదర్శక ఎన్నికలకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్పష్టం చేశారు.మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున అందరూ పాటించాల్సిన నిబంధనలను గుర్తుచేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లా ప్రజలందరూ ఎన్నికల నియమావళిని పాటించి, శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, ఎన్నికల ప్రత్యేక అధికారులు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- రాజకీయ పార్టీ నాయకులు, అధికారులతో సమీక్ష



మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 30(జనం సాక్షి): జిల్లాలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి, గ్రామపంచాయతీ సర్పంచ్, ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల (నియమావళి) పాటించి, సహకరించాలని సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల విభాగం సంబంధిత సిబ్బందితో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, (ఎన్నికల నియమావళి) నీ పాటిస్తూ ఎన్నికలు సజావుగా నిర్వహణకు సహకరించాలన్నారు. ఎన్నికల నిబంధనలకు సంబంధించి తీసుకోవలసిన చర్యలు, నామినేషన్ల ప్రక్రియ, స్క్రూటీని, ఖర్చుల వివరాలు, ఎన్నికలు నిబంధనలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రేనర్స్ ప్రవీణ్ తెలిపారు. మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ సిపిఓ అశోక్, బ్యాలెట్ బాక్స్ మేనేజ్మెంట్ డిపిఓ హరిప్రసాద్, ట్రాన్స్పోర్ట్ మేనేజ్మెంట్ ఆర్టీవో జైపాల్ రెడ్డి, ట్రైనింగ్ మేనేజ్మెంట్ డిఇఓ దక్షిణామూర్తి, మెటీరియల్ మేనేజ్మెంట్ అదనపు కలెక్టర్ రెవిన్యూ అనిల్ కుమార్, ఎక్స్పెండిచర్ వెంకటేశ్వర్లు, అబ్జర్వర్ మేనేజ్మెంట్ డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, బ్యాలెట్ పేపర్ డిఆర్డిఓ మధుసూదన రాజు, మీడియా కమ్యూనికేషన్ మేనేజ్మెంట్ డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, హెల్ప్లైన్ గ్రీవెన్స్ పుల్లారావు, నివేదికలు సమర్పణ జెడ్పి సీఈవో పురుషోత్తం, ఎంసిఓసి, ఎక్స్పెండిచర్ అకౌంట్స్, మానిటరింగ్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, హౌసింగ్ పీడీ హనుమ, నియమించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతి మండలానికి ముగ్గురు చొప్పున అధికారులు నియమించడం జరిగింది, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ ఎస్ టి,వీడియో వింగ్, తదితర ఎన్నికల నిర్వహణ కమిటీలకు ప్రత్యేక అధికారులను నియమించి ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు, ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సురేష్ నాయుడు, బిఆర్ఎస్ పార్టీ మార్నేని వెంకన్న, బిజెపి కె.శ్యామ్ సుందర్, మలోత్ బాబు, టిడిపి పి.బి.రామారావు, సిపిఐ టి.సందీప్, జడ్పీ సీఈవో పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పర్యవేక్షలు రాఘవ రెడ్డి, మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.


## మోడల్ కోడ్ కండక్ట్‌ను అమలు చేయాలి



పాలకుర్తి, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయాలని జిల్లా సహాకార అధికారి, జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే. కోదండరాములు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మోడల్ కోడ్ కండక్ట్ పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇద్దరు పిల్లలున్న వారు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులని అన్నారు. ఎన్నికలు కోడ్ అమలయ్యేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని అన్నారు. ఎన్నికల అధికారులు ఏ ఒక్క పార్టీకి కూడా అనుకూలంగా పని చేయరాదని అన్నారు. ఈ నెల 29 నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, కోడ్ ను ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రవీందర్, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, ఎంపీవో వేణుమాదవ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## పోడు భూముల సమస్యలను పరిష్కరించాలి

- కాస్తులో ఉన్న రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య



గూడూరు,సెప్టెంబర్30(జనంసాక్షి): పోడు భూములను కాస్తు చేసుకుంటూన్న రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం గూడూరు మండల కేంద్రంలో సిపిఎం పోడు రైతుల విస్తృత సమావేశం జనగం వీరస్వామి అధ్యక్షతన సమావేశం జరిగినదిఈ సమావేశానికి నాగయ్య ముఖ్య అతిథిగా పాల్గొని హాజరై మాట్లాడుతూ.సాగు చేస్తున్న పోడు భూములకు ప్రభుత్వాలు హక్కులు కల్పించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఎన్నో తరాల నుండి సాగు చేస్తున్న రైతులకు ఏలాంటి హక్కులు లేక పోవడం వల్ల,పోడు రైతులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతు న్నారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నుండి అందవలసిన రైతు బంధు,రైతు భీమా,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి రావలసిన రాయితీలు అందడంలేదని వారు విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పట్టాదారు పాసుబుక్కులు లేనందున అమ్ముకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం కాస్తులో ఉన్న రైతులందరికీ హక్కు పత్రాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేనియెడల పోడు రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, గూడూరు,కొత్తగూడ,గంగరం ఆర్గనైజర్ నక్క సైదులు,పోడు భూముల సాధన కమిటీ నూతన కన్వీనర్ జనగం వీరస్వామి,వారితో పాటు 18 మందితో కమిటీని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య,రామటెంకి రామచంద్రయ్య, జనగాం సురేష్,రమేష్,భాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, ప్రశాంత్,మల్లేష్, చంటి, సుమలత, వెంకన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం


### రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు పర్యాటక శాఖ తరుపున దసరా శుభాకాంక్షలు తెలిపారు.టూరిజం కార్పొరేషన్ ద్వారా తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించామని,ఇది గర్వించదగ్గ విషయన్నారు.సరూర్ నగర్ స్టేడియంలో పది వేల బతుకమ్మలతో అరవై మూడు అడుగుల ఎత్తు బతుకమ్మ పేర్చి ప్రపంచ గిన్నిస్ రికార్డు సృష్టించిన ఆడపడుచులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 32శాతం రిజర్వేషన్లను 22శాతానికి తగ్గించిందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని, అవి చరిత్రలో నిలిచిపోయేవని తెలిపారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.బీసీలను మోసం చేసిన వారికి డిపాజిట్ కూడా రావద్దని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల్లో 90 శాతం హామీలను అమలు చేసిన ఘనతను సాధించిందన్నారు.మొదటి రోజు 3 హామీలు, ఆరు నెలల్లో 50శాతం హామీలు, ఏడాదిలో 70శాతం హామీలు, రెండు సంవత్సరాల్లో 90శాతం హామీలు నెరవేర్చామన్నారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులే ప్రజలకు బాకీ పడ్డారని,ఆ పార్టీ నాయకులు వేల కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు.రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్, వెలుగు వెంకన్న, జ్యోతి కరుణాకర్, నిమ్మల వెంకన్న , సైదిరెడ్డి, వల్దాసు దేవేందర్, తండు శ్రీనివాస్, ధర్మా నాయక్, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉంది

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- స్థానిక సంస్థల ఎన్నికల పై పత్రిక సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి,సెప్టెంబర్ 30(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లాలో స్థానిక సంస్థలు (గ్రామ పంచాయతీలు, ఎంపిటిసి, జడ్పిటిసి) ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంపీటీసీ జడ్పిటిసి స్థానిక సంస్థలను రెండు విడతలలో మరియు గ్రామ పంచాయతీ ఎన్నికలు రెండు విడతలలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ షెడ్యూల్ విడుదల చేసిందని , అదే ప్రకారం పెద్దపల్లి జిల్లాలో ఎన్నికలు జరుగుతాయని అన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున గ్రామీణ ప్రాంతాల్లో ఎం.సి.సి కోడ్ అమలు కావడం జరుగుతుందని అన్నారు.పెద్దపల్లి జిల్లాలో మొత్తం 13 మండలాల్లో 263 గ్రామ పంచాయతీలు, 2432 వార్డులు,జిల్లా వ్యాప్తంగా 2432 గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్లు, 273 పోలింగ్ లోకేషన్స్ ఏర్పాటు చేశారని తెలిపారు.ఓటర్ల వివరాల ప్రకారం పురుషులు198728, మహిళలు 205439, ఇతరులు 14 మంది కలిపి మొత్తం 404181 మందికి ఓటు ఇవ్వడానికి అవకాశం ఉందని,ప్రతి విడతలో మండల వారీగా గ్రూప్ పంచాయతీ, ఎంపిటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ కు అనుగుణంగా నామినేషన్, పరిశీలన, పోలింగ్ తేదీలు నిర్ణయించామని అన్నారు.స్థానిక సంస్థ ఎన్నికలకు సరిపడా ఏర్పాట్లు, ఇంచార్జి నియామకాలు, బ్యాలట్ బాక్సులు, పోలింగ్ బూత్‌లు, పార్టీ ప్రతినిధులతో సంప్రదింపులు, షెడ్యూల్ వివరాల అనుసరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో పాటు స్థానిక నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నియమాల ప్రకారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సన్నద్ధంగా ఉందని అన్నారు. పోలింగ్ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులు ఉన్నాయో లేదో చెక్ చేస్తున్నారని, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయిస్తామని అన్నారు.మండల కేంద్రాలలో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. నామినేషన్ల స్క్రూటినీ , ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియ పై సిబ్బందికి శిక్షణ అందిస్తామని తెలిపారు. పోలింగ్




రోజు పాటించాల్సిన నిబంధనల, విధుల పై అధికారులకు ముందుగానే సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు.పోటీలో ఉండే అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాత బ్యాలెట్ పేపర్ల ముద్రణ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకుంటున్నట్లు అన్నారు.డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ఒక నోడల్ అధికారి నియమించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా రి -పోల్ జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. అనంతరం పాత్రికేయులకు ఉన్న వివిధ సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.ఈ సమావేశములో నరేందర్,సీఈఓ జడ్పీ మరియు వీర బుచ్చయ్య,డిపిఓ పాల్గొన్నారు.




## సింగరేణి ఆర్‌జీ-1లో బొగ్గు ఉత్పత్తి 110శాతం

### విలేకరుల సమావేశంలో జనరల్ మేనేజర్ లలిత్‌కుమార్..

**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి ఆర్‌జీ-1లో బొగ్గు ఉత్పత్తి 110శాతం సాధించామని జనరల్ మేనేజర్ (జీఎం) డి.లలిత్‌కుమార్ తెలిపారు.సింగరేణి ఆర్‌జీ-1 సమావేశమందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బొగ్గు ఉత్పత్తి..ఉత్పాదకత వివరాలు వెల్లడించారు.జీడీకే.1 అండ్ 3 ఇంక్లయిన్‌లో ఎస్‌డీఎల్ యంత్రం ద్వారా 16,346 టన్నులకు గాను 10,899 టన్నుల ఉత్పత్తి సాధించి 67శాతంగా నిలిచిందన్నారు. జీడీకే.2,2ఏ ఇంక్లయిన్‌లో ఎస్‌డీఎల్ యంత్రం ద్వారా 19,231 టన్నులకు గాను 6,540 టన్నులతో 66శాతంగా నమోదైందన్నారు.జీడీకే.11వ గనిలో ఎల్‌హెచ్‌డీ యంత్రం ద్వారా 18,269 టన్నులకు గాను 7,983 టన్నులతో 44శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది.జీడీకే.11వ ఇంక్లయిన్‌లో కంటిన్యూస్ మైనర్ (సీఎం-1) ద్వారా 25,385 టన్నులకు గాను 13,941 టన్నులతో 55శాతం ఉత్పత్తి సాధించామని జీఎం పేర్కొన్నారు.కంటిన్యూస్ మైనర్ (సీఎం-2) ద్వారా 23,750 టన్నులకు గాను 20,136 టన్నులతో 85శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిందన్నారు.సాధించిన బొగ్గు ఉత్పత్తి 67,404 టన్నులకు గాను 42,060 టన్నులతో 62శాతంగా బొగ్గు ఉత్పత్తి సాధించిందని జీఎం లలిత్ కుమార్ పేర్కొన్నారు.భూగర్భ గనుల నుంచి సాధించిన బొగ్గు ఉత్పత్తి 1,02,981 టన్నులకు గాను 65,650 టన్నులతో 64శాతంగా నమోదైందన్నారు.అదే విధంగా జీడీకే.ఓసీపీ-5లో బొగ్గు ఉత్పత్తి 1,82,692 టన్నులకు గాను 2,48,077 టన్నులతో 136శాతంగా నమోదైందని జీఎం తెలిపారు.భూగర్భ గనులు, భూఉపరితల గనుల నుంచి ఉత్పత్తి వివరాలు 2,85,673 టన్నులకు గాను 3,13,727 టన్నులతో 110శాతంగా ఉత్పత్తి సాధించామని ఆర్‌జీ-1 జనరల్ మేనేజర్ లలిత్‌కుమార్ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం యల్.రమేష్, ఏరియా ఇంజనీర్ రామ్మోహన్‌రావు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఐఈడీ యస్.ఇ.రాజన్న, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

### పలు నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 30, (జనం సాక్షి) :**
హిందువుల అత్యంత పవిత్రమైన పండుగలో దసరా పండుగ ప్రత్యేకమని పది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన పలు అన్నదాన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు నిర్వహించే అమ్మవారి పూజల ఫలితంగా మిర్యాలగూడ నియోజకవర్గం లోని ప్రజలు అభివృద్ధి పథంలోకి రావాలని కోరారు. దసరా వేడుకలను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా టపాసులు కాల్చే సమయంలో చిన్నారులకు తగు సూచనలు ఇచ్చి తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, చిలుకూరు బాలు, దేశిడి శేఖర్ రెడ్డి, గంధం రామకృష్ణ తదితరులున్నారు.



## స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలి

### మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 30,( జనంసాక్షి)**
జరుగునున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఎం కార్యకర్తలు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నియోజవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఎర్రజెండాకు ప్రజలు మద్దతుగా నిలవాలని, సిపిఎం పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రశ్నించే ఎర్రజెండా నాయకులను గెలిపించుకున్నట్లైతే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు నూకల జగదీష్ చంద్ర, జిల్లా కమిటీ సభ్యుడు రవి నాయక్, వినోద్ నాయక్,శశిధర్ రెడ్డి, రొండి శ్రీనివాస్, రేమిడాల పరుశురాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, చౌగాని సీతారాములు, బావాండ్ల పాండు, అయూబ్, తిరుపతి రామ్మూర్తి, జటంగి సైదులు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

- రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం
- ఎన్నికల ప్రవర్తన నియమావళి, షెడ్యూల్ పై వివరణ






**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నిక లకు షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో రెండు విడతల్లో జడ్పిటిసి, ఎంపిటిసి స్థానాలకు, రెండు విడతల్లో గ్రామ పంచాయతీలకు (సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నికలు నిర్వహించ నున్నామని తెలిపారు. మొత్తం నాలుగు విడతల్లో జిల్లాలో ఎన్నికలు ముగుస్తాయని అన్నారు. మొదటి విడతలో హుజురాబాద్ రెవిన్యూ డివిజన్ పరిధిలోని (6మండలాలు) ఇల్లంతకుంట, జమ్మికుంట, హుజురాబాద్, శంకరపట్నం, వీణవంక, వి సైదాపూర్ మండలాల్లో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.
రెండవ విడతలో కరీంనగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని (9 మండలాలు) చిగురుమామిడి, చొప్పదండి, గంగాధర, గన్నేరువరం, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, మానకొండూర్, రామడుగు, తిమ్మాపూర్ మండలాల్లో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు జరుగుతాయని అన్నారు.
మూడవ విడతలో కరీంనగర్ డివిజన్ పరిధిలోని మానకొండూర్ మండలం మినహా అన్ని మండలాలల పరిధిలోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. నాలుగో విడతలో హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాలు సహా మానకొండూర్ మండల పరిధిలోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ఉంటాయని అన్నారు. సర్పంచ్ వార్డు, సభ్యుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ నిర్వహించిన అదే రోజు ఫలితాలు వెలుపడతాయని అన్నారు. జడ్పిటిసి, ఎంపిటిసి ఓట్ల లెక్కింపు నవంబర్ 11న ఉంటుందని అన్నారు. ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలకు ప్రతి మూడు, నాలుగు మండలాలకు ఒక ఆర్ఓ ను నియమిస్తున్నామని, మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాల, అంబేద్కర్ స్టేడియం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ సెంటర్లు, స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేస్తామని తెలిపారు.గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి అర్హతలు, ధరావత్తు వివరాలు, ఎన్నికల వ్యయం, నామినేషన్ ప్రక్రియ తదితర వివరాలను గురించి అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే వివరించారు. అనంతరం పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, బిజెపి ప్రతినిధులు నాంపల్లి శ్రీనివాస్, బాస సత్యనారాయణ, వాసాల రమేష్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు సిరాజ్ హుస్సేన్, మడుపు మోహన్, బిఆర్ఎస్ ప్రతినిధి సాతినేని శ్రీనివాస్, సిపిఐ (ఎం) ప్రతినిధి మిల్కూరి వాసుదేవరెడ్డి, సిపిఐ ప్రతినిధి కే.మణికంఠ రెడ్డి, ఏఐఎంఐఎం ప్రతినిధి సయ్యద్ బర్కత్ అలీ, టిడిపి ప్రతినిధి కళ్యాడపు ఆగయ్య, బి.ఎస్.పి ప్రతినిధి సిరిసిల్ల అంజయ్య పాల్గొన్నారు.

## కొత్త పుంతలు తొక్కుతున్న ఇసుక అక్రమ రవాణా






**అశ్వారావుపేట సెప్టెంబర్ 30,(జనంసాక్షి):**
అశ్వారావుపేట రాష్ట్రీయ సరిహద్దుల్లో ఇసుక అక్రమ రవాణా కొత్త కోణం బయటపడింది. ఆంధ్ర నుంచి అక్రమంగా రకరకాల మార్గాల్లో ఇసుక రవాణా అవుతుండటం తో అప్రమత్తమైన పోలీసులు,రవాణా శాఖ తనిఖీలు ముమ్మరం చేశారు. గత రాత్రి ఆంధ్ర నుంచి తెలంగాణలోకి ప్రవేశించిన లారీలను రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేశారు.టైల్స్ తయారీ ముడిసరుకు తీసుకు వెళ్తున్నట్టు బిల్లులు చూపించడంతో అనుమానం వచ్చిన అధికారులు లారీల్లో తనిఖీలు చేయగా ఇసుక బస్తాలు బయటపడ్డాయి. పోలీసులకు సమాచారం ఇచ్చిన రవాణా శాఖ అధికారులు లారీలను పోలీసులకు స్వాధీనం చేశారు.
ఆంధ్రప్రదేశ్ రావులపాలెం కేంద్రంగా టైల్స్ తయారీలో ఉపయోగించే ముడి సరుకు గా బిల్లులు తయారు చేసి ఇసుకను బస్తాల్లో ప్యాక్ చేసి దర్జాగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. తెలంగాణకు అనుమతులు లేకుండా ఏ రూపంలో వచ్చినా అది అక్రమమేనని పోలీసులు స్పష్టం చేస్తూ రెండూ లారీలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు.
లారీ యజమానుల వాదన మాత్రం మరోలా ఉంది. ఇసుకను జల్లించగా వచ్చిన మెత్తటి ఇసుకను టైల్స్ తయారీలో వాడే ఇసుక అని గుత్తేదారు కాంట్రాక్ట్ ఇవ్వటంతో ట్రాన్స్ పోర్ట్ చేస్తున్నామని, వీటికి సంబంధించిన బిల్లులతో రవాణా చేస్తున్నామని లారీ యజమానులు అనడం గమనార్హం.

## పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చర్యలు

### స్థానిక సంస్థల ఎన్నికలపై మీడియా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, సెప్టెంబర్ 30 (జనంసాక్షి)**
ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టినట్లు రాష్ట్రంలో ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలను రెండు విడతలలో, గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతలలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమీషనర్ షెడ్యూల్ విడుదల చేసిందని, అదే ప్రకారం ఖమ్మం జిల్లాలో ఎన్నికలు జరుగుతాయని అన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున గ్రామీణ ప్రాంతాల్లో ఎం.సి.సి. కోడ్ అమలు కావడం జరుగుతుందని అన్నారు.ఖమ్మం జిల్లాలో మొత్తం 20 మండలాల్లో 571 గ్రామ పంచాయతీలు, 5214 వార్డులు, 99 షెడ్యూల్డ్ ప్రాంతం గ్రామ పంచాయతీలు, 461 నాన్ షెడ్యూల్డ్ ప్రాంతం గ్రామ పంచాయతీలు, జిల్లా వ్యాప్తంగా 5214 గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్లు, 737 పోలింగ్ లోకేషన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎం.సి.సి. కోడ్ అమలులో భాగంగా 20 ఎఫ్.ఎస్.టి, 16 ఎస్.ఎస్.టి. టీములను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 20 జెడ్పిటిసి స్థానాలకు 4 ఎస్టీ, 4 ఎస్సీ, 8 బీసీ, 4 అన్ రిజర్వ్ క్యాటగిరి కేటాయించామని, 283 ఎంపీటీసీ స్థానాల్లో 50 ఎస్టీ, 58 ఎస్సీ, 103 బీసి, 72 అన్ రిజర్వ్ క్యాటగిరి కేటాయించామని, 20 ఎంపీపీ స్థానాల్లో 5 ఎస్టీ , 4 ఎస్సీ, 8 బీసి, 3 అన్ రిజర్వ్, 571 గ్రామ పంచాయతీ స్థానాలకు 171 ఎస్టీ , 110 ఎస్సి, 190 బీసీ, 100 అన్ రిజర్వ్ క్యాటగిరిలో కేటాయించామని అన్నారు.జులై 10 వరకు నమోదు అయిన ఓటర్ల వివరాల ప్రకారం పురుషులు 3,88,243, మహిళలు 4,14,425, ఇతరులు 22 మంది కలిపి మొత్తం 8,02,690 మంది ఓటు వేసే అవకాశం ఉందని, ప్రతి విడతలో గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ కు అనుగుణంగా నామినేషన్, పరిశీలన, పోలింగ్ తేదీలు నిర్ణయించామని అన్నారు. పోలింగ్ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులు ఉన్నాయో లేదో చెక్ చేస్తున్నారని, పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయిస్తామని అన్నారు. మండల కేంద్రాలలో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.స్క్రూటినీ చేసిన తర్వాత అప్పీల్ కు అవకాశం కల్పించి డిస్పోజల్ కొరకు ఒక రోజు కేటాయించడం జరిగిందని, సోమవారం నుండి ఎం.సి.సి. అమలులోకి రావడం జరిగిందని, ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలని, పోలీస్ బందోబస్తు కూడా తగినంతగా ఉన్నదని, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.







## దేశంలో అత్యంత సరసమైన 5 బైకులు ఇవే!



**న్యూఢిల్లీ:**భారతదేశంలో ద్విచక్ర వాహన మార్కెట్ గణనీయంగా అభివృద్ధి చెందుతోంది. లెక్కకు మించిన కంపెనీలు దేశీయ విఫణిలో కొత్త టూ వీలర్స్ లాంచ్ చేస్తూనే ఉన్నాయి.అయితే జీఎస్టీ 2.0 అమలులోకి వచ్చిన తరువాత వీటి ధరలు చాలా వరకు తగ్గాయి. ఈ కథనంలో ఇండియన్ మార్కెట్లోని సరసమైన బైకులు ఏవి?, వాటి ధరలు ఎలా ఉన్నాయనే విషయాలు తెలుసుకుందాం. బజాజ్ ప్లాటినా 100: బజాజ్ ప్లాటినా 100 ధర రూ. 65,407 (ఎక్స్ షోరూమ్) చేరింది. ఈ బైక్ 102 సీసీ ఎయిర్-కూల్డ్ ఇంజిన్ ద్వారా టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇది 4-స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్ పొందుతుంది. ఇది 70 కిమీ/లీ కంటే ఎక్కువ మైలేజ్ అందిస్తుంది.హొండా షైన్ 100:హొండా షైన్ 100 ధర రూ. 63,191 (ఎక్స్ షోరూమ్). ఇందులోని 98.98 సీసీ ఇంజిన్ 7.38 హార్స్ పవర్, 8.04 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇంజిన్ 4 స్పీడ్ గేర్‌బాక్స్‌తో లభిస్తుంది. మంచి డిజైన్, ఫీచర్స్ కలిగి.. కొంత ఎక్కువ మైలేజ్ ఇస్తున్న కారణంగా ఈ బైకుకు ఇండియన్ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. హీరో హెచ్‌ఎఫ్ 100:హీరో హెచ్‌ఎఫ్ 100 ధర రూ. 58739 (ఎక్స్ షోరూమ్). ఈ బైకులోని 97.2 సీసీ ఎయిర్-కూల్డ్ ఇంజిన్.. 8.05 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది.

# లిస్టింగ్ బాటలో 7 కంపెనీలు

- జాబితాలో హెూటల్ పోలో, బాంబే కోటెడ్
- ఏపీపీఎల్ కంటెయినర్స్, ధరీవాల్ బిల్డ్‌టెక్
- ఆర్డీ ఇండస్ట్రీస్, కుసుమార్గ్, బాన్‌బ్లాక్ టెక్నాలజీస్..




**న్యూఢిల్లీ:**కొద్ది రోజులుగా దుమ్మురేపుతున్న ప్రైమరీ మార్కెట్లు భవిష్యత్‌లో మరింత దూకుడు ప్రదర్శించనున్నాయి. దిగ్గజాలు టాటా క్యాపిటల్, వియ్‌వర్క్ ఇండియా ఐపీవోలు వచ్చే వారం ప్రారంభం కానుండగా.. తాజాగా 7 కంపెనీలు లిస్టింగ్ బాట పట్టాయి. ఇందుకు అనుగుణంగా సెబీకి దరఖాస్తు చేశాయి. వివరాలు చూద్దాం..క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ఏడు కంపెనీలు ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. జాబితాలో హెూటల్ పోలో టవర్స్, బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్స్, ఏపీపీఎల్ కంటెయినర్స్, బాన్‌బ్లాక్ టెక్నాలజీస్, ధరీవాల్ బిల్డ్‌టెక్, ఆర్డీ ఇండస్ట్రీస్, కుసుమార్గ్ చేరాయి. ఐపీవోలో భాగంగా స్టీల్ ప్రాసెసింగ్ సెంటర్లను నిర్వహించే బాంబే కోటెడ్ 1.5 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. స్టీల్ క్యాయిల్ల ప్రాసెసింగ్‌లో ప్రత్యేకతను కలిగిన కంపెనీ ప్రస్తుతం 3,50,411 టన్నుల వార్షిక సామర్థ్యాన్ని అందుకుంది. గతేడాది(2024-25) ఆదాయం రూ. 1,056 కోట్లను తాకగా, రూ. 29 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఐపీవోలో భాగంగా మధ్యస్థాయి ఆతిథ్య రంగ కంపెనీ హెూటల్ పోలో టవర్స్ రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 71.2 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను విస్తరణ, ప్రస్తుత ప్రాపర్టీల ఆధునీకరణ, రుణ చెల్లింపులు తదితర అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ పోలో, మ్యాక్స్ బ్రాండ్లతో ప్రధానంగా దేశ ఉత్తర, తూర్పు, ఈశాన్య ప్రాంతాలలో మధ్యస్థాయి హెూటళ్లు, రిసార్టులను నిర్వహిస్తోంది. త్రిపుర, కోల్‌కతా, మేఘాలయ, షిల్లాంగ్, ప్రయాగ్‌రాజ్, జబల్‌పూర్ తదితర ప్రాంతాలలో 425 గదులతో హెూటళ్లను నిర్వహిస్తోంది. గతేడాది(2024-25) ఆదాయం రూ. 118 కోట్లను తాకగా, రూ. 22 కోట్ల నికర లాభం ఆర్జించింది.

కంటెయినర్ల తయారీ: గుజరాత్‌లోని భావనగర్ కేంద్రంగా ఏర్పాటైన ఏపీపీఎల్ కంటెయినర్స్ ఐపీవోలో భాగంగా 12.5 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా ప్రమోటర్లు మరో 25.6 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలతోపాటు.. రుణ చెల్లింపులకు వినియోగించనుంది. 2021లో ఏర్పాటైన కంపెనీ ప్రధానంగా కంటెయినర్ తయారీలో కార్యకలాపాలు విస్తరించింది. గతేడాది(2024-25) ఆదాయం రూ. 69 కోట్లను తాకగా, రూ. 33 కోట్ల నికర లాభం ఆర్జించింది.

**సాస్ సొల్యూషన్స్:** బ్లాక్‌చెయిన్, ఐవోటీ, డేటా సైన్స్ ఆధారంగా సాస్ సొల్యూషన్లు అందించే బాన్‌బ్లాక్ టెక్నాలజీస్ ఐపీవోలో భాగంగా రూ. 230 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా 2020లో ఏర్పాటైన చెన్నై కంపెనీ ప్రమోటర్ బాన్‌బ్లాక్ ఇంక్ 3 కోట్ల షేర్లను ఆఫర్ చేయనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 136 కోట్లు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ప్లాట్‌ఫామ్స్‌కు, రూ. 13 కోట్లు ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్లకు వినియోగించనుంది. మరికొన్ని నిధులను ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలకు వెచ్చించనుంది. కంపెనీ ఏఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ సర్వీసులు, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్లలో వేగంగా విస్తరిస్తోంది.


రూ. 950 కోట్లకు రెడీ:ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ధరీవాల్ బిల్డ్‌టెక్ ఐపీవోలో భాగంగా రూ. 950 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. ఇష్యూ నిధులలో రూ. 203 కోట్లు ఎక్విప్‌మెంట్ కొనుగోలుకి, రూ. 174 కోట్లు, రూ. 300 కోట్లు సంస్థతోపాటు అనుబంధ కంపెనీ రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా రోడ్లు, హైవేలు, బ్రిడ్జిలు, సొరంగాలు తదితర నిర్మాణాలు చేపడుతోంది. గతేడాది(2024-25) ఆదాయం రూ. 1,153 కోట్లను తాకగా, రూ. 161 కోట్ల నికర లాభం ఆర్జించింది.

**రికవరీ, రీసైక్లింగ్:**ఇంధన స్టోరేజీ, నాన్‌ఫెర్రస్ స్క్రాప్ నుంచి రికవరీ, రీసైక్లింగ్ చేపట్టే ఆర్డీ ఇండస్ట్రీస్ ఐపీవోలో భాగంగా రూ. 320 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా ప్రమోటర్లు మరో 3.76 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 220 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ. 22 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. లెడ్ అల్లాయ్స్, లెడ్ టిన్, లెడ్ సిల్వలర్ తదితర ప్రొడక్టులను రూపొందిస్తోంది. కంపెనీకి ఆంధ్రప్రదేశ్‌లో తయారీ ప్లాంటు ఉంది.

రూ. 650 కోట్లపై కన్ను
ఇంజినీర్డ్ ఫ్యాబ్రిక్ తయారీ సంస్థ కుసుమార్గ్ ఐపీఓ ద్వారా రూ.650 కోట్ల నిధుల సమీకరణకు సిద్ధమైంది. 1990లో ఏర్పాటైన కంపెనీ ఏరోస్పేస్, డిఫెన్స్, పారిశ్రామిక, ఆటోమోటివ్ రంగాల కోసం ఫ్యాబ్రిక్స్ దుస్తులు తయారు చేస్తుంది. కంపెనీకి గుజరాత్‌లో ఆరు మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లతో పాటు ఉత్తరప్రదేశ్‌లో ఒక ఫ్యాబ్రికేషన్ యూనిట్ ఉంది. ఆర్థిక సంవత్సరం 2025 గానూ రూ.779 కోట్ల ఆదాయాన్ని, రూ.112 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.

# బలవంతపు రాజీనామాలు!..

- ఆందోళనలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు





**న్యూఢిల్లీ:**భారతదేశపు అతిపెద్ద ఐటీ సేవల సంస్థ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' తన ఉద్యోగులలో సుమారు 2 శాతం లేదా 12,000 ఉద్యోగాలను తగ్గించుకోవడానికి ప్రణాళిక వేసినట్లు రెండు నెలల క్రితమే ప్రకటించింది. ఆ ప్రభావం ఇప్పుడు కనిపిస్తోంది. ఇందులో భాగంగానే.. టీసీఎస్ తన ఉద్యోగులను బలవంతంగా రాజీనామా చేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంపెనీలో ఏం జరుగుతోందనే విషయాన్ని.. ఒక ఉద్యోగి సోషల్ మీడియాలో వెల్లడించారు. మూడు రోజుల క్రితం నన్ను మీటింగ్ రూమ్‌కు పిలిచి, రాజీనామా చేయాలని చెప్పారు. కానీ నేను దాన్ని తిరస్కరించాను. అయితే నాలో భయం మొదలైంది. టీసీఎస్ నేను ఉద్యోగం చేస్తున్న మొదటి కంపెనీ. కాబట్టి నేను కోల్పోవడానికి పెద్దగా ఏమీ లేదు. కానీ రాజీనామా చేయకపోతే.. టెర్మినేషన్ తరువాత బ్యాడ్ రివ్యూ ఇస్తామని కూడా బెదిరించారు. మీకు నచ్చినట్లు చేయండి, రాజీనామా మాత్రం చేయనని చెప్పేశాను. నాలో భయం, బాధ ఉన్నప్పటికీ.. ధైర్యంగా ఉండటానికి ప్రయత్నించానని పేర్కొన్నారు.మరో ఉద్యోగి కూడా తన అనుభవాన్ని షేర్ చేశారు. నన్ను రాజీనామా చేయమని ఒక ప్యానెల్ ఎదురుచూస్తోంది. నేను రోజూ సక్రంగా పని చేస్తున్నాను. అంతే కాకుండా.. ప్రతి కాల్, మెసేజ్, మెయిల్స్ వంటి వాటికి స్పందిస్తున్నాను. నా కుటుంబంలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తి నేను ఒక్కడినే అని, నా ఉద్యోగం పోతే నా పెళ్లి కూడా క్యాన్సిల్ అవుతుందని పేర్కొన్నాను. కానీ ఒకదానికొకటి లింక్ చేయవద్దని హెచ్‌ఆర్ చెప్పారు. ఇప్పుడు నేను జాబ్ కోసం సెర్చ్ చేసుకుంటున్నానని ఆ ఉద్యోగి వెల్లడించారు.ఉద్యోగులను తొలగిస్తున్న వేళ.. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు వ్యతిరేకంగా దేశంలోని ప్రధాన నగరాల్లో ఉద్యోగుల సంఘం ప్రదర్శనలు నిర్వహించింది. కొనసాగుతున్న ఉద్యోగాల కోతలు దాదాపు 30,000 మందిని ప్రభావితం చేస్తాయని ఆరోపించింది . అయితే, టీసీఎస్ ఈ వాదనను తిరస్కరించింది. ఈ తగ్గింపు దాని ప్రపంచ శ్రామిక శక్తిలో దాదాపు 2 శాతం లేదా దాదాపు 12,000 మందికి పరిమితం అని పేర్కొంది. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ మద్దతుతో దేశంలో నిరసనలు జరిగాయి. నాయకులు తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. తొలగింపుల సంఖ్య వెల్లడించిన దానికంటే ఎక్కువగా ఉండవచ్చని హెచ్చరించారు. కాగా టీసీఎస్ కంపెనీలో ప్రపంచ వ్యాప్తంగా 6,00,000 కంటే ఎక్కువమంది పనిచేస్తున్నట్లు సమాచారం.

## విస్తరణ దిశగా 'అల్ట్రావయోలెట్'

**బెంగళూరు:**బెంగళూరుకు చెందిన అల్ట్రావయోలెట్ ఆటోమోటివ్ దేశీయ మార్కెట్లో.. కొత్త ఉత్పత్తులను లాంచ్ చేయడమే కాకుండా, తన ఉనికిని విస్తరిస్తూనే ఉంది. ఇందులో భాగంగానే..కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఒక లేటెస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించింది. దీంతో సంస్థ 26 నగరాల్లో తన పాదముద్రను బలోపేతం చేసింది. తిరుపతిలో ప్రారంభమైన అల్ట్రావయోలెట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్లో.. సేల్స్, సర్వీస్ వంటి వాటితో పాటు విడిభాగాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఎక్స్-47 క్రాస్‌ఓవర్, ఎఫ్77, ఎఫ్77 సూపర్ స్ట్రీట్ బైకులు ఉన్నాయి.




# 22 కాదు.. 24 కాదు.. 18 వైపే మొగ్గు!

- బంగారం కొనుగోలు వైఖరిలో మార్పులు


**ముంబై:**బంగారం ధరలు రికార్డు స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో భారతదేశంలో వినియోగదారుల కొనుగోలు వైఖరిలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి. సంప్రదాయబద్ధంగా భారతీయులు 22 క్యారెట్ల (ఆభరణాలు), 24 క్యారెట్ల (బార్లు, కాయిన్స్) బంగారాన్ని కొనుగోలు చేయడానికి మొగ్గు చూపేవారు.అయితే ధరల పెరుగుదలతో ముఖ్యంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాల్లో కొనుగోలు నిర్ణయాలు ప్రభావితమవుతున్నాయి. బంగారం అధిక ధరల కారణంగా కొంతమంది వినియోగదారులు 22 క్యారెట్ల బంగారానికి బదులుగా తక్కువ క్యారెట్ (ఉదాహరణకు 18 క్యారెట్) ఆభరణాలను కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. 18%ఖ% బంగారంలో స్వచ్ఛత తక్కువగా (75% బంగారం) ఉన్నప్పటికీ దాని ధర తక్కువగా ఉంటుంది. దీనితో అత్యవసరాలకు, శుభకార్యాలకు ముందుగా కేటాయించిన బడ్జెట్‌లో ఆభరణాలు కొనుగోలు చేయడం సాధ్యమవుతుంది.పెళ్లిళ్లు, పండుగల సీజన్‌లో డిమాండ్ కొనసాగుతున్నప్పటికీ, అధిక ధరల వల్ల ఆభరణాల మొత్తం డిమాండ్‌లో స్వల్ప మందగమనం కనిపిస్తోంది. వినియోగదారులు ఆభరణాల బరువును తగ్గించుకోవడం లేదా తేలికపాటి, రోజువారీ వినియోగానికి సరిపోయే డిజైన్లను ఎంచుకోవడం చేస్తున్నారు.బంగారం రికార్డు ధరలు ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా కొన్నిచోట్ల భౌతిక బంగారం (బార్లు, కాయిన్స్) రూపంలో పెట్టుబడులు పెరిగాయి. చాలామంది భారతీయులు బంగారాన్ని కేవలం ఆభరణంగా కాకుండా ద్రవ్యోల్బణం నుంచి రక్షణ కల్పించే సురక్షితమైన ఆస్తి (సేఫ్ హెవెన్ అసెట్)గా భావిస్తారు. కొంతమంది భౌతిక బంగారం కొనుగోలు, నిల్వ సమస్యలు, అధిక ధరలు, మేకింగ్ ఛార్జీలను నివారించడానికి గోల్డ్ ఈటీఎఫ్‌లు (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్), డిజిటల్ గోల్డ్ వంటి పెట్టుబడి సాధనాలపై ఆసక్తి పెంచుకుంటున్నారు.




**ధరలు పెరగడానికి కారణాలు:**బంగారం ధరల పెరుగుదల కేవలం దేశీయ డిమాండ్ పైనే కాకుండా, ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. పసిడిని సురక్షితమైన పెట్టుబడిగా భావించే అంతర్జాతీయ పెట్టుబడిదారులు మార్కెట్‌లో అనిశ్చితి ఉన్నప్పుడు ఈ రంగంలో పెట్టుబడులు పెంచుతారు.

**భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు :**ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు, సంఘర్షణలు, రాజకీయ అస్థిరత పెట్టుబడిదారుల్లో అభద్రతా భావాన్ని పెంచుతాయి. ఈ అనిశ్చితి కారణంగా వారు స్టాక్ మార్కెట్‌ల నుంచి బంగారం వైపు మళ్లుతారు.

**ద్రవ్యోల్బణం భయాలు:**ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు డబ్బు విలువ తగ్గుతుంది. అయితే అలాంటి సమయంలో బంగారం విలువ అంతర్జాతీయంగా నిలకడగా ఉండటమే కాకుండా పెరుగుతుంది కూడా. అందుకే ద్రవ్యోల్బణం పెరుగుతున్నప్పుడు పెట్టుబడిదారులు తమ కొనుగోలు శక్తిని కాపాడుకోవడానికి బంగారాన్ని కొనుగోలు చేస్తారు. సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు:ప్రపంచవ్యాప్తంగా చైనా, రష్యా వంటి దేశాల కేంద్ర బ్యాంకులు ఇటీవల తమ బంగారు నిల్వలను భారీగా పెంచుకుంటున్నాయి. ఇవి మార్కెట్లో భారీ కొనుగోలుదారులుగా ఉండటం వల్ల పసిడికి డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతాయి. యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు సంకేతాలు




# దేశంలోనే తొలి ఏఐ కాల్ అసిస్టెంట్..

- త్వరలో ప్రారంభం

**న్యూఢిల్లీ:**ఏదో ముఖ్యమైన పనిలో బిజీగా ఉన్న సమయంలో వచ్చే స్పామ్ కాల్స్ చిరాకు తెప్పిస్తుంటాయి. ఇకపై అలాంటి కాల్స్‌తోపాటు ఫోన్‌లోని కాంటాక్ట్ లిస్ట్‌లో లేని కాల్స్‌కు సమాధానం ఇచ్చేలా హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ 'ఈక్వల్‌ఏఐ' కొత్తగా ఇంటెలిజెంట్ కాల్ అసిస్టెంట్‌ను రూపొందించింది. ఇది ఆయా కాల్స్‌ను గుర్తించి ఎదుటి వ్యక్తితో వాస్తవికంగా మాట్లాడి బ్రీఫ్‌గా అందులోని సారాంశాన్ని సందేశం రూపంలో యూజర్ ముందుంచుతుంది. దీన్ని అక్టోబర్ 2న న్యూఢిల్లీలో ప్రారంభించనున్నట్లు కంపెనీ తెలిపింది. భారతదేశంలో దాదాపు 100 కోట్ల స్మార్ట్ ఫోన్ వినియోగదారులు ఉన్నారు. 60% మంది భారతీయులు రోజుకు 3 కంటే ఎక్కువ స్పామ్ కాల్స్‌తో ఇబ్బంది పడుతున్నట్లు కొన్ని సర్వేలు చెబుతున్నాయి. ఇప్పటికే డునాట్ డిస్టర్బ్ రిజిస్ట్రీలు, కాలర్ ఐడీ యాప్‌లు ఉన్నప్పటికీ స్పామ్ కాల్స్ పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో యూజర్లకు వీటి నుంచి ఉపశమనం కలిగించేలా ఈక్వల్ ఏఐ ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా కొత్తగా ఏఐ అసిస్టెంట్‌ను ప్రారంభించనుంది.ట్రయల్ సక్సెస్:ఈక్వల్ ఏఐ టూల్ ట్రయల్స్ సమయంలో 87% అంతరాయాలను సమర్థంగా నిర్వహించినట్లు కంపెనీ తెలిపింది. పార్సిల్ డెలివరీలను సమన్వయం చేసుకోవడంలో యూజర్లు గడిపే సమయాన్ని 73% తగ్గించినట్లు పేర్కొంది. 94% స్పామ్ కాల్స్‌ను గుర్తించి అందుకు అనుగుణంగా స్పందించినట్లు తెలిపింది. అయితే కాంటాక్ట్ లిస్ట్‌లో సేవ్ అయిన నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు ఇది సమాధానం ఇవ్వదని గమనించాలి.డెలివరీ ఏజెంట్లతో మాట్లాడే క్రమంలో చిరునామాలు లేదా సూచనలు ఇస్తుంది. లైవ్ కాల్ ట్రాన్‌స్క్రిప్ట్ అందిస్తుంది. యూజర్ ఎప్పుడైనా నేరుగా కాల్‌కు సమాధానం ఇవ్వొచ్చు.భారతీయ భాషలు, కాలర్ నమూనాలపై శిక్షణ పొందింది. ప్రాథమికంగా ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఆండ్రాయిడ్ వినియోగదారులకు అక్టోబర్ 2, 2025 నుంచి ఈ సేవలు ప్రారంభం అవుతాయని కంపెనీ తెలిపింది. 2025 నాలుగో త్రైమాసికం నాటికి ముంబై, బెంగళూరు, హైదరాబాద్‌లకు ఈ సర్వీసులు విస్తరిస్తాయని పేర్కొంది.

# ఖాకీ చకులు

- ఏపీ యువతిపై తమిళనాడు పోలీసుల అత్యాచారం
- విచారణ పేరుతో బాధితురాలిపై ఆకృత్యం

**తిరువణ్ణామలై:** తమిళనాడు:రాష్ట్రంలో దారుణం చోటు చేసుకుంది. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులే అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఏపీకి చెందిన యువతిపై తమిళనాడు పోలీసులు అత్యారానికి పాల్పడ్డారు.తిరువణ్ణామలైలో ఏపీకి చెందిన యువతిపై ఇద్దరు పోలీసులు అత్యాచారానికి ఒడిగట్టారు. కానిస్టేబుల్స్ సుందర్ రాజ్, సురేష్ రాజ్‌లు సదరు యువతిపై అత్యాచారం చేసినట్లు గుర్తించారు. అత్యాచారం చేసిన పోలీసులను అరెస్టు చేసి రహస్య ప్రదేశంలో విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.నిన్న రాత్రి(సోమవారం, సెప్టెంబర్ 29వ తేదీ) తిరువణ్ణామలై సమీపంలోని ఎంథాల్ బైపాస్ రోడ్డుపై ఈ దారుణం చోటు చేసుకుంది. టమోటా లోడ్‌తో వెళుతున్న వాహనంలో డ్రైవర్‌తో పాట ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. ఈ సమయంలోనే గస్తీ కాస్తున్న ఇ ద్దరు పోలీసులు.. ఆ వాహనాన్ని ఆపారు. వాహనంలో ఉన్న వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేసిన ఆ ఇద్దరు పోలీసులు.. మహిళల్ని కిందకు దింపారు. అందులో లక్ష్మీ అనే యువతిని విచారణ పేరతో అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు.అత్యాచారం చేసే సమయంలో ఆ యువతి ప్రతిఘటించడంతో ఆమెను తీవ్రంగా కొట్టారు. ఆపై అత్యాచారానికి పాల్పడి బైపాస్ రోడ్డు పక్కనే వదిలేసి వెళ్లిపోయారు. ఈరోజు(మంగళవారం, సెప్టెంబర్ 30వ తేదీ) తెల్లవారుజామున 4 గంటలకు అక్కడికి వచ్చిన గ్రామస్తులు లక్ష్మిని రక్షించి, 108 అంబులెన్స్ ద్వారా చికిత్స కోసం తిరువణ్ణామలై ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం తెలుసుకున్న తిరువన్నమలై జిల్లా పోలీసు సూపరింటెండెంట్ సుధాకర్, అసిస్టెంట్ పోలీసు సూపరింటెండెంట్ సతీష్ బాధితురాలిని విచారణ చేశారు. దాంతో పోలీసలే తనను కొట్టి అత్యాచారానికి పాల్పడ్డారని సదరు బాధితరాలు చెప్పడంతో అసల విషయం వెలుగచూసింది.

# 'టిక్కెట్' కోసం భేటీలు

## మళ్లీ బీజేపీలోకి భోజ్‌పురి స్టార్ పవన్ సింగ్..

**న్యూఢిల్లీ:** భోజ్‌పురి నటుడు, గాయకుడు పవన్ సింగ్ రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా ఆయన రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్‌ఎల్‌ఎస్‌పీ)చీఫ్ ఉపేంద్ర కుష్వాహా, బీజేపీ సీనియర్ నేత వినోద్ తవ్డేలతో దేశ రాజధాని ఢిల్లీలో భేటీ అయ్యారు. ఇది బీహార్ రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీసింది. భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన తవ్డే.. పవన్ సింగ్ బీజేపీలోనే ఉంటారని ధృవీకరించారు. ఆయన ఉపేంద్ర కుష్వాహా నుండి ఆశీస్సులు పొందారని, రాబోయే ఎన్నికల్లో బీజేపీలో చురుకుగా పని చేస్తారన్నా రు.బీహార్ ఎన్నికలకు ముందు భోజ్‌పురి స్టార్ పవన్ సింగ్ బీజేపీ నేతలను కలుసుకోవడం కీలక పరిణామంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. భోజ్‌పురి మాట్లాడే ఓటర్లలో ఆయనకు ఎంతో ఆదరణ ఉంది.ఈ పరిణామం బీజేపీ నేతలను, కార్యకర్తలను ఉత్సాహ పరుస్తుందని, పార్టీ ప్రచారానికి కొత్త ఊపు వస్తుందని పలువురు భావిస్తున్నారు. అయితే గత లోక్‌సభ ఎన్నికల్లో కరకట్ నుండి స్వతంత్ర అభ్యర్థిగా పవన్ సింగ్ బరిలోకి దిగడం ఉపేంద్ర కుష్వాహా ఓటమికి ప్రధాన కారణంగా నిలిచిందంటారు. రాజ్‌పుత్ వర్గం కుష్వాహాకు మద్దతు ఇవ్వలేదని, ఇది సమీప నియోజకవర్గాలపై కూడా ప్రభావం చూపిందని విశ్లేషకులు చెబుతుంటారు. ఫలితంగా షహాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాలలో బీజేపీకి గణనీయమైన నష్టం వాటిల్లిందని అంటారు.భోజ్‌పురి నటుడు పవన్ సింగ్ 2024లో మొదటిసారిగా పశ్చిమ బెంగాల్‌లోని అసన్సోల్ నుండి పోటీకి నిలిపారు. అయితే అతను తన మ్యూజిక్ వీడియో పాటల్లో బెంగాలీ మహిళలను అసభ్యకరంగా చిత్రీకరించారనే ఆరోపణలుతో పార్టీ అతన్ని పోటీ నుంచి ఉపసంహరించుకోవాలని కోరింది. దీంతో ఆయన కరకట్ స్థానం నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఇది బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కొన్ని సీట్లను కోల్పోయేలా చేసింది.బీహార్‌లోని మొత్తం 243 నియోజకవర్గాలకు శాసనసభ ఎన్నికలు ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్నాయి. ఎన్నికల సంఘం ఇంకా తేదీలను ప్రకటించలేదు. మునుపటి అసెంబ్లీ ఎన్నికలు 2020 అక్టోబర్-నవంబర్‌లో జరిగాయి. నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. నితీష్ కుమార్ ముఖ్యమంత్రి అయ్యారు. 2022, ఆగస్టులో నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) ఎన్డీఏతో సంబంధాలను తెంచుకుని, ఆర్జేడీ నేతృత్వంలోని మహాఘట్ బంధన్ సాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

## తుది ఓటర్ల జాబితాను విడుదల చేసిన పోల్ బాడీ




**పట్నా:** ఎస్ఐఆర్ పూర్తయిన తర్వాత బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మంగళవారం ప్రచురించింది.ఏ ఓటరు అయినా తన ఓటరు నమోదు వివరాలను భారత ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో వీక్షించవచ్చని పోల్ బాడీ అధికారులు తెలియజేశారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు ఈ జాబితా ఆధారంగానే నిర్వహించనున్నారు.2025, అక్టోబర్ ఆరు- ఏడు తేదీల మధ్య ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. 22 ఏళ్ల విరామం తర్వాత బీహార్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ కసరత్తు రాజకీయ, చట్టపరమైన చర్చలకు కేంద్రంగా నిలిచింది. ఆగస్టు ఒకటిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురితం కాగా, సెప్టెంబర్ ఒకటి వరకు అభ్యంతరాల కోసం గడువు ఇచ్చారు. ప్రక్రియకు ముందు, బీహార్‌లో 7.89 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.ముసాయిదా జాబితాలో 7.24 కోట్లు ఉన్నట్లు తేలింది. 65.63 లక్షల మంది పేర్లను తొలగించారు. ముసాయిదా ప్రచురణ తర్వాత, మూడు లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు.అభ్యంతరాల సమయంలో 2.17 లక్షల మంది తమ పేర్లను తొలగించడానికి దరఖాస్తు చేసుకోగా, 16.93 లక్షల మంది తమ పేర్లను చేర్చడానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆగస్టు ఒకటి, సెప్టెంబర్ ఒకటి మధ్య 16.56 లక్షలకు పైగా ఓటర్లు కొత్త రిజిస్ట్రేషన్ల కోసం ఫారం-6ను సమర్పించారు. దాదాపు 36 వేల మంది తమను ఓటర్లుగా చేర్చాలని కోరగా, అభ్యంతరాల దశలో 2.17 లక్షల మంది తమ పేర్ల తొలగింపునకు అభ్యర్థించారు. సెప్టెంబర్ ఒకటి నుంచి 30 మధ్య వచ్చిన దరఖాస్తుల పరిష్కారం అక్టోబర్ ఒకటి నుండి జరగనుంది. నిబంధనల ప్రకారం ఓటర్లు నామినేషన్ చివరి తేదీకి 10 రోజుల ముందు వరకు ఓటరుగా చేరిక కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అలాంటప్పుడు వారి పేర్లు అనుబంధ జాబితాలో కనిపిస్తాయి. తదుపరి ఎన్నికల సమయంలో వారు సాధారణ జాబితాలో ఉంటారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
1 అక్టోబర్ 2025

# న్యూ బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ పరిశీలించిన ఎస్పీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 30 (జనం సాక్షి)**
సురక్షిత ప్రయాణం కోసం ట్రాఫిక్ నియమాలు తప్పనిసరి ట్రాఫిక్ నియమాలను పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం అని జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర, అన్నారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, కామారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ భద్రతను మరింత మెరుగుపరచడానికి నిజాంసాగర్ చౌరస్తా మరియు న్యూ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ను సమగ్రంగా పరిశీలించారు. న్యూ బస్టాండ్ నుండి లింగంపేట్, ఎల్లారెడ్డి వైపు వాహన రాకపోకలు సాఫీగా సాగేలా ట్రాఫిక్ సిగ్నల్స్ ను తనిఖీ చేసి, ఇకపై వాహనదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ట్రాఫిక్ ఆర్ఎస్ఐ మహేష్ కు సూచించారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ మన అందరి బాధ్యతని, సమిష్టి కృషితోనే ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ప్రతి ప్రయాణంలో ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించడం ద్వారా సురక్షితం అవుతుందని, రాంగ్ రూట్ లేదా అశ్రద్ధగా డ్రైవ్ చేయడం ప్రమాదాలను పెంచుతుందని తెలిపారు. డ్రంక్ డ్రైవ్‌పై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అధిక వేగంతో డ్రైవ్ చేయకూడదని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.అదే విధంగా సీసీటీవీ కెమెరాల ద్వారా ట్రాఫిక్ పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. ముఖ్యమైన ట్రాఫిక్ ఉల్లంఘనలు ట్రాఫిక్ సిగ్నల్ జంపింగ్, సీట్ బెల్ట్ లేకుండా డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వాడడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగం/రాష్ డ్రైవింగ్ లాంటివి చేస్తే వాహనదారులకు ట్రాఫిక్ చలాన్‌లు జారీ చేయబడతాయని తెలిపారు.అందువల్ల, కామారెడ్డి పట్టణ పౌరులు మరియు వాహనదారులు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించి, పోలీసులకు సహకరించాలని కామారెడ్డి ఎస్పీ తెలిపినారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వెంట కామారెడ్డి ఏఎస్పి బి. చైతన్య రెడ్డి, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ మహేష్, టౌన్ ఎస్సై నరేష్, మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు అన్ని విధాల సన్నద్ధం

- అధికారులు, సిబ్బందికి కలెక్టర్ సూచనలు
- రాజకీయ పార్టీలకు సహకారం కోరిక
- కోడ్ పకడ్బందీ అమలుపై ఫోకస్
- ఎన్నికల షెడ్యూల్ విడుదల.. రెండు విడతల్లో పోలింగ్



నిజామాబాద్, సెప్టెంబర్ 30: స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాల సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం ఎంపీడీఓలు, ఎంపీఓలతో సమావేశమై మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, నియమ నిబంధనలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధనలు తప్పక పాటించాలని, అధికారులు, సిబ్బంది అందరూ క్రియాశీలకంగా పాత్ర పోషించాలని, పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సాఫీగా జరిగేలా కృషి చేయాలని హితవు చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున కోడ్ పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని, రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లు, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. అలసత్వానికి తావివ్వకుండా అనుక్షణం జాగరూకతతో వ్యవహరించాలని, నిఘా బృందాలు నియమించి కోడ్ అమలును పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను నిరోధించాలని, మద్యం, డబ్బు పంపకాలు, ప్రలోభాలకు గురిచేసే వస్తువుల పంపిణీపై నిఘా ఉంచాలని చెప్పారు. ఓటరు జాబితాను మరోసారి నిశితంగా పరిశీలించాలని, ఇబ్బందులు గమనిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికలకు అవసరమైన సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి శిక్షణ ఇవ్వాలని, బ్యాలెట్ బాక్సులు, సామగ్రిని సరిచూసుకోవాలని, పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపుకు రెవెన్యూ డివిజన్ కేంద్రాల వారీగా కౌంటింగ్ హాళ్లు గుర్తించాలన్నారు. ఆర్ఓలు నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్లు స్వీకరించాలని, అన్ని ప్రక్రియలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, జడ్పీ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, నోడల్ అధికారులు, డీఎల్పీఓలు పాల్గొన్నారు. అదేరోజు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడుతూ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలతోపాటు గ్రామ పంచాయతీ ఎన్నికలు రెండు విడతల్లో జరుగుతాయన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల్లో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, పెట్రోల్ బంక్ తదితర ప్రదేశాల్లో 48 గంటల్లో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాల్లో 72 గంటల్లో తొలగించాలన్నారు. అక్టోబర్ 9న నోటిఫికేషన్ వస్తుందని, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఫేజ్-1 ఎన్నికలకు అక్టోబర్ 9 నుంచి 11 వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, అక్టోబర్ 23న మొదటి విడత పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఫేజ్-2కు అక్టోబర్ 13 నుంచి 15 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, అక్టోబర్ 27న రెండో విడత పోలింగ్ ఉంటుందని చెప్పారు. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ ఫేజ్-1కు అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, నవంబర్ 4న మొదటి పోలింగ్ జరుగుతుందని వివరించారు. ఫేజ్-2కు అక్టోబర్ 25 నుంచి 27 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, నవంబర్ 8న రెండో విడత పోలింగ్ ఉంటుందని తెలిపారు. మొదటి, రెండో విడతల్లోనూ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం పోలింగ్ రోజునే మధ్యాహ్నం 2 నుంచి కౌంటింగ్ చేసి ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలతో రైతులు ఆర్థికంగా బలోపేతం





- సమాఖ్య వనరులను వినియోగించి రైతు సంక్షేమం కోసం కృషి
- సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 30(జనంసాక్షి) :** సహకార సంఘాలతో రైతులు మరింత ఆర్థికంగా బలోపేతం అవుతారని సింగల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంగళవారం సుల్తానాబాద్ సహకార ప్రాథమిక సహకార సంఘం 131 వ సర్వసభ్య సమావేశం చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సంఘ కార్యదర్శి బూర్గు సంతోష్ ఐదు నెలల కాలంలో సంఘంలో జరిగిన వ్యాపార లావాదేవీలు జమ ఖర్చులను చదివి సభ్యులందరికీ వివరించగా, సభ్యులందరూ ఆమోదం తెలిపారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార సంఘాలతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావడమే కాకుండా, సమాఖ్య వనరులను పారదర్శకంగా వినియోగించుకొని మరిన్ని రైతు సంక్షేమ కార్యక్రమాలను రానున్న రోజులలో చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు రైతు సంక్షేమమే ధ్యేయంగా, రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. సంఘం అభివృద్ధికి ఎమ్మెల్యే విజయరమణా రావు నిరంతరం కృషి చేస్తున్నారని శ్రీగిరి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా 2024, 2025, ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ రిపోర్టును, సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. సంఘ పరిధిలోని రైతులందరికీ ఆరు శాతం డివిడెంట్ ప్రకటించినట్లు, డివిడెంట్ మొత్తం 16 లక్షల 70 వేల ఎనిమిది వందల ఎనభై ఎనిమిది రూపాయలను రైతులకు చెక్కుల రూపంలో అందజేశారు. రైతుల ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పిఓ) ప్రగతి భవిష్యత్తు కార్యక్రమాలను రైతులకు కలిగే ప్రయోజనాలను సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టర్ వెంకటేశ్వర్లు, పాలకవర్గ సభ్యులు పన్నాల రామన్న, ముద్దసాని సురేష్ రెడ్డి, గోపయ్య, రాజయ్య, కూకట్ల ఓదెలు, కమలమ్మ, పోచమ్మ, పద్మ, లక్ష్మయ్య, సుగుణాకర్ తో పాటు సీఈవో బూర్గు సంతోష్,తదితరులు పాల్గొన్నారు.

> “ఓ యూట్యూబర్ మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా చౌటాకూర్ మండలం శివంపేట బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. యూట్యూబర్ ఆత్మహత్య చేసుకున్న దృశ్యాలు అక్కడున్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.”

# బైక్ ఢీకొని ఇద్దరు యువకుల మృతి





**సుల్తానాబాద్, (జనంసాక్షి) :**
పండగ పూట సుల్తానాబాద్ లో,ఘోర విషాదం చోటు చేసుకుంది. సుల్తానాబాద్ మండలం సుద్దాల శివారు ఇటుక బట్టి వద్ద రాత్రి అతివేగంగా రాముని పల్లి వైపు వెళ్తున్న, పల్సర్ వాహనం సుద్దాల నుండి సుల్తానాబాద్ కు వస్తున్న మరొక బైక్ను ఢీకొట్టడంతో, బైకుపై ప్రయాణిస్తున్న సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ముత్యం రాకేష్(31), పూదరి రోహిత్ కుమార్(25), అనే ఇద్దరు యువకులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. బైక్పై ఉన్న మరో యువకుడు పాపని ఆదర్శ్ తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలలోకి వెళితే మృతుడు రాకేష్ తల్లి ముత్యం రాజేశ్వరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుల్తానాబాద్ పట్టణం గౌడ వీధికి చెందిన ముత్యం రాజేశ్వర్ కి ఇద్దరు కుమారులతోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భర్త మరణించడంతో ఇద్దరు కూతురులకు పెద్ద కొడుకు ముత్యం వినోద్ వివాహం జరిపించాడని తెలిపింది.నా చిన్న కొడుకు ముత్యం రాకేష్ సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్సోర్సింగ్ సెక్యూరిటీగా పనిచేస్తున్నాడని, మంగళవారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో చిన్న కొడుకు ముత్యం రాకేష్ పెద్ద బిడ్డ చిన్న కొడుకు పూదరి రోహిత్ తో కలిసి బైక్పై తన స్నేహితుడు అయినా పాపని ఆదర్శతో కలిసి సుద్దాలకు వెళ్ళగా, ఆదర్శ్ కు కడుపునొప్పి వస్తుందని తెలపడంతో సుద్దాల నుండి సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి బయలుదేరి వస్తుండగా, వెంకట్ రెడ్డి, ఇటుక బట్టి వద్ద, అందాల రాత్రిఒంటిగంట 50 నిమిషముల ప్రాంతంలో సుల్తానాబాద్ నుండి అల్లిపూర్ వైపుకు పల్సర్ వాహనంపై వెళ్తున్న వ్యక్తి అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి మనవడు నడుపుతున్న బైకును ఢీకొట్టడంతో, బైకుపై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాల రక్తస్రావం రావడంతో 108 ద్వారా సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం, ముగ్గురు పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ముత్యం రాకేష్, పూదరి రోహిత్ కుమార్ మృతి చెందినట్లు తెలిపింది. ఆదర్శ్ను కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పంచనామ నిర్వహించారు. సంఘటన స్థలాన్ని ఎసిపి గజ్జి కృష్ణ సీఐ సుబ్బారెడ్డి ఎస్సై శ్రావణ్ కుమార్ సందర్శించారు. విచారణ చేసి కేసు నమోదు చేస్తానని ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. కాగా పండుగ పూట ఒకేసారి ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా సుల్తానాబాద్ పట్టణంలో విషాదం నెలకొంది. బంధువుల రోధనలతో ఆసుపత్రి మారుమోగింది.

## పోలీసు కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీఓ నాయకులు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):**
టిఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ను మర్యాదపూర్వకంగా కలిసి సద్దుల బతుకమ్మ , దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిని శాలువా, పుష్పగుచ్ఛం, మెమెంటో, స్వీట్లు అందజేసి సాంప్రదాయబద్ధంగా సన్మానించారు. ఈ సందర్భంగా దారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... “దేశమంతా దేవుళ్ల దగ్గర పూలు పెడతారు, కానీ మన తెలంగాణలో పూలనే బతుకమ్మగా కొలుస్తామని, కుంటలు, వాగులు నిండిపడి పశుపక్షాదులు ఆనందంగా ఉండగా, రైతులు కష్టపడి పండించిన పంటలు పచ్చగా పెరిగి అందరికీ సుఖసంతోషాలు నింపాలని బతుకమ్మ పండుగ సందేశం” అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రాజేష్ భరద్వాజ్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఏ.వి. రాజేశ్వరరావు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కోటా రామస్వామి, శంకర్, కర్ణాకర్ పాల్గొన్నారు.

# అమ్మవారి స్మరణలో భవాని దీక్షాపరులు

- భవాని స్వాములకు అన్నప్రసాద వితరణ
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్‌రెడ్డి



**గోదావరిఖని, జనంసాక్షి :**
స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం సమీపాన ఉన్న జయదుర్గ ఆలయం లో భవాని దీక్ష మాలా ధారణ స్వాములకు మంగళవారం వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి,వ్యాల్ల శ్రావ్య-హరీష్‌రెడ్డి దంపతులతో కలిసి అన్నప్రసాదం(బిక్ష) వితరణ చేశారు.ఈ సందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ రామగుండం నియోజక వర్గంలో దసరా, శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని..చెడుపై విజయం సాధించిన సందర్భంగా దసరా ఉత్సవాలు జరుపుకుంటారని, రామగుండం నియోజకవర్గంలో రాక్షస పాలన సంహారం జరిగి రాబోయే రోజుల్లో ఘనంగా విజయగర్వంతో ఉత్సవాలు జరుపుకునేలా అమ్మలగన్న అమ్మ జయదుర్గ అమ్మవారు ఆశీస్సులు అందజేయాలని కోరారు.అమ్మవారి కంకణదీక్షా పరులు కొప్పుల ఈశ్వర్ అమ్మవారి సేవలో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో జయదుర్గ ఆలయాన్ని నిర్మించి ఎంతోమంది భక్తులకు పారిశ్రామిక ప్రాంతంలో భక్తి విరాజిల్లేలా కృషి చేస్తున్నారని,సేవలను కొనియాడారు.ఎంతో భక్తిశ్రద్ధలతో భవాని మాలాధారణ చేసి అమ్మవారి స్మరణ లో పాల్గొంటున్న భవాని మాలాధీక్షాపరులకు అన్నప్రసాదం వితరణ చేయడం అదృష్టంగా భావిస్తానని అన్నారు. జగన్మాత శ్రీజయదుర్గ అమ్మవారు ఆశీస్సులు రామగుండం నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అంతర్గాం మాజీ జడ్పీటీసీ అముల నారాయణ, మూల విజయ రెడ్డి, జాహిద్‌పాషా, సిగిరి రాము, పోలాడి శ్రీనివాస్‌రావు, నడిపెల్లి సాయి, వంశీకృష్ణ, పోయిల రవి, కొండా సురేష్,రవీంద్రచారి, బొడిగె శ్రీనివాస్, యుగంధర్, మొలుగూరి శ్యామ్ పాల్గొన్నారు.



## గర్రెపల్లి చెరువును ఆహ్లాదమైన
# పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి

**దాతల సహకారంతో నిర్మించిన,శివుడి విగ్రహం బతుకమ్మ ఘాటు**
**ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ రమణారావు**

**సుల్తానాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) :** మండలంలోని గర్రెపల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హామీ ఇచ్చారు.సోమవారం గర్రెపల్లి గ్రామంలోని చెరువు వద్ద ఏర్పాటు చేసిన పరమశివుని విగ్రహా ప్రతిష్ఠాపన చేసి అనంతరం బతుకమ్మ ఘాటును గ్రామ ప్రజలు,స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ దాదాపు 16 లక్షల రూపాయలతో గర్రెపల్లి చెరువు వద్ద నిర్మించిన విగ్రహాలు ఆహ్లాదాన్ని అందించే విధంగా ఉన్నాయన్నారు.గ్రామంలో చక్కటి వాతావరణాన్ని నెలకొల్పి ప్రజలు సాయంకాలం వేళలో ఆనందంగా గడిపేందుకు గ్రామంలో ఉన్న ప్రకృతిని అందంగా మలిచి ప్రజలకు చేరువలోకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన వారిని అభినందించారు.కన్నా రమేష్ గౌడ్ గ్రామంలో చెరువులో శివుడి విగ్రహాన్ని అంతేకాకుండా,బతుకమ్మ ఘాటును ఏర్పాటు చేసేందుకు దాతల సహకారంతో ముందుకు వచ్చి అకుంఠిత దీక్షతో విగ్రహాలను పూర్తి చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. గర్రెపల్లి లో అతిపెద్ద చెరువు ఉండడం దీని ద్వారా కింది గ్రామాలకు ప్రాణదారగా ఈ నీరు ఉపయోగపడుతుందని రైతుల పొలాలకు ఈ నీరును వినియోగించి పంటలు పండిస్తున్నారని అన్నారు. పైనుండి వచ్చిన నీరు చెరువులో చేరి నిండుకుండలా ఎప్పుడు కళకళలాడుతుందని అన్నారు. ఇక్కడి ప్రజలకే కాకుండా మండల ప్రజలకు ఈ ప్రాంతం చక్కటి టూరిజంలా ఉపయోగపడుతుందని అన్నారు. రానున్న రోజులలో మరింత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. విగ్రహల నిర్మాణానికి సహకరించిన గ్రామ పెద్దలను,దాతలను ఎమ్మెల్యే జయ రమణారావు ఘనంగా సన్మానించారు. సమిండ్ల కిషన్ రావు దంపతులు, అమీర్ శెట్టి రాధాకృష్ణ దంపతుల తో పాటు రెండు లక్షల 50 వేల రూపాయలు విగ్రహాల నిర్మాణానికి అందించిన జూపల్లి తిరుమల రావు లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ మి నుపాల ప్రకాష్ రావు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ రావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ జానీ, మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు పడాల అజయ్ గౌడ్, వీరగోని రమేష్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు లయన్స్ క్ల బ్ అధ్యక్షులు జూపల్లి తిరుమల రావు, వెంకన్న పటేల్, బొల్లం లక్ష్మణ్, కన్న రమేష్ గౌడ్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సహకార సొసైటీలో మహాజనసభ

**గంభీరావుపేట సెప్టెంబర్ 30 (జనం సాక్షి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ కొండూరు రవీందర్రావు అధ్యక్షతన మంగళ వారం రోజు మహాజనసభ నిర్వహించారు కార్యదర్శి సందుపట్ల రాజిరెడ్డి. రైతులకు సంబంధించిన జమ ఖర్చులు చదివి వినిపించారు. అలాగే ఎరువులు వ్యాపారం విత్తనాలు డిజిట్ పెట్రోల్ వ్యాపారం సకాలంలో సేవలు అందిస్తున్నాము. సభ్యుల వాటాదనం సభ్యుల నుండి రావలసిన అప్పులు వడ్డీ బ్యాంకు చెల్లించవలసిన అప్పులు అలాగే రైతులు ప్రతిపాదించగా ఆమోదించి తీర్మానాన్ని ఆమోదించారు. ఈ కార్యక్రమం చైర్మన్ కొండూరు రవీందర్రావు వైస్ చైర్మన్ రామంజనేయ గౌడ్. డైరెక్టర్ అంజిరెడ్డి. ఆరుట్ల రాజిరెడ్డి. రాజ్వీర్ కార్యదర్శి రాజిరెడ్డి బ్యాంక్ ప్రతినిధి ముద్దం శ్రీనివాస్ రెడ్డి. కొత్తపెల్లి సింగల్ విండో చైర్మన్ భూపతి సురేందర్. పాలకవర్గ సభ్యులు. రైతులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు

- ఎన్నికల కోడ్ కఠినంగా అమలు
- పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు
- మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు



**పెద్దపల్లి, సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** పెద్దపల్లి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో డీసీపీ కరుణాకర్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో, జిల్లాలో మొదటి విడతలో 7 మండలాలు, రెండో విడతలో 6 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు, మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రతా బలగాలను మోహరించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున, గ్రామీణ ప్రాంతాల్లో కోడ్ కఠినంగా అమలు చేయాలని, ఎంసీసీ నిబంధనలకు విరుద్ధంగా అర్బన్ ప్రాంతాల్లో, సోషల్ మీడియా ద్వారా ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల అధికారులు ఎంసీసీ నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టి నివేదికలు సమర్పించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయడం, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, శాంతి భద్రతల కోసం చర్యలు తీసుకోవడం, పోలింగ్ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించాలని, నామినేషన్ స్వీకరణకు మండల కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని, నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

అభ్యర్థులు ఖరారైన తర్వాత బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ప్రత్యేక అధికారులను నియమించాలని, ఎన్నికలకు అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద నోడల్ అధికారిని నియమించాలని చెప్పారు. రీ-పోల్ జరగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. డీసీపీ కరుణాకర్ మాట్లాడుతూ, స్ట్రాంగ్ రూమ్, నామినేషన్ సెంటర్, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదల నుంచి ఎస్ఎఫ్‌టీ పనిచేసేలా చర్యలు తీసుకున్నామని, గోదావరిఖనిలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాల వద్ద అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమంగా డబ్బు, మద్యం రవాణా చేస్తే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ఏసీపీ రమేష్, కృష్ణ, రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, జడ్పీ సీఈఓ నరేందర్, డీపీఓ వీర బుచ్చయ్య, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సివిల్ సప్లై హమాలి కార్మికులకు దసరా బోనస్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి)**
కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కామారెడ్డి జిల్లా సివిల్ సప్లై హమాలి కార్మికులకు దసరా బోనస్ దసరా సందర్భంగా యూనిఫామ్ డ్రస్సులు కామారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ విక్టర్ మరియు కామారెడ్డి జిల్లా సివిల్ సప్లై డిఎం శ్రీకాంత్ చేతుల మీదుగా సివిల్ సప్లై హమాలీలకు దసరా సందర్భంగా యూనిఫామ్ స్వీటు ఇతర సంబంధించిన జిల్లా సివిల్ సప్లై హమాలి కార్మికులకు కామారెడ్డి జిల్లా ఏడుగోదాములకు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్ దశరథ్. ఏఐటీయూసీ కామారెడ్డి జిల్లా కార్యదర్శి పి బాలరాజ్ సివిల్ సప్లై అమాలి యూనియన్ జిల్లా కార్యదర్శి కే బాజీ సివిల్ సప్లై హమాలి జిల్లా కోశాధికారి మైపాల్, ఎం శ్రీనివాస్ ఏ కృష్ణ కే సాయిలు, కే రవి, ఏ రమేష్, నర్సింలు, బాబు, సాయిలు, హనుమాన్లు, శివాజీ, పాల్గొన్నారు. సివిల్ సప్లై హమాలి కార్మిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం కామారెడ్డి జిల్లా జెసి సివిల్ సప్లై డిఎం శ్రీకాంత్ ముందస్తుగా దసరా శుభాకాంక్షలు తెలుపుతూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఐశ్వర్య ఆరోగ్యంతో అందరూ బాగుండాలని అన్నారు.



## దుర్గామాత ఆశీస్సులు అందుకున్న బిజెపి రాష్ట్ర నాయకులు

**కామారెడ్డి జిల్లా ప్రతినిది సెప్టెంబర్ 30 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి నియోజకవర్గం తాడ్వాయి మండలం దేవాయిపల్లి గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బిజెపి రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి కుటుంబ సభ్యులతో దుర్గామాతకు పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మంగా ఉన్న ప్రతి వారికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఐదు బోర్డుల చేతుల్లోనే నిర్ణయం

- ఆసియా కప్ ట్రోఫీ వివాదం ఊపందుకుంది
- నక్వీ తీరుపై బీసీసీఐ తీవ్ర అసంతృప్తి
- త్వరలో బోర్డుల సమావేశం




దుబాయ్, సెప్టెంబర్ 30: ఆసియా కప్‌లో పాకిస్తాన్‌పై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచిన భారత జట్టుకు ట్రోఫీ అందకపోవడం ఊపందుకున్న వివాదం మరింత తీవ్రమైంది. ఆసియా క్రికెట్ మండలి అధ్యక్షుడు మొహ్సిన్ నక్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకోవడానికి భారత క్రికెటర్లు నిరాకరించడంతో ఆయన ట్రోఫీని తీసుకెళ్లిపోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఈ పరిణామాలపై బీసీసీఐ తీవ్రంగా స్పందించి, నక్వీ తీరును అంతర్జాతీయ క్రికెట్ మండలి దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించింది. పరిస్థితులు చేయిదాటిపోతున్న నేపథ్యంలో ఆసియా క్రికెట్ మండలి మంగళవారం దుబాయ్‌లో సమావేశమై, ట్రోఫీ ప్రదానం విషయంలో తీర్మానం తీసుకోవడాన్ని ఆసియా ఐదు బోర్డుల చేతుల్లో అప్పగించింది. భారత్, శ్రీలంక, అఫ్గనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ బోర్డులు సమావేశమై ఒక నిర్ణయానికి రావాలని ఏసీసీ సూచించింది. నక్వీ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ ఐదు బోర్డులు త్వరలోనే సమావేశమై, టీమిండియాకు ట్రోఫీ ఇవ్వాలా, వద్దా అనే విషయంలో చర్చించనున్నాయి. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్తాన్‌పై భారత జట్టు ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ పూర్తయ్యాక బహుమతి ప్రదాన కార్యక్రమంలో రన్నరప్ పాక్ జట్టు ఆటగాళ్లకు నక్వీ మెడల్స్ అందించాడు. అయితే, భారత క్రికెటర్లు పాక్ ఆటగాళ్లతో కరచాలనానికి, షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ఇష్టపడలేదు. ఫైనల్‌లో గెలిచిన తర్వాత నక్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు కూడా నిరాకరించారు. యూఏఈ క్రికెట్ అధ్యక్షుడి చేతుల మీదుగా తమకు ట్రోఫీ అందిస్తే బాగుంటుందని భారత ఆటగాడు కోరారు. కానీ, నక్వీ వేదక మీద వేచి ఉండటంతో భారత క్రికెటర్లు అతడిని పట్టించుకోకుండా మైదానంలో రిలాక్స్‌గా ఫోన్లు చూసుకుంటూ, కబుర్లు చెబుతూ ఉండిపోయారు. ఈ దృశ్యం చూసిన నక్వీ ట్రోఫీతో ఉడాయించి వెళ్లిపోవడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. మ్యాచ్ ముగిసిన రాత్రి 10.30 గంటల తర్వాత ప్రదానోత్సవం దాదాపు ఒక గంట ఆలస్యమై, మధ్యాహ్నం 12 గంటల వరకు సాగింది. ఈ వివాదానికి మొహ్సిన్ నక్వీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొన్ని రాక్షసీ చిత్రాలు కూడా కారణమని సమాచారం. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సాకియా మాట్లాడుతూ, ఏసీసీ అధ్యక్షుడు పాకిస్తాన్ రాజకీయ నాయకుడు కాబట్టి ట్రోఫీ అందుకోలేదని, కానీ అది తీసుకెళ్లిపోవడం సరైనది కాదని తీవ్రంగా వ్యాఖ్యానించారు. ట్రోఫీ, మెడల్స్ త్వరగా తిరిగి ఇవ్వాలని, లేకపోతే నవంబర్‌లో ఐసీసీ సమావేశంలో తీవ్ర ప్రతిపాదన చేస్తామని హెచ్చరించారు. ఈ వివాదం భారత్-పాక్ క్రికెట్ సంబంధాల్లో మరో మలుపు తిరిగిందని, ఐదు బోర్డుల నిర్ణయం ఏమిటో ఆసక్తికరంగా ఉందని క్రికెట్ ఆసక్తికరులు చూస్తున్నారు.

# గాయం నుంచి కోలుకోని పాండ్య

### ఆసీస్ పర్యటనకు అనుమానమే..!?

వచ్చే నెలలో టీమిండియా ఆస్ట్రేలియా పర్యటన ప్రారంభమవుతుంది. ఈ వైట్-బాల్ క్రికెట్ సిరీస్‌లో హార్దిక్ పాండ్యా భారత జట్టుకు కీలకమైన ఆస్తిగా ఉండేవాడు. అయితే, ఇప్పుడు అతను భారత జట్టు నుంచి తప్పుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అతను లేకుండానే టీమిండియా ఆస్ట్రేలియాకు వెళ్లాల్సి ఉంటుంది. భారత ఆల్ రౌండర్ తన గాయం నుంచి కోలుకోలేదని, ఈ క్రమంలోనే 2025 ఆసియా కప్ ఫైనల్‌లో ఆడకుండా డగౌట్‌లో ఉన్న సంగతి తెలిసిందే. శ్రీలంకతో జరిగిన చివరి సూపర్ ఫోర్ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా గాయం గురించి వార్తలు వచ్చాయి. అతనికి ఎడమ క్వాడ్రిసెప్స్ గాయం, తొడ కండరాల గాయం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆసియా కప్ సందర్భంగా వ్యాఖ్యాతగా పనిచేస్తున్న రవిశాస్త్రి పాండ్యా గాయం గురించి సమాచారం అందించాడు. వైట్-బాల్ సిరీస్ కోసం భారత జట్టు ఆస్ట్రేలియా పర్యటన అక్టోబర్ 19న ప్రారంభమై నవంబర్ 8న ముగుస్తుంది. బీసీసీఐ వర్గాల సమాచారం ప్రకారం, పాండ్యా ప్రస్తుత గాయం కోలుకోవడానికి నాలుగు వారాల సమయం పట్టవచ్చు. అంటే, దీని అర్థం అతను మొదట్లో టీం ఇండియాతో పర్యటనకు వెళ్లకపోయినా, చివరికి కొన్ని టీ20 మ్యాచ్‌లకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. అయితే, బీసీసీఐ వైద్య బృందం పరీక్ష తర్వాతే ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. అక్టోబర్ 19, అక్టోబర్ 23, అక్టోబర్ 25 తేదీల్లో జరిగే ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు మొదట వన్డే సిరీస్ ఆడనుంది.



# బంగ్లా ఓపెనర్‌కు వీసా ఆటంకం

### లిటన్ గాయంతో సిరీస్‌కు దూరం

- షార్జాలో రెండు రోజుల్లో మొదటి టీ20
- ఎన్‌సీఎల్‌లో రాణించిన సర్కార్ స్క్వాడ్‌లో చేరాడు
- బీసీబీ యూఏఈతో సంప్రదింపులు జరుపుతోంది

ఢాకా, సెప్టెంబర్ 30: ఆసియా కప్‌లో ఫైనల్ అవకాశాన్ని చేజార్చుకున్న బంగ్లాదేశ్ జట్టు యూఏఈలోని షార్జాలో అఫ్గనిస్తాన్‌తో టీ20 సిరీస్‌కు సిద్ధమవుతోంది. అయితే, స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్న సీనియర్ ఓపెనర్ సౌమ్యా సర్కార్‌కు మొదటి మ్యాచ్‌కు ముందే వీసా కష్టాలు మొదలయ్యాయి. రెండు రోజుల్లో అక్టోబర్ 2న షార్జా వేదికగా జరగనున్న తొలి టీ20కు సర్కార్ దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటివరకు యూఏఈ వీసా మంజూరు కాలేదు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) యూఏఈ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ వీసా రాగానే అతన్ని తొందరగా దేశానికి పంపుతామని తెలిపింది. రెగ్యులర్ కెప్టెన్ లిటన్ దాస్ ఆసియా కప్‌లో పొర్కొట్టు గాయంతో సిరీస్‌కు దూరమైన నేపథ్యంలో అనుభవజ్ఞుడైన సౌమ్యా సర్కార్‌ను సెలెక్టర్లు జట్టులో చేర్చుకున్నారు. జేకర్ అలీ అనిక్ కెప్టెన్‌గా నడిపే ఈ సిరీస్‌లో సౌమ్యా ఓపెనర్‌గా చెలరేగాలని ఆశలు. ఇటీవల ఎన్‌సీఎల్ టోర్నీలో వరుసగా రెండు మ్యాచుల్లో 63, 45 రన్స్‌తో రాణించిన అతని ఫారమ్ సెలెక్టర్లను ఆకట్టుకుంది. స్క్వాడ్‌లోని మిగిలిన అందరికీ వీసాలు మంజూరైనా, సౌమ్యాకు మాత్రం ఆలస్యం అవుతోంది. దీంతో, మొదటి మ్యాచ్‌కు అతడు చేరుకోకపోతే జట్టుకు తీవ్ర నష్టం అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అక్టోబర్ 3న రెండో, అక్టోబర్ 5న మూడో టీ20లు జరగనున్నాయి. ఈ సిరీస్‌లో బంగ్లాదేశ్ జట్టు తంజిద్ హసన్, పర్వేజ్ హొస్సేన్ ఎమోన్, సైఫ్ హసన్, తౌహిద్ హ్రిదోయ్, షమీమ్ హసన్, నూరుల్ హసన్, రిషాద్ హసన్, మహేదీ హసన్, నసూమ్ అహ్మద్, తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్ సాకిబ్, ముస్తఫిజుర్ రహ్మాన్, షోరిఫుల్ ఇస్లాం, మొహమ్మద్ సైఫుద్దీన్‌లు ఉన్నారు. యూఏఈలో గతంలో బంగ్లాదేశ్‌కు అనుకూలమైన రికార్డు లేకపోవడంతో ఈ సిరీస్‌లో వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని కోచింగ్ స్టాఫ్ సూచించింది.

## రౌఫ్ చెత్త బౌలింగ్ కారణంగానే టీమిండియా విజయం

పాకిస్థాన్ పేసర్ హరిస్ రౌఫ్‌పై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సెటైర్లు పేల్చాడు. తిలక్ వర్మ, భారత జట్టు అద్భుత ప్రదర్శన కంటే హరిస్ రౌఫ్ చెత్త బౌలింగ్ కారణంగానే టీమిండియా విజయం సాధించిందని విమర్శలు గుప్పించాడు.

# అమ్మకానికి ఆర్సీబీ ఫ్రాంచైజీ?




ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న జట్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ ఒకటి. ఆర్సీబీ జట్టుకు కోట్లలో అభిమానులు ఉన్నారు. ఐపీఎల్‌లో సుదీర్ఘ నిరీక్షణకు తెర దించుతూ, ఆ ఏడాదే ఆర్సీబీ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచింది. యంగ్ కెప్టెన్ రజత్ పాటిదార్ నాయకత్వంలో ట్రోఫీని ముద్దాడింది. అయితే గెలుపు సంబరం ఆర్సీబీకి ఎన్నో రోజులో నిలువలేదు. జూన్ 4 విక్టరీ సెలబ్రేషన్స్ సందర్భంగా బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగి 11 మంది మృతిచెందారు. ఇది క్రీడాలోకాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. దీంతో ఇది వివాదస్పదమైంది. ఈ నేపథ్యంలో తాజాగా ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ కుమార్ మోదీ ట్వీట్ సంచనలం సృష్టిస్తోంది. ఆర్సీబీ జట్టు అమ్మకానికి ఉందని అర్థం వచ్చేలా ఆయన ట్వీట్ చేశారు.'ఐపీఎల్ ఫ్రాంచైజీల్లో ఒకటైన ఆర్సీబీని అమ్ముతున్నారని గతంలోనే ఎన్నో వార్తలు వచ్చాయి. కానీ వాటిని మేనేజ్‌మెంట్ కొట్టిపారేసింది. కానీ ఇప్పుడు జట్టను విక్రయించాలని మేనేజ్‌మెంట్ డిసైడ్ అయిపోయింది. దానికి కావాల్సిన డాక్యుమెంట్ల ప్రక్రియ కూడా పూర్తి అయ్యింది. గతసీజన్‌లో ఛాంపియన్‌గా నిలవడం, భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండడం ఇలా అన్ని విభాగాల్లో ఆర్సీబీ చాలా బలంగా ఉంది. అందుకే గ్లోబల్ లెవెల్?లో పెట్టుబడులు పెట్టాలనుకునేవారికి ఇంతకంటే మంచి అవకాశం ఉండదు"ఎవరైతే ఈ ఫ్రాంచైజీ దక్కించుకుంటారో వారికి గుడ్ లక్. ఈ జట్టు వ్యాల్యువేషన్ రికార్డ్ స్థాయిలో ఉంటుందని పక్కా నమ్మకంగా ఉంది. ఐపీఎల్ టోర్నీ గ్లోబల్ లెవెల్‌లో ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో దీని విలువే చెబుతుంది. ఇప్పుడు ఆర్సీబీ నిర్ణయించే ధర ఐపీఎల్‌లో అన్ని జట్లకు ఒక కొత్త బెంచ్‌మార్క్ క్రియేట్ చేస్తుంది. ఫ్రాంచైజీని దక్కించుకోవడంలో సిటీబ్యాంక్ ఆసక్తి చూపిస్తుందని నేను అనుకుంటున్నాను. అందరికి గుడ్ లక్' అని లలిత్ మోదీ సుదీర్ఘంగా రాసుకొచ్చారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది నిజమా అని నెటిజన్లు, ఫ్యాన్స్ కన్‌ఫ్యూజన్‌లో చిక్కుకుపోయింది. అయితే దీనిపై ఆర్సీబీ ఫ్రాంచైజీ నుంచి ఎలాంటి స్పందన కానీ, అధికారిక ప్రకటనగానీ రాలేదు. ఒకవేళ లలిత్ మోదీ పోస్ట్ నిజమైతే వచ్చే సీజన్‌లోపు ఆర్సీబీ ఓనర్లు మారడం పక్కా చూడాలి మరి. కాగా, ఆర్సీబీ ప్రస్తుత విలువ భారీగానే ఉంటుంది. ఐపీఎల్?లో అత్యంత విలువైన ఫ్రాంచైజీల్లో ఆర్సీబీ ఒకటి. 2025 సీజన్‌లో ఛాంపియన్‌గా నిలవడంతో విలువ మరింత పెరిగింది. ఈ ఏడాది జులై నాటికి ఆర్సీబీ ఫ్రాంచైజీ విలువ సుమారు రూ. 2300 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. అంతకుముందు రూ.1946 కోట్లు ఉండేదని జాతీయ మీడియా తమ కథనాల్లో వెల్లడించింది.

# బ్యాటింగ్‌కు వెన్నెముకగా తిలక్

### తెలుగు తేజం తిలక్ వర్మ హీరోగా నిలిచాడు



- ఆసియా కప్ ఫైనల్లో భారత్ విజయం
- తిలక్ అజేయ బ్యాటింగ్‌తో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్
- పాకిస్తాన్‌పై కీలక భాగస్వామ్యం
- హైదరాబాద్ యువకుడి సంచలన ప్రదర్శన

దుబాయ్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : ఆసియా కప్ 2025 ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. అయితే, పహల్గాం ఉగ్రదాడి, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చర్యల నేపథ్యంలో ఆసియా క్రికెట్ మండలి అధ్యక్షుడు మొహ్సిన్ నక్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకోవడాన్ని భారత ఆటగాళ్లు నిరాకరించారు. ఈ వివాదం ఒకవైపు ఉండగా, ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఛేజింగ్‌లో తడబడిన కీలక సమయంలో తెలుగు తేజం తిలక్ వర్మ బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచాడు. పాకిస్తాన్ నిర్దేశించిన 148 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ 20 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ వరుసగా ఔటవడంతో జట్టు ఒత్తిడిలో పడింది. గాయంతో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సైతం లేని పరిస్థితిలో అభిమానుల్లో కంగారు నెలకొంది. అయితే, 22 ఏళ్ల తిలక్ వర్మ ఒత్తిడిని జయించి, శివం దుబేతో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. జాగ్రత్తగా ఆడిన తిలక్ చివర్లో వేగం పెంచి షాట్స్ ఆడి 53 బంతుల్లో 69 పరుగులతో అజేయంగా నిలిచి భారత్‌ను 9వ సారి ఆసియా కప్ విజేతగా నిలిపాడు. ఈ ప్రదర్శనతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించాడు. హైదరాబాద్‌లో 2002 నవంబర్ 8న జన్మించిన తిలక్ వర్మ, కూకట్‌పల్లిలో పుట్టి పెరిగాడు. తండ్రి ఎలక్ట్రికల్ వర్క్ చేసేవారు, తల్లిదండ్రులు హైదరాబాద్‌లోనే జన్మించారు. చిన్నతనంలో క్రికెట్ కోచింగ్ ఖర్చులు భరించలేక తండ్రి ఇబ్బంది పడగా, కోచ్ సలాం బయాష్ తిలక్‌లోని ప్రతిభను గుర్తించి శిక్షణ ఖర్చులను భరించి, కిట్ అందించారు. లింగంపల్లి అకాడమీకి 40 కిలోమీటర్ల దూరం స్కూటర్‌పై తీసుకెళ్లేవారు. మొదట ఫాస్ట్ బౌలింగ్ వేసిన తిలక్‌ను కోచ్ స్పిన్ బౌలింగ్‌పై దృష్టి పెట్టమని సూచించారు. 2018-19 సీజన్‌లో హైదరాబాద్ తరపున ఫస్ట్-క్లాస్ అరంగేట్రం చేసిన తిలక్, 2020 అండర్-19 ప్రపంచ కప్‌లో భారత్‌కు ఆడి ఫైనల్‌కు చేరాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా నిలిచాడు. 2022లో ముంబై ఇండియన్స్ అతడిని ఐపీఎల్ వేలంలో తీసుకుంది. 2023 సెప్టెంబర్‌లో వన్డేల్లో, ఆగస్టులో టీ20ల్లో భారత్‌కు అరంగేట్రం చేసిన తిలక్, ఆసియా కప్ 2025లో అద్భుత బ్యాటింగ్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. బ్యాటర్‌గా రాణిస్తూనే, కుడిచేతి ఆఫ్-బ్రేక్ బౌలర్‌గా సేవలందిస్తున్నాడు.

## వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ ఆడే భారత తుది జట్టు ప్రకటన

కరుణ్ నాయర్, అభిమన్యు ఈశ్వరన్ కు చోటు

ఆసియా కప్ 2025లో విజేతగా నిలిచిన టీమిండియా 4 రోజుల వ్యవధిలోనే సుదీర్ఘ ఫార్మాట్ ఆడనుంది. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్టల సిరీస్‌లో బరిలోకి దిగనుంది. అక్టోబర్ 2( గురువారం) దసరా రోజున అహ్మదాబాద్ వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ సిరీస్ కోసం 15 మంది సభ్యులతో కూడిన జట్టును భారత సెలెక్షన్ కమిటీ ప్రకటించింది. ఇంగ్లండ్ పర్యటనలో ఆడిన కరుణ్ నాయర్, అభిమన్యు ఈశ్వరన్, ఆకాష్ దీప్, రిషభ్ పంత్‌లపై వేటు పడింది. గాయాల కారణంగా రిషభ్ పంత్, ఆకాస్ దీప్ ఈ సిరీస్‌లకు దూరంగా కాగా.. పేలవ ప్రదర్శనతో కరుణ్ నాయర్, అభిమన్యు ఈశ్వరన్ చోటు కోల్పోయారు. భారత్-ఏ తరఫున అద్భుత ప్రదర్శన కనబర్చిన ఆర్సీబీ బ్యాటర్ దేవదత్ పడిక్కల్, స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, బ్యాకప్ వికెట్ కీపర్గా నారాయణ్ జగదీషన్ ఈ టెస్ట్ టీమ్‌లో చోటు దక్కించుకున్నారు. ఇంగ్లండ్ గడ్డపై నిరాశపర్చిన సాయి సుదర్శన్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌కు స్వల్ప విరామం ప్రకటించడంతో శ్రేయస్ అయ్యర్ అవకాశాన్ని అందుకోలేకపోయాడు. గాయం కారణంగా సర్ఫరాజ్ ఖాన్ కూడా భారత జట్టులోకి రీఎంట్రీ ఇవ్వలేకపోయాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగే ఈ సిరీస్ గెలవడం టీమిండియాకు కీలకం.



# వైభవ్ సూర్యవంశీ బీభత్సమైన ప్రదర్శన

వైభవ్ సూర్యవంశీ స్ట్రాంగ్ ఎటాక్ తర్వాత ఆస్ట్రేలియా మళ్ళీ కన్నీళ్లు పెట్టుకుంటుంది. సరిగ్గా ఒక సంవత్సరం తర్వాత, ఒక భారీ అవకాశం వచ్చింది. అదే జట్టు, అదే ఫార్మాట్, అదే తేదీ. కాబట్టి, అక్టోబర్ 1, 2024న చేసినట్లుగానే వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన సెంచరీ సాధిస్తాడా? అతను మరోసారి కొత్త ప్రపంచ రికార్డును సృష్టిస్తాడా? ఏడాది క్రితం చెన్నైలో ఆస్ట్రేలియాతో జరిగిన మల్టీ-డే మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ బ్రిస్బేన్‌లో కూడా మెరుస్తాడా? లేదా అనేది చూడాలి. ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి, ముందుగా, వైభవ్ సూర్యవంశీ ఒక సంవత్సరం క్రితం అక్టోబర్ 1, 2024న ఆస్ట్రేలియన్ అండర్-19 జట్టుపై ఏమి చేశాడో తెలుసుకు ందాం. ఆ మ్యాచ్ వైభవ్ సూర్యవంశీకి చాలా ప్రత్యేకమైనది. ఎందుకంటే, ఇది అండర్-19 మల్టీ-డే ఫార్మాట్‌లో అతని అరంగేట్రం. కానీ, వైభవ్ తన అరంగేట్రంలో భారీ ప్రభావాన్ని చూపించి ఆశ్చర్యపరిచాడు. చెన్నై మైదానంలో ఆస్ట్రేలియన్ బౌలర్లను ఓడించి, అతను కేవలం 58 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్లతో మొత్తం 18 సిక్సర్లు, ఫోర్లతో అద్భుతమైన సెంచరీని సాధించాడు. అక్టోబర్ 1, 2024న ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ 62 బంతుల్లో 104 పరుగులు చేశాడు. ఆ ఇన్నింగ్స్‌తో అతను ప్రపంచ రికార్డును కూడా సృష్టించాడు. అంతర్జాతీయ యూత్ టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ చేసిన ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, వైభవ్ సూర్యవంశీ ఒక సంవత్సరం తర్వాత, అక్టోబర్ 1, 2025న ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగే యూత్ టెస్ట్ మ్యాచ్‌లో ఏమి చేస్తాడు? అతను ఏ రికార్డును సృష్టిస్తా డు? ఒకే తేడా ఏమిటంటే, ఈసారి ఆస్ట్రేలియాపై గడ్డపై ఆడనున్నా డు. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 3 వరకు బ్రిస్బేన్‌లో భారత్ వర్సెస్ ఆస్ట్రేలి యా అండర్-19 జట్ల మధ్య మొట్టమొదటి మల్టీ-డే మ్యాచ్ జరుగు తోంది. మ్యాచ్ మొదటి రోజున, ఆస్ట్రేలియా ముందుగా బ్యాటింగ్ చేసి 243 పరుగులు చేసింది. దీంతో, మొదటి రోజు ఆట ముగిసింది. ఇప్పుడు, అక్టోబ ర్ 1, 2025న, భారత అండర్-19 జట్టు తమ మొదటి ఇన్నింగ్స్ కోసం మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు, అందరి దృష్టి వైభవ్ సూర్యవంశీపై ఉంటుంది.



# హైడ్రాలో దసరా వాహన పూజల సందడి

- కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేక పూజలు
- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు దుస్తుల పంపిణీ

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కార్యాలయంలో దసరా ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. హైడ్రా వాహనాల పార్కింగ్ యార్డులోని దుర్గ గుడి వద్ద కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులు అశోక్ కుమార్, వర్ల పాపయ్య, సుదర్శన్‌తో పాటు పలువురు అధికారులు పూజల్లో పాల్గొన్నారు. యార్డులో జేసీబీలు, వాహనాలు, నీటిని తోడే ఇంజన్లు, హైడ్రా డిఆర్‌ఎఫ్ సిబ్బంది వాడే పనిముట్లకు కమిషనర్ పూజలు చేశారు. అనంతరం హైడ్రాలో పనిచేసే డిఆర్‌ఎఫ్ సిబ్బంది, డ్రైవర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు దుస్తులు, స్వీట్ బాక్స్‌లను కమిషనర్ అందజేశారు. మహిళా ఉద్యోగులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంతో పార్కింగ్ యార్డులో సందడి నెలకొంది. వర్షాకాలంలో హైడ్రా సిబ్బంది అందించిన సేవలను కమిషనర్ ఏవీ రంగనాథ్ కొనియాడారు. ప్రజలకు మెరుగైన జీవనాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు.

## మద్యం మత్తులో ఘర్షణతో స్నేహితుడి హత్య



రాజేంద్రనగర్, సెప్టెంబర్30(జనం సాక్షి) : మద్యం మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణతో తో యువకుడి హత్యకు దారి తీసింది. నార్సింగ్ పోలీసుల ప్రకారం షాద్నగర్ కు చెందిన మృతుడు కాశారాం యాదగిరి (24) నార్సింగి కోకాపేట డబుల్ బెడ్ రూమ్ వద్ద ఉంటూ వెల్డింగు వృత్తి చేసుకుంటూ జీవనం గడిపేవాడు. మంగళవారం ఉదయం 2 గంటలకు యాదగిరి స్నేహితులైన అఫ్రోజ్, నవాజ్ లతో కలిసి పీకల్లోతు మద్యం తాగారు. మద్యం మత్తులో ఘర్షణ చెలరేగింది, మనస్పర్ధానికి గురైన అఫ్రోజ్, నవాజులు యాదగిరి పై వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా స్నేహితుడైన యాదగిరిని పొడిచారు. యాదగిరి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు స్పందించి పోలీసులకు ఫిర్యాదు అందించడం తో వెంటనే స్పందించిన నర్సింగ్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

# ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే విజయం

- అత్యధిక స్థానాలు సొంతం చేసుకుని సత్తా చాటుతాం
- మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే
- ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు
- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి




తాండూరు సెప్టెంబర్ 30(జనంసాక్షి) : రానున్న ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో పైలెట్ రోహిత్ రెడ్డి నియోజకవర్గ పరిధిలోని తాండూరు, బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, కోటపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. అత్యధిక స్థానాలు సొంతం చేసుకుని సత్తా చాటుతామన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనేనని దీమ వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ శ్రేణులు 'బాకీ కార్డు' ఇంటి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలకు వివరించాలని సూచించారు. ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఎంపిటిసి స్థానం పరిధిలో ముఖ్య మండల నాయకులతో కమిటీలు, తాండూరు పట్టణ నాయకులకు ఇంచార్జీ బాధ్యతలు, పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మండల సమస్యలపై స్పందించిన బండి సంజయ్ అభివృద్ధి నిధుల భరోసా



బోయిన్ పల్లి సెప్టెంబర్ 30 (జనం సాక్షి) : భారతీయ జనతా పార్టీ బోయిన పల్లి మండల అధ్యక్షులు ఎడపల్లి పరుశురామ్ ఆధ్వర్యంలో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్‌ని మంగళవారం రోజున కలిసి బోయిన్‌పల్లి మండల ప్రజలందరి తరఫున దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ బోయిన్ పల్లి మండల అభివృద్ధి పనుల నిధుల కోసం అడుగగా, సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా బోయిన్పల్లి మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ హైస్కూల్, కొదురుపాక గ్రామంలోని, విలాసాగర్ గ్రామంలోని హైస్కూల్ లోని ప్రహరీ గోడలు అదనపు తరగతుల గదుల నిర్మాణం కొరకై నిధులు త్వరలో నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, గుడి రవీందర్ రెడ్డి, క్యాతం తిరుపతి రెడ్డి, జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, కొండం శ్రీనివాస్ రెడ్డి, మెరుపుల గంగాధర్, బోగోజి గంగాధర్ చారి, మిరియాల శరత్ చంద్రారెడ్డి, సారంపల్లి రాజు, అమిరిశెట్టి గంగయ్య, జనగాం లక్ష్మణ్, కిరణ్ ,వేణు, వినయ్ ,మినుకుల శ్రీనివాస్, ముసుకు విజయేందర్ రెడ్డి, నడిగొట్టు శ్రీనివాస్, గడ్డమీది నరేష్, రమేష్, ధర్మేంద్ర, అజయ్, నవీన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీజనల్ రోగాలు తగ్గుముఖం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో సీజనల్ రోగాలు తగ్గుముఖం పట్టాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా తెలిపారు. హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నివారణ పై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నివారణ పై ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రదర్శనను మంత్రి పరిశీలించారు. సీజనల్ వ్యాధులు పూర్తి నియంత్రణ లో ఉన్నాయని ఆరోగ్య శాఖ అధికారులు మంత్రికి వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే సీజనల్ వ్యాధుల కేసులు తగ్గుముఖం పట్టాయని సమీక్షలో డైరెక్టర్ అఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ కుమార్ వెల్లడించారు. రాష్ట్రంలో ప్రజారోగ్య శాఖ సీజనల్ వ్యాధుల నిర్మూలనలో ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం వల్ల కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టాయని ఆరోగ్య శాఖ అధికారులు మంత్రికి వెల్లడించారు. సీజనల్ వ్యాధుల కట్టడి పై మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల్లో అవగాహన ను కల్పించామని వెల్లడించారు. సీజనల్ కేసులు నమోదు రహిత రాష్ట్రంగా తెలంగాణ ను తీర్చిదిద్దాలని సమీక్షలో ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని ఆసుపత్రులలో సీజనల్ రోగాలకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని ఆరోగ్య అధికారులు మంత్రికి వివరించారు. సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర వైద్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఆరోగ్య శ్రీ ట్రస్ట్ సీఈవో ఉదయ్ కుమార్, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, డైరెక్టర్ అఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ కుమార్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ విమలా థామస్‌లు పాల్గొన్నారు.

# జర్మనీలో భర్త ఆచూకీ కోసం సీఎం ప్రజావాణిలో మహిళ అర్జీ

- తక్షణం స్పందించిన సీఎం ప్రజావాణి ఇంచార్జి చిన్నారెడ్డి
- జర్మనీ, కెనడా ఇండియన్ ఎంబసీలకు లేఖ రాసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆడపడుచుకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్ (జనంసాక్షి) : కెనడాలో నివాసం ఉంటున్న తనకు చెప్పా పెట్టకుండా జర్మనీకి వెళ్లిపోయిన భర్త ముజమిన్ గులాబ్ నాయక్ వాడి ఆచూకీ కనుగొని న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాద్ లోని ఓల్డ్ మలక్ పేట్ కు చెందిన షబానా నస్రిన్ అహ్మద్ సీఎం ప్రజావాణిలో అర్జీ దాఖలు చేశారు. ఈ అంశంపై తక్షణం స్పందించి స్పందించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇన్చార్జ్ డాక్టర్ జి. చిన్నారెడ్డి ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రికి లేఖ రాసి నస్రీన్ కు న్యాయం చేయాలని కోరారు. శేషాద్రి ఆదేశాల మేరకు రాష్ట్ర సచివాలయ జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ ఎన్నారై విభాగం అధికారులు జర్మనీ, కెనడా ఇండియన్ ఎంబసీలకు, కేంద్ర ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖలకు లేఖ రాశారు. ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాలని ఎన్నారై మహిళా విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ను కోరుతూ కూడా జిఏడి ఎన్నారై విభాగం అధికారులు లేఖ రాశారు. ఈ మేరకు సీఎం ప్రజావాణి ఇంచార్జ్ జి చిన్నారెడ్డికి జిఏడి ఎన్నారై విభాగం జాయింట్ సెక్రెటరీ శివలింగయ్య తిరుగు సమాధానం ఇస్తూ లేఖ రాశారు. ఈ వ్యవహారం అంతా చకచకా నాలుగు రోజుల్లో జరిగిపోయాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ముజామిల్ తో ఆరెళ్ల క్రితం పెళ్లి జరిగిందని, కెనడా నుంచి ఇండియాకు రావాలంటే తన నాలుగేళ్ల బిడ్డకు ఇండియన్ పాసుపోర్టు సహా పలు డాక్యుమెంట్స్ పై తండ్రి సంతకాలు అవసరం అని, భర్త ఆచూకీ కోసం షబానా నస్రిన్ ఇచ్చిన పవర్ ఆఫ్ ఆటార్నీ ద్వారా తల్లి సెప్టెంబర్ 19న సీఎం ప్రజావాణిలో అర్జీ ఇచ్చారు. చిన్నారెడ్డి తక్షణ స్పందనతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. తెలంగాణ ఆడబిడ్డకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆమెకు పూర్తి భరోసాను కల్పిస్తూ నస్రీన్ కు న్యాయం చేసేందుకు యావత్ ప్రభుత్వం యంత్రాంగం కృషి చేస్తోంది.

## హైదరాబాద్‌లో పలుచోట్ల మరోమారు వర్షం

హైదరాబాద్, సెప్టెంబర్30 (జనంసాక్షి) : హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు బాగా ఎండ కాసింది. 2.40 నిమిషాల సమయంలో ఉన్నట్టుండి భారీ వర్షం మొదలైంది. అరగంట పాటు వర్షం దంచికొట్టింది. ఉన్నట్టుండి వర్షం పడ్డంతో జనాలు తీవ్ర ఇబ్బందుపడాల్సి వచ్చింది. మరో నాలుగు రోజులు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. అల్పపీడన ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడతాయని వెల్లడించింది. ఏపీలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. ఇక, అల్లూరి, పార్వతీపురం, కాకినాడ, యానాం, ఉభయ గోదావరి జిల్లాలతోపాటు నెల్లూరు, తిరుపతి జిల్లాలలో రానున్న 24 గంటల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నివారణ సంస్థ అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్లకు కీలక సూచనలు చేసింది.

## కరూర్ ఘటనపై తప్పుడు వార్తల ప్రసారం

- తమిళ యూట్యూబర్ అరెస్ట్

చెన్నై, సెప్టెంబర్30 (జనంసాక్షి) : తమిళనాడు రాష్ట్రంలోని కరూర్ జిల్లాలో టీవీకే చీఫ్ విజయ్ ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటనపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఓ యూట్యూబర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తొక్కిసలాట ఘటనపై తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నారంటూ ఫిర్యాదులు రావడంతో తమిళనాడు యూట్యూబర్ ఫెలిక్స్ జెరాల్డ్ ను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడు రెడ్‌పిక్స్ పేరుతో యూట్యూబ్ ఛానల్‌ను నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో తొక్కిసలాట ఘటనపై తన ఛానల్‌లో తప్పుడు వార్తలను ప్రసారం చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆయన్ని అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తాజాగా తెలిపారు. ఈ ఘటనపై తప్పుడు వార్తలను ప్రసారం చేస్తున్న మరో 25 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

# రేపు మద్యం, మాంసం దుకాణాల బంద్


- దసరా అయినా రూల్స్ తప్పవన్న జిహెచ్ఎంసి కమిషనర్



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : మద్యం, మాంసం ప్రియులకు జీహెచ్ఎంసీ షాకింగ్ న్యూస్ తెలిపింది. అక్టోబర్ 2వ తేదీన మాంసం దుకాణాలు బంద్ చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రకటించారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మాంసం దుకాణాలు, స్లాటర్ హౌస్‌లను జీహెచ్ఎంసీ పరిధిలో మూసివేయాలని కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. ఈ మేరకు కమిషనర్ ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే ఆ రోజు దసరా కావడంతో తప్పకుండా మాంసం దుకాణాలు తెలుస్తారని అంతా భావించారు. మహాత్మా గాంధీ జయంతికి మాంసం దుకాణాలు బంద్ చేయాలని జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం స్టాండింగ్ కమిటీలో ఆమోదించారని గుర్తుచేశారు. సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు పర్యవేక్షణ చేపట్టి సరైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈసారి గాంధీ జయంతి రోజునే దసరా రావడంతో మాంసం విక్రయదారులు అయోమయంలో పడ్డారు.మరోవైపు.. అక్టోబర్ 2వ తేదీ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా కూడా మాంసం షాపులతో పాటు మద్యం షాపులను కూడా మూసివేస్తున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏడాది మహాత్మా గాంధీ జయంతికి తెలంగాణ వ్యాప్తంగా ఈ రూల్‌ను పాటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది మహాత్మా గాంధీ జయంతి, దసరా పండుగలు ఒకే రోజు వచ్చాయి. ఈ క్రమంలో మద్యం షాపులను ప్రభుత్వం మూసివేస్తూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో దసరాను ఘనంగా చేసుకుంటారు. అయితే, ప్రభుత్వ నిర్ణయంపై ఏం చేయాలా అనే ఆలోచనలో మద్యం, మాంసం ప్రియులు ఉన్నారు.

# సిమెంట్ లోడుతో గంజాయి సరఫరా

- శివారులో భారీగా గంజాయి పట్టివేత
- 6కోట్ల విలువ ఉంటుందని అంచనా



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : మత్తుపదార్థాల నివారణకు ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా, వాటిని సరఫరా చేసే వారు కొత్త మార్గాలతో వెళుతున్నారు. సిమెంట్ బ్యాగుల మాటున గంజాయిని సరఫరా చస్తూ పట్టుబడ్డారు. దుండగులు ఎక్కడో ఓ చోట అక్రమంగా మాదకద్రవ్యాల రవాణా కొనసాగిస్తూ.. భావితరాల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల విద్యార్థుల భవిష్యత్ అంధకారమవుతుంది. ప్రభుత్వం ఎన్ని అవగాహన కార్యక్రమాలు, చర్యలు తీసుకున్న మాదకద్రవ్యాల వ్యాపారం మాత్రం ఆగడం లేదు. ఈ నేపథ్యంలో మత్తు పదార్థాల నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ఈగల్ టీమ్ పోలీసులు ఇతర అధికారుల సహకారంతో కలిసి ముమ్మరంగా తనిఖీలు చేస్తూ.. మాదకద్రవ్యాల రవాణాను చాల వరకు అడ్డుకున్నారని చెప్పవచ్చు. ఈ మేరకు ఈగల్ టీమ్ చేపట్టిన దాడుల్లో భారీ మొత్తంలో మత్తుపదార్థాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. తాజాగా మరోసారి నగరంలో భారీగా గంజాయి పట్టిబడింది. అబ్దుల్లాపూర్ మెట్‌లో భారీ మొత్తంలో గంజాయి పట్టుకున్నట్లు రాచకొండ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్ మెట్‌లో భారీగా గంజాయిను పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయిని ఒడిశా నుంచి రాజస్థాన్‌కు తరలిస్తుండగా అబ్దుల్లాపూర్ మెట్టు, కొత్తగూడ వద్ద తనిఖీ చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. దుండగులు అతి తెలివితో.. ఆఅట వ్యానులో సిమెంట్ బ్యాగుల చాటున గంజాయి దాచినట్లు చెప్పారు. తనిఖీల్లో భాగంగా.. డిసిఎంను తనిఖీ చేయగా ఆ సిమెంట్ బ్యాగుల మధ్య 1210 కిలోల గంజాయిను గుర్తించినట్లు పేర్కొన్నారు. గంజాయి విలువ సుమారుగా రూ.6 కోట్లుగా ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆఅఓను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# కరూర్ ఘటన కలచివేసింది

- నాపై కోపం ఉంటే చర్య తీసుకోండి
- టివికె నేత విజయ్ వీడియో సందేశం



చెన్నై, సెప్టెంబర్30 (జనంసాక్షి) : కరూర్ తొక్కిసలాటపై తమిళగ వెట్రి కజగం (టివికె) పార్టీ అధినేత విజయ్ వీడియో సందేశం విడుదల చేశారు. ఘటన జరిగిన తర్వాత తొలిసారి విజయ్ తన సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కరూర్ ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. నాపై అమితమైన ప్రేమతో ప్రజలు ర్యాలీకి తరలివచ్చారు. త్వరలోనే కరూర్ వెళ్లి బాధితులను పరామర్శిస్తా. మేము ఎలాంటి తప్పు చేయకున్నా మాపై కేసు పెట్టారు. నిజం త్వరలోనే బయటపడుతుంది. ఏం జరిగిందనేది ప్రజలకు వాస్తవాలు తెలుసు. ఇలాంటి పరిస్థితులను ఎప్పుడూ ఎదుర్కోలేదు. నా హృదయం ఆవేదనతో నిండిపోయింది. సిఎం స్టాలిన్ ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్నారా. స్టాలిన్ కావాలంటే నాపై ప్రతీకారం తీర్చుకోవచ్చు. కానీ, నాపై కోపం.. మా నాయకులపై చూపించవద్దు. కరూర్‌లో ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది. నేను ఎప్పుడూ ఎవరికీ అపకారం తలపెట్టలేదు. మా నాయకులపై కేసులు ఎందుకు పెడుతున్నారు. ర్యాలీ కోసం అన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఊహించని ఘటన జరిగింది. ఇకపై మరింత బలంగా ప్రజల్లోకి వెళ్తాం' అని అన్నారు.

# డీలక్స్ బస్సులో ఫ్రీ టికెట్ ఇవ్వండి

- కండక్టర్ నిరాకరణతో బస్సుకు అడ్డంగా పడుకుని మహిళ హల్‌చల్




కొత్తగూడెం, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : డీలక్స్ బస్సు ఎక్కిన మహిళ తనకు ఫ్రీ టికెట్ ఇవ్వాలంటూ హల్ చల్ చేసిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చోటు చేసుకుంది. లక్ష్మి దేవిపల్లి మండలం శేషగిరినగర్ పంచాయతీకి చెందిన బోయ చిట్టి (36) కొత్త గూడెం బస్టాండ్లో ఖమ్మం వెళ్లే డీలక్స్ బస్సు ఎక్కింది. ఆధార్ కార్డు చూపుతూ తనకు ఫ్రీ టికెట్ ఇవ్వాలని కండక్టర్ ను అడిగింది. అయితే ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే మహిళలకు ఫ్రీ టికెట్ ఇస్తారని, డీలక్స్ లో ఉచిత ప్రయాణం లేదని కండక్ట ర్ ఆమెకు చెప్పాడు. అయినా వినకుండా తనకు ఫ్రీ టికెట్ ఇవ్వాలని ఆమె కండక్టర్ తో వాదనకు దిగింది. దాంతో కండక్టర్ చిట్టిని చుంచుపల్లి మండలం విద్యానగర్ లో బస్సు నుంచి కిందికి దించాడు. దాంతో తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసినమహిళ బస్సుకు అడ్డుగా పడుకొని హల్ చల్ చేసింది. బస్సు కండక్టర్, తోటి ప్రయాణికులు చెప్పినా వినక పోవడంతో కండక్టర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకొని మహిళకు నచ్చజెప్పి పంపించారు. మహిళా ప్రయాణికురాలు బస్సుకు అడ్డంగా కూర్చోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## చిన్న కంట్రాక్టర్లకు దసరా కానుక

### 5లక్షల వరకు చెల్లింపులకు ఆర్థిక శాఖ నిర్ణయం

అమరావతి, సెప్టెంబర్30 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ దసరా పండుగ వేళ చిన్న కాంట్రాక్టర్లకు శుభవార్త చెప్పింది. దీంతో 2014-19 మధ్య పనులు చేసి సుదీర్ఘ కాలంగా బిల్లుల కోసం వేచిచూస్తున్న చిన్న కాంట్రాక్టర్లకు భారీ ఊరట లభించనుంది. వీరికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించారు. రూ.5 లక్షల మేర పనులు చేసిన అన్ని బిల్లులు చెల్లించాలని ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. అలాగే.. 2019 నుంచి నేటి వరకు చేపట్టిన వాటిలో రూ.5 కోట్ల మేర బిల్లుల చెల్లింపులు కూడా చేస్తున్నట్లు ప్రకటించింది. ఆర్థిక శాఖ నిర్ణయం తో దాదాపు రూ.400 కోట్ల మేర చిన్న కాంట్రాక్టర్లకు లబ్ది చేకూరనుంది.ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి ఇప్పటి వరకు పలు దఫాలుగా నాటి పెండింగ్ బిల్లుల చెల్లింపులను చేసుకుంటూ వచ్చింది. దసరా పండుగ సందర్భం గా బిల్లుల చెల్లింపుల పక్రియ భారీగా చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఆర్థిక శాఖ నిర్ణయం తీసుకుంది. ఒకటి, రెండు రోజుల్లో చిన్న కాంట్రాక్టర్ల అకౌంట్లలోకి బిల్లుల సొమ్ము జమ కానున్నట్లు సమాచారం.

# ఆగివున్న ఆటోను ఢీకొన్న లారీ

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం

కర్నూలు, సెప్టెంబర్30 (జనంసాక్షి) : పత్తికొండలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న ఆటోను లారీ ఢకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుగ్గలి మండలం ముకెల గ్రామానికి చెందిన భూమిక (26), నితిక (5) తల్లీకూతుళ్లు. వారిద్దరూ శిరీష (30)తో కలిసి పండుగ సరుకుల కోసం పత్తికొండకు వచ్చారు. పండుగ, సరుకులు తీసుకుని తమ గ్రామమైన ముక్కెళ్ల గ్రామానికి వెళ్లడానికి ఆటోలో బయలుదేరారు. అయితే మార్గం మధ్యలో బియ్యం లోడుతో వెళ్తున్న లారీ బ్రేకులు ఫెయిలై ఆటోను ఢకొ?ట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సిఎం రేవంత్‌ను కలిసిన క్రికెటర్ తిలక్ వర్మ

- శాలువా కప్పి అభినందించిన రేవంత్ రెడ్డి
- ఒత్తిడిని జయించి బ్యాటింగ్ చేశామని వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 30 (జనంసాక్షి) : ఆసియా కప్-2025 ఫైనల్ మ్యాచ్ లో పాక్‌పై భారత్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయంలో కీలకపాత్ర పోషించిన తిలక్ వర్మ తాజాగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తిలక్ వర్మను రేవంత్ సత్కరించి అభినందించారు. తిలక్ సీఎంకి తన బ్యాట్‌ను బహూకరించాడు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ ఛైర్మన్ శివసేనా రెడ్డి, శాట్స్ ఎండీ సోనిబాల దేవి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. తిలక్ వర్మ లింగంపల్లిలోని లేగల గ్రౌండ్‌కు వెళ్లారు. అక్కడ శిక్షణ పొందుతున్న ఆటగాళ్లతో సరదాగా ముచ్చటించారు. అనంతరం తిలక్ వర్మ మీడియాతో మాట్లాడుతూ.. జట్టు సభ్యులం అందరం కలిసి టీమిండియా గెలుపు కోసం కృషి చేశాం అని ఆసియా కప్ 2025 ఫైనల్ హీరో, తెలుగు ఆటగాడు తిలక్ వర్మ తెలిపాడు. ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై మన దేశాన్ని గెలిపించాలనే లక్ష్యంతోనే ఆడానని చెప్పాడు. ఆసియా కప్ ఫైనల్‌లో చాలా ఒత్తిడిలోనే తాను బ్యాటింగ్ చేశానన్నాడు. ఆసియా కప్ టోర్నీలో అందరం సమష్టిగా కష్టపడ్డాం అని తిలక్ వర్మ పేర్కొన్నాడు. ఫైనల్‌లో చివరి నిమిషం వరకు నరాలు తెగే ఉత్కంఠ కొనసాగిన విషయం తెలిసిందే. ఓటమి తీరాలకు వెళు ్తన్న మ్యాచ్‌కు ఒంటరి పోరాటంతో తిలక్ గెలుపు బాటలు వేశాడు. ఆసియా కప్ 2025 ఫైనల్‌లో తిలక్ వర్మ వీరోచిత పోరాటంతో తెలుగోడి సత్తా ప్రపంచానికి చాటి చెప్పాడు. 53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులతో 69 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. హైఓల్టేజ్ మ్యాచ్‌లో చెలరేగిన తిలక్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. మనోడిపై అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు. తిలక్ సోమవారం యూఏఈ నుంచి హైదరాబాద్ చేరుకున్నాడు. శంషాబాద్ ఎయిర్ పోర్టులో అతడికి ప్రభుత్వ అధికారులు, ఫాన్స్ ఘన స్వాగతం పలికారు. 'చాలా సంతోషంగా ఉంది. ఆసియా కప్ ఫైనల్‌లోని ఇన్నింగ్స్ ఎప్పటికీ గుర్తుంటుంది. ఫైనల్‌లో అందరం సమష్టిగా కష్టపడ్డాం. నేను చాలా ఒత్తిడిలోనే బ్యాటింగ్ చేశా. దేశాన్ని గెలిపించాలన్న లక్ష్యంతో ఆడా. పాకిస్థాన్ ప్లేయర్స్ చాలా ఒత్తిడికి గురిచేశారు, అయినా పట్టించుకోలేదు. మ్యాచ్ గెలిచి వారికి ధీటుగా బదులివ్వాలని అనుకున్నా. టోర్నీలో ప్రతి మ్యాచ్‌లో వ్యూహాలు మార్చుకుంటూ ముందుకువెళ్లాం. నా విజయంలో తల్లిదండ్రులు, కోచ్ దే కీలక పాత్ర. నా క్రికెట్ కెరీర్ కోసం చిన్నప్పటినుంచి ఎంతో కృషి చేశారు' అని చెప్పాడు.

# ఎయిర్‌బస్‌కు గోల్డ్ స్టాండర్డ్ వేదికగా ఆంధ్రప్రదేశ్

- ప్రోగ్రెసివ్ ఏరోస్పేస్ పాలసీ, ప్రత్యేక ప్రోత్సాహకాలు
- ఎయిర్‌బస్ బోర్డు సమావేశంలో మంత్రి లోకేశ్ వివరణ



న్యూఢిల్లీ, సెప్టెంబర్30 (జనంసాక్షి) : రాష్ట్రంలో ఎయిర్ బస్‌కు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఏపీ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ప్రోగ్రెసివ్ ఏరోస్పేస్ పాలసీ, ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. మల్టిపుల్ ఏరోస్పేస్ కారిడార్, ఎయిర్‌పోర్టులు, పోర్టులతో అనుసంధానంపై వివరించారు. వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండోతో అన్నీ అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఎయిర్‌బస్‌కు గోల్డ్ స్టాండర్డ్ వేదికగా ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. మంగళవారం ఎయిర్ బస్ సంస్థ బోర్డు సమావేశానికి హాజరయ్యారు. మేకిన్ ఇండియా కార్యాచరణలో భాగంగా ఎయిర్ బస్ సంస్థ తొలిసారిగా తన బోర్డు సమావేశాన్ని ఢిల్లీలో నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి హాజరైన నారా లోకేశ్ ఏపీకి రావాలంటూ ఎయిర్ బస్ ప్రతినిధులను ఆహ్వానించారు. ఏపీలో ప్రపంచస్థాయి ఏరోస్పేస్ తయారీ కేంద్రం ఏర్పాటుకు లోకేశ్ ఈ సందర్భంగా ప్రతిపాదన చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు అనువైన భూమి ఉందని వివరించారు. రాష్ట్రంలో ఎయిర్ బస్‌కు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ప్రోగ్రెసివ్ ఏరోస్పేస్ పాలసీ, ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. మల్టిపుల్ ఏరోస్పేస్ కారిడార్, ఎయిర్‌పోర్టులు, పోర్టులతో అనుసంధానంపై వివరించారు. వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండోతో అన్నీ అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఎయిర్‌బస్‌కు గ్లోబల్ స్టాండర్డ్ వేదికగా ఆంధ్రప్రదేశ్ అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370